మే - 2024

DECCAN LAND, HYDERABAD


141

MAY - 2024

₹ 30

# దక్కన్ ల్యాండ్

సామాజిక రాజకీయ మాసపత్రిక



UNESCO Site Inscription : 2012 - WESTERN GHATS

VOL 12వ వసంతంలో

141 ISSUES నూట నలభై ఒకటవ సంచిక

పూర్తి చేసుకున్న దక్కన్ ల్యాండ్

- సుందర నగరాల్లో ఛిద్రమౌతున్న బాల్యం
- చరిత్ర గుట్టు బయటపెట్టే నాణేలు
- పగటివేషం - పరమార్థం
- చరిగొండ చరిత్ర

# చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ
హైదరాబాద్ (Regd. 720/1982)

బాల చెలిమి
పిల్లల వికాస పత్రిక

## తెలంగాణ బడి పిల్లల కథలు



10 పుస్తకాల సెట్ ధర రూ.330 • తగ్గింపు ధర రూ. 300

పిల్లలకు అత్యంత ఆనందానిచ్చేది ఆట బొమ్మలు, కథల పుస్తకాలే. పాఠ్యపుస్తకాలు అందించే జ్ఞానానికి సమాంతరంగా మరెంతో లోకజ్ఞానాన్ని అందించేది బాల సాహిత్యమే. పుస్తకాలు పిల్లల ఆలోచనా నైపుణ్యాలను పెంచుతాయి. వారి ఊహలకు ప్రాణం పోస్తాయి. వారిలో సృజనాత్మకతను పెంచుతాయి. చరిత్ర, సంస్కృతి, కళలు, సైన్స్, మానవ స్వభావాలు, జంతు స్వభావాలు, ఆరోగ్య సంబంధిత అంశాలు - ఒకటేమిటి ప్రాథమిక విజ్ఞానఖని బాలసాహిత్యం, పిల్లలో నైతికతను, ఆధ్యాత్మికతను, సక్రమమైన ప్రవర్తనను, మంచి చెడుల అవగాహనను పెంచే బాధ్యతను బాలసాహిత్యమే నెరవేర్చగలదు.

ఇవి అచ్చంగా మన పిల్లలు రాసిన కథలు, స్వచ్ఛమైన కథలు. 'చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ' తెలంగాణలోని ఉమ్మడి 10 జిల్లాల **"బడి పిల్లల కథలు"** సంకలనాలుగా అందమైన బొమ్మలతో గతంలో వెలువరించింది. అవి రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ విశేష ఆదరణ పొందాయి.

అలాగే ఇప్పుడు పిల్లలకోసం తెలంగాణలోని ఉమ్మడి పది జిల్లాల బాల సాహిత్య రచయితలు రాసిన **"పెద్దలు రాసిన పిల్లల కథలు"** పది సంకలనాలను అందమైన బొమ్మలతో వెలువరించింది. చిన్నారులు, పెద్దలు, సాహితీ వేత్తలు ఎప్పటివలె ఈ పుస్తకాలను ఆదరిస్తారని ఆశిస్తున్నాం.

**-మణికొండ వేదకుమార్**
చైర్మన్, చిల్డ్రన్స్ ఎడ్యుకేషన్ అకాడమీ

## పెద్దలు రాసిన పిల్లల కథలు (ఉమ్మడి పది జిల్లాలు)



10 పుస్తకాల సెట్ ధర రూ.350 • తగ్గింపు ధర రూ. 300







**ప్రతులకు**

అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలు. మరియు
'భూపతి సదన్' 3-6-716, స్ట్రీట్ నెం.12,
హిమాయత్‌నగర్, హైదరాబాద్-500029
ఫోన్ : 9030 6262 88
*email: edit.chelimi@gmail.com website : www.balachelimi.com*

## చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ ప్రచురించిన ఇతర పుస్తకాలు






# WESTERN GHATS

## జీవవైవిధ్యంతో పశ్చిమ కనుమలు

### UNESCO చే 2012లో గుర్తింపు

భారతదేశ పశ్చిమ తీరం పొడుగునా కొండల గొలుసుగా ఉండే పశ్చిమ కనుమలు హిమాలయ పర్వతాల గొలుసు కంటే ప్రాచీనమైనవి. ఇవి ఈ ప్రాంతపు ఉష్ణ వాతావరణాన్ని చల్లబరిచేలా భారతీయ రుతుపవనాల తీరుతెన్నులను మారుస్తాయి. వీటికి ఉన్న మరో విశిష్టత జీవపరమైన వైవిధ్యత, స్థానికంగానే కనిపించే కొన్ని జీవజాతులు. ఇవే వీటికి ప్రకృతి పరిరక్షణపరంగా అపరిమిత ప్రాధాన్యాన్ని కూడా అందించాయి. ఈ పశ్చిమ కనుమలు జీవుల చెల్లాచెదురు, రకాలకు సంబంధించిన అవుట్ ఆఫ్ ఆఫ్రికా, అవుట్ ఆఫ్ ఆసియా సిద్ధాంతాల విప్లవాత్మక ఎకోటోన్ లను ప్రదర్శిస్తాయి.

TELANGANA
RESOURCE CENTRE

**"CHANDRAM"** 3-6-712/2, St.No. 12, Himayatnagar, Hyderabad - 500 029.
Fax: 040-27635644Mobile: 9030626288
E-mail: desk.deccan@gmail.com website : www.deccanland.com







## మన పీవీ 'భారత రత్నం'

మార్చి సంచికలో చాలా మంచి వ్యాసాలు వచ్చాయి. ముందుగా ప్రస్తావించాల్సింది పీవీ నర్సింహరావు గారి గురించి. అంత విజ్ఞుడు అయిన అతి సామాన్యంగా జీవించడం, భారత నూతన ఆర్థిక వ్యవస్థకు రూపకల్పన చేయడం, సాహసోపేతమైన నిర్ణయాలను తీసుకున్నారు. అంతే కాదు తెలంగాణలో ఆయన చూసిన ఫ్యూడల్ భావనలో నుండి భూసంస్కరణలు చట్టం రూపొందించారు. తెలంగాణ జీవిత చిత్రాన్ని 'గొల్ల రామవ్వ' కథలో చెప్పిన తీరు చాలా బాగుంటుంది. తెలంగాణలోని నిజాం నిరంకుశ పాలనను, రజాకార్ల వ్యవస్థను అందులో మనం చూడొచ్చు. కాంగ్రెస్ పార్టీ కష్ట కాలంలో ఉన్నప్పుడు ప్రధానమంత్రి పదవి చేపట్టి పార్టీకి సైనికుడు అని నిరూపించుకున్నారు. విదేశాంగ మంత్రిగా భారత్ పాక్ మధ్య రావి నది జలాల ఒప్పందానికి కృషి చేసారు. 8వ ప్రణాళికకు తగు సూచనలు, సలహాలు ఇచ్చి, రావ్ మన్మోహన్ నమూనాను అమలు చేసి, మానవ వనరుల శాఖ మంత్రిగా కూడా కీలకమైన పాత్ర పోషించారు. రెసిడెన్షియల్ పాఠశాలలు, నవోదయ పాఠశాలలను ఫామ్ చేసి, గ్రామీణ ప్రాంత పిల్లలకు నాణ్యమైన విద్య అందించడానికి ప్రయత్నం చేశారు.

2024 సంవత్సరంలో ఆయనకు భారత రత్న రావడం సంతోషకరం. నిజమైన భారత రత్నం పీవీ. జీవితాంతం తాను నమ్మిన విలువల కోసం నిలబడ్డ మనిషి. తాను నిలబడ్డ సిరిసిల్లలో చేనేత కార్మికుల కోసం ఒక ప్రాంతీయ విద్యుత్ సహకార మండలిని మంజూరు చేయించి తననురాజకీయంగా నిలబెట్టిన గడ్డకు సేవ చేసినాడు. ఒకే పార్టీలో 77 సంవత్సరాలు ప్రయాణం చేసిన నిజమైన పార్టీ సేవకుడు. పార్టీ యజ్ఞంలో నేను సమిధను, అధికారం చేతిలో కరవాలం, గమ్యం, మానవత్వం అని ప్రకటించిన ప్రజానాయకుడు. ఆయన పేరు మీదుగా తాను రాజకీయంగా ఎదిగిన సిరిసిల్లలో పీఎం మిత్ర కింద రాష్ట్రానికి వచ్చిన టెక్స్టైల్ పార్క్ ఫామ్ చేసి దానికి ఆయన పేరు పెడితే బాగుంటుంది అనుకుంటున్నాను. తెలంగాణ చేసిన ప్రయాణానికి సాక్షి ఆయన. పీవీ నుండి నేటి తరం నేర్చుకోవాల్సింది ఒక మనిషి తాను నమ్మిన విశ్వాసాల కోసం, తాను నమ్మిన విలువల కోసం జీవించినంత కాలం నిలబడడం అనే గొప్ప సుగుణంని అలవర్చుకోవాలి. అదే ఆయనకు నివాళి.

**– భారత అవినాష్,** జనగామ

## రాజ్యాంగ రూపశిల్పి అంబేద్కర్

ఏప్రిల్ 14న డా॥ భీమ్‌రావ్ రామ్‌జీ (బిఆర్) అంబేద్కర్ జయంతి సందర్భంగా రచయిత ఎసికె. శ్రీహరి చాలా చక్కటి ఇన్ఫర్మేషన్ తెలియజేశారు. అంబేద్కర్ భారత దేశపు మూలస్థంభపు పునాది ఏంటో తన అధ్యయనం ద్వారా కనిపెట్టారు. అందుకోసం తన జీవితాన్ని అంకితం చేశారు. అన్ని రంగాలకు వర్తించే ఒక తాత్విక శక్తిగా ప్రజాస్వామ్యాన్ని మలచుకుని, విద్యాభ్యాసం తర్వాత ఆర్థికవేత్తగా, విశ్వవిద్యాలయాల్లో అధ్యాపకునిగా, న్యాయవాదిగా విభిన్న పాత్రలు పోషించారు. సమానత్వం, సమన్యాయం లక్ష్యాల కోసం పరితపించిన వ్యక్తి. ఆధునిక భారతావనికి కోసం అంబేద్కర్ ఎనలేని కృషి చేశారు. దేశ పౌరులందరూ ఆయన జీవిత చరిత్రను చదవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. వారి రచనలను అధ్యయనం చేయాలి. దక్కన్‌ల్యాండ్ యాజమాన్యానికి ప్రత్యేక ధన్యవాదాలు.

**– కె. భాస్కర్,** నల్లగొండ

❖ ❖ ❖

## కొల్లేటి జాడలు

రచయిత డా. జె. నీరజ గారు అందించిన వ్యాసం 'కొల్లేటి జాడలు నవల – పర్యావరణ వివేచన'లో ప్రకృతి గురించి తెలియని ఎన్నో విషయాలు తెలియజేశారు. కొల్లేటి సరస్సు గురించి సినిమాలు, డాక్యుమెంటరీలు వచ్చాయి. అనేక సంవత్సరాలుగా స్వచ్ఛంద సంస్థలు పర్యావరణ గురించి పోరాడుతున్నాయి. మనిషి అత్యాశ వల్ల పుడమితల్లిని గాయాల పాలు చేస్తున్నాడు. భూగోళాన్ని ఆవరించి ఉన్న పరిసరాలలోని జీవనిర్జీవాలన్నింటిని కలిపి పర్యావరణం అంటే, అందులో ఉండే జీవులన్నిటికీ ప్రాణాధారమైన గాలి, నీరు, ఆహారం, వెలుతురు రోజువారీ కార్యకలాపాలను నిర్వహించడానికి అత్యంత ఆవశ్యకమైన అవసరాలు. ప్రకృతి ఏర్పరచిన ఆహార చక్రం మానవ జాతి చర్యల వల్ల సమతుల్యం లోపిస్తున్నది.

**– బి. రమణీ,** కర్నూలు

## పరిశోధకులకు శుభవార్త దక్కన్ ల్యాండ్‌కు ISSN ఆమోదం

**దక్కన్ ల్యాండ్ మాసపత్రిక** ISSN (International Standard Serial Number) **ఆమోదం పొందినదని తెలియజేయడానికి సంతోషిస్తున్నాం. మా** ISSN **2581-3188. ప్రముఖ, ఔత్సాహిక, పరిశోధకులు తమ పరిశోధనాత్మక, విశ్లేషణాత్మక రచనలను ప్రచురింప జేసి వినియోగించుకోవడం ద్వారా ప్రాచుర్యం చేసుకోవడానికి ఈ సదవకాశాన్ని సద్వినియోగపరుచుకోవాలని కోరుతున్నాం.**

**రచయితలు తమ రచనలను పంపవలసిన చిరునామా :**
**"చంద్రం"** 3-6-712/2, St.No. 12, Himayatnagar, Hyderabad - 500 029 Telangana.
**సంప్రదించవల్సిన ఆఫీస్ ఫోన్ : 9030626288**
E-mail: desk.deccan@gmail.com
website: www.deccanland.com

**- ఎడిటర్**

ISSN 2581-3188

విషయసూచిక


# దక్కన్ ల్యాండ్

సామాజిక, రాజకీయ మాసపత్రిక

సంపుటి: 12 సంచిక : 9 పేజీలు : 60

మే - 2024

సంపాదకులు
**మణికొండ వేదకుమార్**
9848044713
edit.deccan@gmail.com

సహాయ సంపాదకులు
**కట్టా ప్రభాకర్**

సర్క్యులేషన్
**హెచ్. మోహన్‌లాల్**

వాణిజ్య ప్రకటనలు
**సయ్యద్ ఖైజర్ భాష**
9030626288

ఫొటోగ్రాఫర్
**టి.స్వామి**

కవర్‌పేజీ
**పశ్చిమ కనుమలు**

layout & composing @
CHARITHA IMPRESSIONS

printed @ DECCAN PRESS
ఆజామాబాద్, హైదరాబాద్-500 020

కార్యాలయ చిరునామా

DECCAN LAND
"CHANDRAM" 3-6-712/2, St.No. 12,
Himayatnagar, Hyderabad - 500 029
TELANGANA
Mobile: 9030626288
Fax: 040-27635644
E-mail: desk.deccan@gmail.com
website : www.deccanland.com

**కృతజ్ఞతలు**
దక్కన్ ల్యాండ్ మాసపత్రికకు సలహాలు, సూచనలు అందించిన వివిధ రంగాల నిపుణులకు మా కృతజ్ఞతలు.





# లోపలి పేజీల్లో...

మాకూ...
జీవించే స్వేచ్ఛ నివ్వరూ...
@ గ్రేట్ ఇండియన్ బస్టర్డ్



ముత్తాతల కాలం నాటి
జీవామృతాలు -
తృణధాన్యాలు




అనుముల కృష్ణమూర్తి ...... వి.ఆర్. విద్యార్థి ...... 6
ప్రజాస్వామ్య పరిరక్షణ అంటే రాజ్యాంగ పరిరక్షణ...... (ఎడిటోరియల్)వేదకుమార్. యం ...... 7
కెంపుల సొంపులు ...... చకిలం వేణుగోపాల్‌రావు ...... 9
దిక్కూమొక్కులేని దేవాలయాలు ...... ఈమని శివనాగిరెడ్డి-స్థపతి ...... 12
రాచిప్పల పచ్చిపులుసు ...... పరవస్తు లోకేశ్వర్ ...... 13
గ్రేట్ ఇండియన్ బస్టర్డ్ ...... పుట్టా పెద్ద ఓబులేసు ...... 17
కర్ణాటక రాష్ట్రంలోని జియో హెరిటేజ్ స్థలాలు ...... కమతం మహేందర్‌రెడ్డి ...... 21
సుందర నగరాల్లో ఛిద్రమౌతున్న బాల్యం ...... ప్రొఫెసర్ శాంతాసిన్హా...... 23
జీవవైవిధ్యంతో పశ్చిమ కనుమలు ...... సోనాలి ఘోశ్ ...... 29
సంక్షోభంలో జ్ఞాన భాండాగారాలు ...... సువేగా ...... 31
చరిగొండ చరిత్ర ...... శ్రీరామోజు హరగోపాల్ ...... 33
బి.పి. మండల్ ...... దక్కన్ న్యూస్ ...... 36
స్వేచ్ఛా విహంగులం! ...... డా॥ లచ్చయ్య గాండ్ల ...... 37
త్యాగానికి చిరునామా అమ్మ ...... సత్యప్రసన్న ...... 40
పగటివేషం - పరమార్థం ...... డా॥ బి. భీమమ్మ ...... 41
ప్రపంచ వారసత్వ దినోత్సవం ...... ఎసికె. శ్రీహరి ...... 45
చరిత్ర గుట్టు బయటపెట్టే నాణేలు ...... దెమె రాజారెడ్డి ...... 47
దక్షిణ భారత నాణ్యాల సంస్థ వార్షిక సమావేశం ...... దక్కన్ న్యూస్ ...... 50
ఉమ్మడి వరంగల్ జిల్లా - గ్రామ నామాలు ...... డా॥ మండల స్వామి ...... 52
కాలంతో పయనించేవాడే కవి ...... భీంపల్లి శ్రీకాంత్ ...... 54
ముత్తాతల కాలం నాటి జీవామృతాలు - తృణధాన్యాలు ...... సముద్రాల ధనుంజయ ...... 55
జల్లేపల్లి పాఠశాల గ్రంథాలయం ...... ఏ. ఝాన్సీ లక్ష్మి ...... 57
అందరి కోసం (కథ) ...... కె. రేవతి ...... 58


**'దక్కన్ ల్యాండ్'**లో అచ్చవుతున్న రచనలలో వ్యక్తమవుతున్న అభిప్రాయాలన్నింటితో సంపాదకులకు ఏకీభావం ఉండాల్సిన అవసరం లేదు. 'దక్కన్ ల్యాండ్'ను పర్యావరణ, వారసత్వ సంపద, సంస్కృతి, జీవవైవిధ్య అభిప్రాయ వేదికగా, రాజకీయార్థిక, సామాజిక విశ్లేషణావేదికగా తీర్చిదిద్దాలన్నదే మా సంకల్పం. అందుకు అనుగుణంగానే అన్ని రకాల అభిప్రాయాలకు, భిన్నాభిప్రాయాలకూ స్థానం కల్పించాలన్నది మా ఉద్దేశం. వివిధ రంగాల్లో నిపుణుల రచనలను అందించడం ద్వారా ఆయా అంశాలపై, పరిష్కార మార్గాలపై పాఠకుల్లో అవగాహన పెంపొందించడమే **'దక్కన్ ల్యాండ్'** లక్ష్యం.

# అనుముల కృష్ణమూర్తి

"ఎవని మనసు శిశు స్వచ్ఛమెవని బుద్ధి
జాతి చైతన్య సంపన్నమెవని యాత్మ
సర్వతో ముఖ కల్యాణ సవనకుండ
మట్టివాని గుండెల నుండి బుట్టు కవిత"

అని కవికి కవితోత్రికి భాష్యం చెప్పిన అనుముల కృష్ణమూర్తి గారు కొద్దికృతులు మాత్రమే వెలువరించినా కవులలో మహాకవి, పండితులలో మహా పండితులు.

ఆంధ్రనగరికి (ఓరుగల్లుకు) అనుబంధంగా మణిగిరి (మడికొండ) అనే గ్రామమున్నది. అది తెలుగుదేశంలోనే ప్రఖ్యాతిగాంచిన గ్రామం. ఎందుకంటే ఆ గ్రామం నిండా పండితులు, కవులే. కాళోజీ సోదరులు, వానమామలై సోదరులు, పల్లా దుర్గయ్య గారు, బిరుదురాజు రామరాజు, అనుముల వంశం, మోత్కూరి వంశం ఇలా.. ఎన్ని కవి పండిత కుటుంబాలో, అలాంటి గ్రామంలో మే 16, 1923న ఒక అనుముల వంశంలో శ్యామలాదేవి, పండరినాథ శాస్త్రి దంపతులకు అనుముల కృష్ణమూర్తి గారు జన్మించారు.



వీరి వంశంలో పూర్వీకులు కృష్ణయ్య గారు ఎక్కడి నుండో వచ్చి వరంగల్‌కు కొంతదూరంలో ఉన్న 'ఉప్పుల' గ్రామంలో స్థిరపడ్డారు. వీరి పెద్దకుమారులు రామకృష్ణయ్య గారు, అనుముల కృష్ణమూర్తి తాతగారు (పితామహులు) భాగవత పారాయణం చేస్తుండేవారు. వేద పండితులు, మంత్రశాస్త్రాన్ని అధ్యయనం చేసినవారు.

సాహిత్యంపై అపార గౌరవమున్న మడికొండ దొర తౌటంరెడ్డి గోపాలరెడ్డి గారు రామకృష్ణయ్య గారిని మడికొండకు ఆహ్వానించి వారి జీవిక కోసం కొంత భూమినిచ్చారు. అట్లా రామకృష్ణయ్య గారు మడికొండలో స్థిరపడ్డారు. అనేక ధార్మికపరమైన కార్యక్రమాలు నిర్వహిస్తూ గ్రామవాసుల గౌరవాభిమానాలను పొందారు.

గ్రామానికి తూర్పున ఉన్న పొడవాటి మెట్టుగుట్టపై రామలింగేశ్వరాలయం వారికి భక్తిదాయకమైనవది. అనుముల కృష్ణమూర్తి గారు మెట్టు రామలింగేశ్వర శతకం రాశారందుకే. క్రమం తప్పకుండా మడికొండలో భాగవత సప్తాహాలు జరిపి అన్నదాన కార్యక్రమాలు జరుపుతుండేవారు.

రామకృష్ణయ్య గారికి ఐదుగురు కుమారులు. పెద్దకొడుకు సీతారామయ్య వేదాధ్యయన పరులు. రెండోకొడుకు జగన్నాథం, మూడో కుమారుడు లక్ష్మణశాస్త్రి. సంస్కృతాంధ్ర భాషల్లో పండితులు, వేదం నేర్చుకున్నారు. నాలుగో కొడుకు విశ్వనాథశాస్త్రి (అనుముల కృష్ణమూర్తి గారిని దత్తత తీసుకున్నవారు) ఐదో కొడుకు పండరినాథ శాస్త్రి (కృష్ణమూర్తి గారి కన్నతండ్రి) ఉభయ వేదాంతా చార్యులు. వీరు హిందీ, సంస్కృతం, కన్నడ భాషల్లో పండితులు. చిత్రమేమిటంటే పండరినాథ శాస్త్రి గారికి పంతొమ్మిదేళ్ల వయస్సొచ్చేవరకు కూడా చదువు సంధ్యలులేవు. బలాదూరుగా తిరిగేవారు. కానీ ఇరుగుపొరుగు, బంధువులు, కుటుంబ సభ్యులు వీరిని చదువురాని వాడవని ఎగతాళి చేస్తుంటే తట్టుకోలేక తల్లి నగలు దొంగిలించి కాశీకి పారిపోయారు. అక్కడ సద్గురువుల ఆశీస్సులు పొంది సంస్కృతం నేర్చుకున్నారు. బహుశాస్త్ర కోవిదులయ్యారు.

ఇది తెలిసి పండరినాథ శాస్త్రి గారి అన్నలు కాశీకి వెళ్లి తమ్ముడిని కలుసుకొని నచ్చజెప్పి మడికొండకు తీసుకువచ్చారు. పెళ్ళి చేసి వారికి స్థిరనివాసం ఏర్పాటు చేశారు. పండరినాథ శాస్త్రి గారికి ఇద్దరు కుమారులు, నలుగురు కుమార్తెలు. వీరిలో రెండవ కుమారులే అనుముల కృష్ణమూర్తి గారు.

కృష్ణమూర్తి గారు చదువులో చాలా చురుకు. అందుకే సంస్కృతం, ఇంగ్లీష్, తెలుగు, ఉర్దూ భాషల్లో పండితులు. ఫార్సీ, అరబీలలో మంచి ప్రవేశం ఉంది. సంస్కృతం వానమామలై వరదాచార్ల తండ్రి బక్కయ్య శాస్త్రి గారి వద్ద నేర్చుకున్నారు. ఫార్సీ, అరబీ మౌల్వీ సమయుజ్జీమా వద్ద నేర్చుకున్నారు. ఉర్దూ భాష పరిసరాల ప్రభావంతో సహజంగా అబ్బింది. మెట్రిక్యులేషన్ (సంస్కృతం)లో హైదరాబాద్ స్టేట్‌కు డొమినియన్ ఫస్ట్ వచ్చారు.

మడికొండకు చెందిన ఉస్మానియా విశ్వవిద్యాలయ ఆచార్యులు పల్లా దుర్గయ్య గారి ఇంట్లో ఉంటూ బీఏ, బీకాం, బీఈడీ చేశారు. ఆదిలాబాద్ జిల్లా చెన్నూరులో ప్రప్రథమంగా ఉపాధ్యాయులుగా ఉద్యోగంలో చేరి మధిర, ఖిలా వరంగల్, కోస్గి, మానుకోట, నిర్మల్, భువనగిరిలోనూ తిరిగి హన్మకొండ, వరంగల్లులో పనిచేసి ప్రమోషన్‌పై పెద్దపల్లి జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా వెళ్లారు. ఆ తర్వాత పర్కాలా, సుల్తానాబాద్‌లలో పనిచేసి సుల్తానాబాద్ నుండే 1978లో రిటైర్ అయ్యారు.

కృష్ణమూర్తి గారి వివాహం 1942లో మేనమామ కూతురు నర్సమాంబ గారితో అయ్యింది. వీరికి ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు. పెద్దకుమార్తె డాక్టర్ సరస్వతి, ప్రభుత్వ డాక్టర్‌గా పనిచేసి రిటైరయ్యారు. రెండోకూతురు ఉమ చదువుకున్నా ఉద్యోగంలో చేరలేదు. మూడో కూతురు రమ మదనపల్లిలోని రిషీ వ్యాలీ స్కూలులో (జిడ్డు కృష్ణమూర్తి స్థాపించిన) అధ్యాపకురాలిగా ఉద్యోగం చేస్తూ గ్లోబల్ లెవల్ కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. కుమారుడు వెంకట రమణ అధ్యాపక వృత్తిలో స్థిరపడ్డారు. 'మోష'ను వివాహమాడినారు. మోష వరంగల్ సంగీత కళాశాలలో ఉపన్యాసకురాలు. ఈమెది చాలా అరుదైన గళం. హిందుస్థానీలో గానం చేస్తుంటే శ్రోతలంతా తన్మయ లోకంలోకి వెళ్లిపోతారు. మోష అనుముల కృష్ణమూర్తి గారి సరస్వతీ సాక్షాత్కారం హిందుస్థానీలో పాడుతున్నప్పుడు విని తీరవలసిందే.

(తరువాయి 8వ పేజీలో)




# ప్రజాస్వామ్య పరిరక్షణ అంటే రాజ్యాంగ పరిరక్షణ

ప్రజలకోసం ప్రజలచే నిర్వహించబడే అత్యుత్తమ పాలనా విధానం ప్రజాస్వామ్యం. ఎన్నికలు ప్రజాస్వామ్య భావనకు గీటురాయిగా ఉంటున్నాయి. మన దేశంలో ధనిక, పేద, కుల, మత, స్త్రీ, పురుష, ప్రాంతీయ తేడాలు లేకుండా 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు ఉన్నది. తమకు ఇష్టమైన వారిని ఎన్నుకునే స్వేచ్ఛ ఉన్నది. అంతేకాదు. వీరందరికీ ప్రజాప్రతినిధులుగా ఎన్నికల్లో పోటీ చేసే హక్కుకూడా వుంది. ఈ ఎన్నికల ప్రక్రియే ప్రపంచంలో మన దేశాన్ని గొప్ప ప్రజాస్వామ్య దేశంగా గుర్తింపు పొందేలా చేసింది. ఏప్రక్రియ అయినా దానంతట అది గొప్పది కాదు. ఆ ప్రక్రియ ఆచరణ గమ్యమూ, గమనమూ దానికొక విలువను ఆపాదిస్తాయి.

ఈ నేపథ్యంలో చూస్తే ఇవ్వాళ్టి మన ప్రజాస్వామ్యం ఒక మేడిపండు. ఇంత సుదీర్ఘ స్వపరిపాలనా పరిణామాలను గమనిస్తే రానురాను ప్రజాస్వామ్యం రూపం తప్ప సారం లేని ఒక బాటగా మిగిలిపోతున్నట్లు అర్థమవుతోంది.

ప్రజల చేత ఎన్నుకోబడటం నిజమే, కాని అది ప్రజల కోసం కాదని తమ అధికారానికి, ఆధిపత్యానికి, ఆర్థిక పెరుగుదలకు యిచ్చిన అవకాశంగా రాజకీయవాదులు నమ్ముతున్నారు. ప్రజలంటూ ఒకరున్నారని వారి సుఖజీవన బాధ్యత తమదేనని ఇవాళ్టి రాజకీయ వాదులు అనుకోవడం లేదు.

ఎన్నికల ప్రక్రియ ఎంత ఆదర్శవంతమో ఆచరణలో అంత విఫలమవుతున్నది. ఎన్నికలు సజావుగా, నిక్షపాతంగా నిర్వహించేందుకు మన రాజ్యాంగం భాతర ఎన్నికల కమీషన్‌ను ఏర్పాటు చేసింది. ఎన్నికల నిర్వహణలో పర్యవేక్షణ, మార్గనిర్దేశకత్వం, నియంత్రణ చేయవలసిన బాధ్యతను కమీషన్‌కు అప్పగించింది. రాజకీయ పార్టీలకు గుర్తింపు న్విడం, రద్దు చేయడం, ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అమలు చేయడం, అతిక్రమించిన వారిపై చర్యలు చేపట్టడం, స్వేచ్ఛగా పారదర్శకంగా ఎన్నికలను నిర్వహించడం ఎన్నికల కమీషన్ విధులు, బాధ్యతలు. ఈ కమీషన్ సర్వస్వతంత్ర వ్యవస్థ. ఎవరి ఆధిపత్యానికీ, ప్రభావాలకు లోబడి ఉండకూడని వ్యవస్థ.

నిజానికి ఈ సర్వ స్వతంత్ర వ్యవస్థ పారదర్శకంగా పని చేస్తే ఆర్థిక అరాచకులు, నేరస్థులు, రేపిస్టులు, పలు కేసులతో కోర్టులు, చట్ట సభల్లోకి ఎలా ప్రవేశించగలరని తప్పుడు అఫిడవిట్ల దగ్గర నిరాకరించగల స్థితిలో ఎందుకు లేరు? ధనము, కులము, ఆధిపత్యం, బలమూ, బలగమూ ఎన్నికల్లో నిర్వహిస్తున్న పాత్రకు అడ్డుకట్ట వేయకపోతే అనైతికరాజకీయాలు పేట్రేగిపోతాయి. ఎన్నికల ప్రక్రియ అపహాస్యమవుతుంది.

ఈ సమయంలో ఎన్నికల కమీషన్ చైతన్య వంతంగా, ప్రభావవంతంగా, ముఖ్యంగా పారదర్శకంగా వ్యవహరించాలి. నియమాలను కఠినంగా అమలు చెయ్యాలి. అవసరమైతే ప్రజాస్వామ్య పరిరక్షణకు కొత్త నియమ నిబంధనలను తయారు చేసుకోవాలి.

ప్రజాస్వామ్యం ఎగతాళి చేయబడిన చోట అరాచక ధోరణులు పురుడు పోసుకుంటాయి.

వేదకుమార్.ఎం

(మణికొండ వేదకుమార్)
ఎడిటర్

(6వ పేజీ తరువాయి)

అనుముల కృష్ణమూర్తి గారికి కాళోజీ సోదరులంటే భక్తి. వారు కూడా కృష్ణమూర్తి గారిని స్వంత తమ్ముడిగా భావించేవారు. కాళోజీ సోదరులతో పాటు.. దాశరథి, బిరుదురాజు రామరాజు, వానమామలై వరదాచార్యులు మొదటినుండి సన్నిహితులు. గుంటూరు శేషేంద్రశర్మ గారు వీరిని ఎంతో అభిమానించేవారు. విశ్వనాథ సత్యనారాయణ గారు కృష్ణమూర్తి గారికి గౌరవనీయులు. కవిత్వ శక్తిలో విశ్వనాథ వారిని ఒప్పుకునేవారు. జువ్వాది కాంతమరావు గారు మంచి మిత్రులు. కృష్ణమూర్తి గారి సతీమణి నర్సమాంబ 1983లో జబ్బు చేసి మరణించడంతో ఆయన జీవితమంతా ఆగమైపోయింది. సాహిత్యం తప్ప ఏమీ ఎరుగని, దేన్నీ పట్టించుకోని వ్యక్తి ఆయన. ఇల్లును నడపడం ఆమె పని. అంతేకాదు కృష్ణమూర్తి గారు తాము రచించిన పద్యాలకు మొదట శ్రోత ఆమె. కాళోజీ రామేశ్వరరావు గారు, నర్సమాంబ గారు ఇద్దరూ రసచక్షువులాయనకు.

తర్వాత కాలమంతా నిరాసక్తంగా, నైరాశ్యంగా బతికారు. బహుశా నర్సమాంబ గారు పోయిఉండకపోతే కృష్ణమూర్తి జీవితం వేరేగా ఉండేదేమో! అనేక కావ్యాలు రాస్తూ జీవితంపై మక్కువతో బతికేవారు. వారి సతీమణి నర్సమాంబ గారు మరణించిన పదమూడు సంవత్సరాలకు 1996 మార్చి 31న అనుముల కృష్ణమూర్తి తీవ్ర అనారోగ్యంతో తుదిశ్వాస విడిచారు.

> **అనుముల కృష్ణమూర్తి గారి రూపమే కాదు.. గాత్రం కూడా గొప్పగా ఉండేది. ఆయన ఏ పద్యం చదివినా శ్రోతలు తన్మయంలో ఊగిపోయేవారు.**

అనుముల కృష్ణమూర్తి గారు కుదురులేని మనిషి. ఎంతో గొప్ప కవితాధార ఉండి, పాండిత్యముండి విస్తృతమైన అధ్యయనం చేసినవారై ఉండి రచనలు చేసింది తక్కువే. చిత్తు కాగితాలపై ఎక్కడపడితే అక్కడ రాసి పారవేసుకునే వారు. అసువుగా చెప్పేవారు. పోగా మిగిలిన కవితలు (పద్యాలు) ఇవాళ మనం చదువుకుంటున్న 'సరస్వతీ సాక్షాత్కారము శబరి, ఇతర ఖండికలు' అనే గ్రంథం. ఈ కావ్యాన్ని కాళోజీ ప్రమేయంతో 1967లో యువభారతి వారు తమ మొదటి ప్రచురణగా ప్రచురించారు. మళ్లీ రెండవ ముద్రణ కూడా వచ్చింది.

1967లో ప్రచురించబడిన 'సరస్వతీ సాక్షాత్కారము' కావ్యం శబరి ఇతర ఖండికలతో కలిసి 2007 వారి పిల్లల చొరవ, శ్రమతో మళ్లీ ప్రచురణకు నోచుకున్నది. ఈ ప్రచురణకు వారికి సహకరించిన వారు నాగిళ్ళ రామశాస్త్రి, ఆచార్య ఎస్.లక్ష్మణమూర్తి గారు. సరస్వతీ సాక్షాత్కారము ఒక గొప్ప రసకావ్యం. ఈ రచనతో అనుముల కృష్ణమూర్తి గారిలో మహాకవి లక్షణాలు ఉన్నట్లు విద్వత్ ప్రతిభ ఉన్నవారందరూ అభిప్రాయపడ్డారు.

అనుముల కృష్ణమూర్తి గారి రూపమే కాదు.. గాత్రం కూడా గొప్పగా ఉండేది. ఆయన ఏ పద్యం చదివినా శ్రోతలు తన్మయంలో ఊగిపోయేవారు. 'నాయహంకార మర్మం' శీర్షికన రచించిన పద్యాల్లో ఒకటి –

"ఈ యావేశము నాది ఈ పృథ్వీ నాదే. సర్వమున్
నాది న
న్నేయావేశము బూనెనేని లయమొదింతున్ పునస్సృష్టికై
సాయంప్రాతరుపాసనా సయమ నిష్టా క్రూరుడే
కృష్ణమూ
ర్తేయల్పిష్ఠుల గోష్ఠిలో బడ
మహార్తింబొందుముల్లోకముల్"

అంటారు. మామూలుగానైతే అనుముల కృష్ణమూర్తి గారు అంతర్ముఖులు. ప్రచారానికి దూరంగా ఉండేవారు. రచించిన పద్యాల విషయంలో ఏ మాత్రమూ శ్రద్ధ లేక వారి కవిత్వంలో చాలా భాగం వెలుగులోకి రాలేదు. కానీ వీరికి సరస్వతీ సాక్షాత్కారము జరిగినది. అట్లా జరిగినట్లు వారే 'స్వయం సమీక్ష'లో ఇలా చెప్పుకున్నారు.

"ఒక అర్థరాత్రి అకస్మాత్తుగా మనశ్చక్షువునకు గోచరించిన చీరంచు, స్త్రీ యాకృతి రూపొంది కన్నుల నుండి కాళ్ల వరకు కరుణామయమైన వాగ్దేవతా కృతిగా భాసించినది. అది సర్వ రసాత్మకమై మహాంధ్ర జననిమైనది"

"భావ పరిధిలు, ఆలోచనా పరిధులు, కల్పనా పరిధులూ విశాలమైనట్లే మన తరంలో రసప్రపంచ పరిదులు విశాలమైనవి" అని అంటారు కృష్ణమూర్తి గారు. రసలోకమును కనుగొన్న కృష్ణమూర్తి గారు రసబ్రహ్మ అయినారు.

'సరస్వతీ సాక్షాత్కారము' శ్రీశ్రీ 'కవితా ఓ కవితా' లాంటిది. అనుముల కృష్ణమూర్తి గారు ఆ పద్యాల్ని ఓ మహాంధ్ర సరస్వతీ అంటూ ప్రారంభించి గానం చేస్తుంటే పుట్టపర్తి నారాయణా చార్యులు 'శివతాండవం' గానం చేసినట్టుండేదని మిత్రులన్నారు.

ఇక 'శబరి' కావ్యం విషయానికొస్తే కృష్ణమూర్తి గారు ఒక కొత్త కాన్సెప్ట్ ఆరంభించారు. ఆ కావ్యాన్ని 'ప్రజాస్వామి శబరి' అన్నారు. ఇందులో వారే అన్నట్లు 'రాముడు'ను ప్రజాస్వామ్య గత సర్వ సమాన సర్వజన సౌఖ్య భావన ప్రతీకగా, 'శబరి' ని పరంపరా పీడిత సామాన్య మానవతకు ప్రతీకగా తీసుకున్నారు.

కోవెల సంపత్ కుమార్ గారు అనుముల కృష్ణమూర్తి ఒక అందమైన పద్యం అన్నారు. కాళోజీ అనుముల వారి గురించి 'వాడు తింగడి మనిషేగాని అంగడి మనిషి కాలేదు' అన్నారు. కావ్యగానంలో ఆయన తనువెల్లా కవితా రసావేశంతో నిండి ఉండేది. అందుకే మేమంతా వారిని 'రసబ్రహ్మ'గా పిలిచేవాళ్లమని పేర్వారం జగన్నాథం గారన్నారు.

గుంటూరు శేషేంద్రశర్మ గారు 'అన్నా నీ నాలుకపై ఎన్నో వేదంబులున్న వెన్నో కావ్యాంబులున్నవి నన్నల్పజ్ఞుని అన్నామని పిల్తువెట్టి అంభోనిదివో' అని వినమ్రంగా అనుముల కృష్ణమూర్తి గారికి నమస్కరించారు.

మిత్రమండలి మిత్రుల చేతనావర్తం కవుల్లో ఒకరు వేణుముద్దల నర్సింహారెడ్డి. 'ఓయన సరస్వతియు ఓహోమని మారాడు నెవనికో వానికి నీకీ అక్షర సన్మానంబు' అని కీర్తించారు. రామేశ్వరరావు షాద్ గారు అనుముల కృష్ణమూర్తిని 'కవిత్వ దేవత' అవహించిందన్నారు.

*(తెలంగాణ ప్రభుత్వం భాషా సాంస్కృతిక శాఖ ప్రచురించిన 'తెలంగాణ తేజోమూర్తులు' నుంచి)*

– వి.ఆర్.విద్యార్థి
m : 9989139498

# కెంపుల సొంపులు

**మాణిక్యం:**

రూబీని సంస్కృతంలో మాణిక్యం అని, తెలుగులో కెంపు అని అంటారు. రూబీ దాని రంగు షేడ్ కారణంగా అనేక ఇతర పేర్లను పొందింది.

నాగరికత ప్రారంభమైనప్పటి నుండి మానవులకు రూబీ బాగా పరిచయం. మరే ఇతర పదార్థంలో లేని ఎరుపు రంగు యొక్క గాఢత మానవ దృష్టిని ఆకర్షించింది. ఇది అన్ని నాగరికతలలోను చాలా విలువైనదిగా పరిగణించబడ్డది.



రూబీ

హిందూ పురాణాల ప్రకారం, అన్ని రత్నాల మూలం చంపబడిన రాక్షసుడు బలి యొక్క శరీర భాగాలకు ఆపాదించబడింది. మాణిక్యాలు బలి యొక్క రక్తం నుండి పుట్టాయని నమ్మేవారు. రూబీ ప్రసక్తి దాదాపు ప్రాచీన సాహిత్యం లో అంతా కనిపిస్తుంది. ఇది నవరత్నాలు మరియు పంచరత్నాలలో భాగమే కాక, రత్నాల రాజుగా రాజ రత్నంగా పేర్కొనబడ్డది. సహజంగానే దీనికీ అనేక దివ్యశక్తులు ఆపాదించ బడ్డాయి. దేవతలు ధరించే రత్నంగాను, విజయానికి సంకేతం గానూ భావించబడింది. ఈ రత్నంతో భగవంతుని పూజిస్తే వచ్చే జన్మలో రాజుగా పుడతారనే నమ్మకం కూడ ఉన్నది. ప్రాచీన సాహిత్యంలో మాణిక్యం రత్నపరంగానే కాకుండ "ఆయుర్వేద ఔషధం పేరు, గ్రంథాల పేరు, వ్యక్తుల పేర్లు, రాజ వంశాల పేర్లు" ఇలా అనేక వ్యుత్పత్తి అర్థాలలో వాడబడింది.



**అరుదైన మాణిక్యం:**

'శైలే శైలే న మాణిక్యం న మౌక్తికం గజే గజే॥
నహి సర్వత్ర చందనం న వనే వనే?'

అన్ని అరుదైన వస్తువులు అన్నీ చోట్ల దొరకవు అనే అర్థం గల ఈ శ్లోకం, చాణక్యనీతిలో భాగంగా చెప్పబడ్డది.

'మాణిక్య వీణాముపలాలయంతీం,
మదాలసాం మంజుల వాగ్విలాసాం
మహేంద్ర నీలద్యుతి కోమలాంగీం,...'

అనే ఈ వాక్యాలు కాళిదాసు శ్యామలదండకంలో ఉన్న ప్రారంభ వాక్యాలు. ఇలా మాణిక్యం మన ప్రాచీనసభ్యతలో, అన్నిరంగాల్లో భాగమైంది.

**మాణిక్యానికి ఆ పేరు...**

రూబీ అనే పేరు లాటిన్ పదం రూబర్ (ఎరుపు రంగు) నుండి వచ్చింది. ఈ రత్నం యొక్క ఇతర పేర్లు మాణిక్య, సౌగంధికా, సరోజరాగాలు, శూర్గరిణీ, శోణితోపల, షోనోపల, శోనాష్మా, శోణరత్న, లోహితక, లక్ష్మీపుష్ప, రవిరత్న, రత్ననాయక, రత్నరాజ, రాగమాణిక్య, రాగయుజ్, రాగదృశ, భాస్కరప్రియ, పాతాళోపల, పద్మరాగ, తరల, తరణిరత్న, తామ్రాశ్మ, కురువింద, కురుబిల్వ, అరుణ, అరుణోపల మరియు మాంసఖండ మొదలైనవి.

ఈ పేర్లను పరిశీలిస్తే కొన్ని రంగును సూచించేవి, ప్రత్యేకతను, ప్రాముఖ్యతను సూచించేవి మరికొన్ని. ఆపాదించబడిన గ్రహాలను సూచించేవి కూడా కొన్ని ఉన్నాయి.

'సౌగన్ధికా కురువిన్ద స్ఫటికేభ్యః పద్మరాగ సంభూతిహిః'

బృహద్సంహితలోని ఈ శ్లోకం రూబీ యొక్క లక్షణాల గురించి ఆ కాలంలో ఉన్న అవగాహనను తెలియ పరుస్తుంది. ఆ రోజుల్లో రాయి రంగును బట్టి పేర్లు ఉండేవి, కానీ ఖనిజ జాతుల ఆధారంగా కాదు. సారూప్యంగా కనిపించే అన్ని రత్నాలకు సమిష్టిగా ఒకే పేరు ఉండేది.

కురువిందము కాకుండ స్పినెల్ మరియు స్ఫటికం మొదలైన ఇతర ఖనిజాలను రంగు ఆధారంగా మాణిక్యాలలో చేర్చారు. కోరండం కురువిందం యొక్క పాశ్చాత్య రూపమే. యాఖుత్ అనే అరబిక్ పేరు కూడా యాకూట పర్వతం నుండి వచ్చింది అని చెబుతారు. మాణిక్యం అనే పేరు మణులలో దీని ప్రాముఖ్యత వల్ల వచ్చినట్టుగా అనిపిస్తోంది. గరుడమాణిక్యం లాంటి పదప్రయోగం వల్ల దీన్ని ఎరుపు రంగు మణులకే కాకుండా ఇతర శ్రేష్టమైన మణుల పరంగాను కూడా వాడేవారని తెలుస్తుంది.

మన సాహిత్యం ప్రకారం భారతదేశంలో మాణిక్యం దొరికే ప్రాంతాలు సింహళ, కాలపుర, ఆంధ్ర, తుంబుర మరియు రావణగంగ మొదలైనవి. ఆయా ప్రాంతాల్లో దొరికే మాణిక్యాల లక్షణాలలోఉన్న తేడాను కూడా వరాహమిహిరుడు తన బృహద్సం హితలో వివరించాడు. ఈ ప్రదేశాలలో ఉత్పత్తి మరియు వాణిజ్య కేంద్రాలు సమిష్టిగా ఉన్నాయి మరియు కొన్నిటికి భౌగోళిక స్పష్టత లేదు.



ముడి రూపంలో రూబీ



బంగారు కిరీటంలో పొదిగిన ఎరుపు కెంపు



బర్మా మ్యూజియంలో ఉన్న ఎరుపు కెంపు

**రత్నశాస్త్రం ప్రకారం:**

సాంప్రదాయ రత్నశాస్త్రం ప్రకారం మాణిక్యం రాజులకు మరియు ఉన్నత స్థానంలో ఉన్న వ్యక్తులకు తగినదిగా పరిగణించబడుతుంది. పరిమాణంలో పెద్దది (మహత్), కమలాచ్ఛాయ (కమల వర్ణం), స్నిగ్ధ (జిడ్డు) స్వచ్ఛ, గురు (భారీ), స్ఫుట (స్పష్టమైన), అసమ (అసమానం, పలకలుగా ఉండేది కావచ్చు) మరియు వృత్తాయత (ఓవల్ ఆకారం) ఉన్న మాణిక్యం ఉత్తమమైనదిగా పరిగణించబడ్డది రంగు తక్కువ, తక్కువ బరువు, పగుళ్లు, కఠినమైన ఉపరితలం కలిగి ఉండి, చదునైన రూపాన్ని కలిగి ఉన్న, చిన్న మరియు అస్పష్టంగా ఉన్న మాణిక్యాలను నాసిరకంగా పరిగణిస్తారు.

కోరండం కుటుంబంలో భాగం అయిన రూబీ (రెడ్ కొరండం) లో క్రోమియం యొక్క ఉనికి దాని ఎరుపుకు కారణం. కొరండం కుటుంబం యొక్క అన్ని ఇతర రకాలు, అంటే ఎరుపు రంగులో లేనివి అన్నీ నీలమణులుగా వర్గీకరించబడతాయి. రూబీ మరియు నీలమణి మధ్య సరిహద్దు రేఖ పింక్ కలర్, ఇది ఎరుపు రంగులో ఒక ఛాయ. కొన్నిసార్లు రూబీ మరియు నీలమణిల మధ్య సరిహద్దు సాంకేతికంగా కాకుండా వ్యక్తిగత అభిప్రాయంపై ఆధారపడి ఉంటుంది. కనక పుష్యరాగం కూడా ఒక విధమైన కొరండం మాత్రమే. నీలమణి క్రోమియం, టైటానియం మరియు ఇనుము వంటి మూలకాల మిశ్రమాన్ని జాడలుగా కలిగి ఉంటుంది.

**రూబీలో రకాలు:** రూబీ యొక్క రసాయన సూత్రం $Al_2O_3$, క్రిస్టల్ సిస్టమ్ Trigonal.

**రంగు :** ప్రధానంగా ఎరుపు, ఎరుపు ఇతర షేడ్స్, పింక్ మొదలైనవి.

రూబీ పూర్తిగా ఎరుపు రంగులో ఉంటే దాన్ని పీజియన్ బ్లడ్ రకం అని, కాస్త తక్కువరంగులో ఉన్న మాణిక్యం రాబిట్ బ్లడ్ రకంగా పరిగణించబడుతుంది. రూబీలో ఉన్న రంగుల తేడా వల్ల పద్మరాశ్చ (పద్మ రాగం) వంటి వివిధ రకాల పేర్లతో పిలుస్తారు.

**స్టార్ రూబీ**

కొన్నిసార్లు సిల్క్ థ్రెడ్ వంటి రూటైల్ చేరికలపై కాంతి ప్రతిబింబించే కారణంగా రూబీలో స్టార్ అకారంలో మూడు రేఖలు ఏర్పాడుతాయి. ఈ నక్షత్రం రూబీ విలువను ఇనుమడింపచేస్తుంది. ఇలాంటి స్టార్ రూబీ కర్నాటకలో దొరుకుతుంది.

**ఎమరీ**

ఏ నాణ్యత లేని నాసిరకం కొరండం పారిశ్రామిక వాడకానికి పనికివస్తుంది. దీనిని ఎమరీ అంటారు.

**బర్మీస్ రూబీ**

కెంపుల గురించి మాట్లాడుకునేటప్పుడు బర్మీస్ రూబీ ప్రసక్తి తప్పకుండా వస్తుంది. వీటి క్రిమ్సన్ ఎరుపు రంగు పావురం రక్తంవలె ఉండి, ప్రపంచ ప్రఖ్యాతి పొందాయి.

**మొగోక్ రూబీ**

మాండలే వద్ద ఉండే మొగక్ ప్రాంతంలో మార్బుల్ అసోసియేషన్‌లో దొరికే ఈ కెంపులు అనేక ప్రత్యేకతలను కలిగి ఉన్నాయి. అవి గుర్తించతగ్గ చక్కటి పట్టు వంటి రూటిల్ చేరికలను కలిగి ఉంటాయి. రంగులేని కాల్సైట్ మరియు డోలమైట్ యొక్క చేరికలు, ఎపటైట్, మైకా వంటి ఇతర ఖనిజాలు, ద్రవ చేరికలు (fluid inclusions) కలిగియుండి ఇతర కెంపుల నుండి వేరుగా ఉంటుంది.

నవరత్ రూబీ, నయాసాయిక్ రూబీ. సగయిన్ రూబీ. కటపనా రూబీ వంటివి కూడ మొగోక్ రూబీల వలెనే ప్రసిద్ధం. వీటిని సమిష్టిగా పాత బర్మీస్ రూబీ అని పిలుస్తారు. కొత్త బర్మీస్ రూబీ భౌగోళికంగా బర్మా నుండీ మాత్రమే కాక పొరుగు దేశాల నుండి కూడా ఉత్పత్తి చేయబడుతుంది.

**రూబీ ట్రీట్మెంట్.**

పగుళ్లు ఎక్కువగా ఉండే రూబీలను గ్లాస్ ఫిల్లింగ్ అనే ప్రక్రియ ద్వారా నునుపుగా కనపడే విధంగా చేస్తారు. దీనిని గ్లాస్ ఫిల్డ్ రూబీ అంటారు. రూబీలో రంగు ఎక్కువచేయడం కోసం దానిని వేడిచేసే ప్రక్రియ కూడా జరుగుతుంది. దీనిని treated రూబీ అంటారు. అదనంగా కృత్రిమ రూబీలు కూడా మార్కెట్‌లో ఉన్నాయి. స్పినెల్ రూబీకి దగ్గరగా ఉండే ఖనిజం, కొన్నిసార్లు గోమేధికాలు కూడా వాటి రంగు కారణంగా రూబీస్‌గా చలామణి కావచ్చు.

**కొరండం నిల్వలు మరియు వనరులు:**


కొరండం అస్సాం, మేఘాలయ మరియు మహారాష్ట్రలో క్యైనైట్ మరియు సిల్లిమనైట్‌లతో కనుగొనబడింది. ఇది తెలంగాణలోని సైనైట్స్ మరియు అల్ట్రా బేసిక్ రాక్స్‌లో ఉంటుంది. బస్తర్ మొరేనా ఛత్తీస్‌గఢ్ జిల్లాలలో పెగ్మాటైట్స్ కొరండం దొరికింది.

ఆస్టరిజంతో (నక్షత్ర) అపారదర్శక రూబీ కర్ణాటకలోని మైసూరు జిల్లాలో పుష్కలంగా ఉన్నట్లు తెలిసింది. తిరుచిరాపల్లి జిల్లాలోని కరూర్ నుండి కుళితలై వరకు విస్తరించ కంగాయం

బెల్ట్, తమిళనాడులోని దిండిగల్ జిల్లా వేదచందూర్ ప్రాంతంలో విలువైన/ పాక్షిక విలువైన రూబీ రకాలు ఉన్నయి.

NMI డేటా ప్రకారం కొరండం మొత్తం నిల్వలు మరియు వనరులు 294వేల టన్నులుగా అంచనా వేయబడింది. అందులో 200 టన్నులు రిజర్వ్ కేటగిరీ కింద ఉంచబడ్డాయి మరియు మిగిలినవి వనరులు, ఇవి తెలంగాణలో 26% కర్ణాటకలో 68% రాజస్థాన్‌లో 4% మరియు చిన్ని మొత్తంలో ఆంధ్ర, తమిళనాడు, ఛత్తీస్‌గఢ్‌లో ఉన్నట్టుగా తెలుస్తుంది. ఇందులో రూబీ ఒరిస్సాలో 5,349 కిలోలు ఉన్నట్లు అంచనా. నీలమణి నిలువలు 450 కిలోలు మాత్రమే జమ్మూ కాశ్మీర్‌లో ఉన్నట్లు తెలుస్తుంది.

భారతదేశంలో కొరండం రూబీ మరియు నీలమణి కోసం అన్వేషించడానికి అపారమైన సంభావ్యత ఉంది. ప్రస్తుతం అధికారిక రికార్డు ప్రకారం రూబీ ఉత్పత్తి శూన్యం. ఆంధ్రా, కర్ణాటక మహారాష్ట్ర, తమిళనాడులోని పలు ప్రాంతాల నుంచి రూబీని ఉత్పత్తి చేస్తున్నట్లు అనధికారిక సమాచారం. కొరండం 1837 నుండి కృత్రిమంగా ఉత్పత్తి చేయబడింది. రత్నం నాణ్యత కొరండం 1990 ప్రారంభం నుండి మార్కెట్లో అందుబాటులో ఉంది. చాలా పెద్ద సైజు క్రిస్టల్ Czochralski పద్ధతి ద్వారా తయారీ చేయవచ్చు. Verneuil ప్రక్రియ మరొక సంశ్లేషణ పద్ధతి.



స్టార్ కెంపు - కర్నాటక

**ఉపయోగాలు:**

కొరండం దాని రాపిడి మరియు ఉష్ణ సహన లక్షణాల వల్ల పారిశ్రామిక ఉపయోగం ఉంటుంది. గ్రైండింగ్ మరియు పోలిష్ కు పనికి వస్తుంది. దీన్ని ఫర్నేస్‌లో కూడ ఉపయోగిస్తారు. రంగులలో ,సున్నితమైన శాస్త్రీయ పరికరాలు, LED ఆప్టికల్ మరియు రేడియో ఫ్రీక్వెన్సీ ఇంటిగ్రేటెడ్ సర్క్యూట్‌లో ఉపయోగ పడుతోంది.

రూబీని ఆయుర్వేదఔషధం తయారీలో ఉపయోగిస్తారు. మాణిక్యం భస్మాన్ని ఇమ్యునోమోడ్యులైజేషన్ కోసం ఉపయోగిస్తారు. ఆకలి పుట్టించేది, మరియు క్యాన్సర్ చికిత్స కోసం ఇంకా అనేక విధాలుగా ఉపయోగ పడుతోంది. రత్నంగా రూబీ యొక్క ఉపయోగాలు అపరిమితంగా ఉంటాయి.

**మాణిక్యం చరిత్ర:**

కెంపులతో సహా భారతీయరత్నాల ప్రస్తావన రోమన్ మరియు పర్షియన్ యాత్రికుల రికార్డులలో 77 AD నుండి కనిపిస్తుంటాయి. మహమ్మద్ బెన్ మన్సూర్ (13వ శతాబ్దం) తూర్పు భారతదేశానికి చెందిన యాకుత్ గనుల గురించి ప్రస్తావించాడు. అల్లావుద్దీన్ ఖిల్జీ జనరల్ మాలిక్ నాయక్‌తో పాటు అమీర్ ఖుస్రో (1310-1312) దక్షిణ భారత దండయాత్ర లో పాల్గొన్నారు. వరంగల్‌లో దోచుకున్న బంగారం, రత్నాలు అపారమైన నిధుల గురించి ఆయన వివరించారు.

“కొరండం (యాకుత్) సూర్యుని అబ్బురపరిచింది! మాణిక్యాల మెరుపు రాత్రి చీకటిని ప్రకాశవంతం చేసింది. బర్మత్‌పూర్ స్వర్ణ దేవాలయం ధ్వంసం గురించి ఇదే విధమైన వర్ణన ఉంది.” దాని గోడలు మరియు పైకప్పు మెరిసే మాణిక్యాలు మరియు పచ్చలతో పొదగబడి ఉన్నాయి మరియు వాటిని చూస్తుంటే ప్రేక్షకుల దృష్టికి ఎరుపు మరియు పసుపు మచ్చలు వచ్చాయి. (పడగొట్టిన ఆలయంలో) 500దాక విలువైన రాళ్ల గుట్టలు ఏర్పడ్డాయి! ఈ వర్ణన కొద్దిగా కవితాత్మకంగా ఉంది, కాని దోచుకున్న వస్తువుల యొక్క అపారతను సూచిస్తుంది.

మార్కోపోలో బదక్షన్ (Badakshan) యొక్క బాలాస్ మరియు రూబీ గురించి కూడా ప్రస్తావించాడు. Odaroda Barbosa (1519) విజయనగర రత్నాల అంగళ్ళ గురించి నివేదించాడు. అక్కడ బర్మా మరియు శ్రీలంక నుండి వచ్చిన వివిధ రత్నాలు విక్రయించబడటాన్ని వివరించాడు. టావెర్నియర్ (1665) మొఘల్ ఆభరణాలు మరియు నెమలి సింహాసనం గురించి ప్రత్యక్షంగా వివరించాడు. అతను సింహాసనంలో పొదిగిన 100 నుండి 200 క్యారెట్ల బరువున్న 108 పెద్ద కెంపులను లెక్కించాడు.

1398-99లో తైమూర్ ఢిల్లీని దోచుకున్నప్పుడు అతను “తైమూర్ రూబీ”ని తీసుకెళ్లాడు. జహంగీర్ వద్దకు తైమూర్ వారసుడి హోదాలో ఆది తిరిగి వచ్చింది. కానీ మళ్లీ నాదిర్ షా వద్దకు వెళ్లి రంజిత్ సింగ్ ద్వారా బ్రిటిష్ కిరీటాన్ని చేరుకున్నది. ఈ 352 క్యారెట్ల రూబీ అసలు రూబీ కాదు “స్పినల్” అని తరువాత తెలిసింది. కెప్టెన్ నియోబోల్డ్ 1840 తమిళనాడులో కొరండం యొక్క విస్తృతమైన మైనింగ్ గురించి, భద్రాచలం దగ్గర “కురుంద” మైనింగ్ గురించి నివేదించాడు.

“రాజ్‌రతన్ రూబీ” మాణిక్యాల రాజుగా ముద్దుగా పిలుచుకునే విజయనగర సామ్రాజ్యానికి చెందిన ఒక 2475 క్యారెట్ల స్టార్ రూబీ, ప్రస్తుతం బెంగుళూరుకు చెందిన ఒక ప్రైవేట్ యజమాని వద్ద ఉంది.

-చకిలం వేణుగోపాలరావు,
డిప్యూటి డైరెక్టర్ జనరల్ జిఎస్ఐ(రి)
m: 9866449348
e : venugopal.chakilam1@gmail.com
- శ్రీరామోజు హరగోపాల్, m : 99494 98698
e: akshara25@gmail.com




# చెల్లా చెదురుగా పడి ఉన్న శిల్పాలు

# దిక్కూమొక్కూ లేని దేవాలయాలు

ఆ వూరు ఎల్లకొండ. చుట్టుపక్కల ఊళ్ల కంటే ఎత్తైన కొండ. ఆ కొండ సానువుల్లో రాతిని తొలచి మలచిన గుహాలయాలు. కొన్ని శివాలయాలైతే, మరికొన్ని జైనాలయాలు. రాష్ట్రకూట శైలి శివలింగాలు, గణేశ శిల్పాలు ఒకవైపు, కళ్యాణీ చాళుక్యశైలి వర్ధమాన మహావీరుడు, పార్శ్వనాథుని శిల్పాలు మరోవైపు. నిత్యార్చనలతో కళకళలాడి, మంత్రోచ్చారణలతో వెలుగొందిన ఆ గుహాలయాలోని విగ్రహాలకు అభిషేక జలాన్నందించిన నలు చదరపు నడబావి. అక్కడ చక్కగా తీర్చిదిద్దిన ఆలయాలుండేవని సాక్ష్యం పలుకుతున్న ద్వారశాఖలు, గోడరాళ్లు, మధ్యయుగం కంటే ముందే ఎల్లకొండ పుణ్యక్షేత్రంగా విలసిల్లింది. హైదరాబాదు నుంచి గండిపేట మీదుగా చేరుకొనే వీలున్న గ్రామం. నవాబు పేట మండలం, శంకరపల్లికి దగ్గర్లో ఉన్న ఊరు.

గ్రామంలో ఎక్కడ చూచినా జైన, శైవ శిల్పాలు, ఆలయ శకులాలే. ఒక వైపున మర్రిచెట్టు కింద ఆలయాల్లో అలంకరించిన ఏనుగు శిల్పాలు, తోరణానికి రెండు వైపులా ఉన్న పార్శ్వనాథ శిల్పాలు, నేడోరేపో కూలటానికి, నేలరాలటానికి సిద్ధంగా ఉన్న శివాలయం, ఎల్లకొండ చరిత్ర అనే పగిలిన అద్దంలో ముక్కలు ముక్కలుగా కనిపిస్తున్నాయి. వారసత్వ ప్రేమికుల కంటనీరొలికిస్తున్నాయి.

చుట్టూ ఉన్న గడ్డీ, గాదాన్ని దాటి సాహసించి శివాలయంలో ప్రవేశిస్తే, ఎడమవైపున శివుని శిల్పం ఉన్న తోరణ పై భాగం. దాని వెనుక విసిరి వేయబడిన నంది విగ్రహం, కొంచెం ముందు చెట్టు కింద బిక్కుబిక్కుమని కూర్చొన్న వినాయకుని విగ్రహం నిర్లక్ష్యానికి నిదర్శనాలు. కుడివైపున మహా మండపం, అర్ధమండపం, గర్భాలయాలతో చిక్కి శల్యమౌతున్న స్థితి, ఎవరూ ముందుకొచ్చి, బాగు చేయలేని పరిస్థితి. పడిపోగా మిగిలి ఉన్న గోడలపైన, మండప స్థంభాలు, దూలాలు, కప్పులు, ద్వారశాఖలపైన అద్భుత శిల్పాలు, గర్భాలయంలో నాన్నను పోగొట్టుకొని (అక్కడుండాల్సిన శివలింగం ఎక్కడికెళ్లిందో తెలియక) దిగాలుగా ఉన్న చిన్న వినాయక శిల్పం, చెరిగిపోతున్న వెయ్యేళ్ల నాటి చారిత్రక సాక్ష్యాలు, గుహలు. శిల్పాలకు ఇష్టం వచ్చినట్లు వేసిన రంగులు, చెల్లా చెదురుగా పడి ఉన్న శిల్పాలు, ఆకాశంలోని చుక్కల్ని సైతం అద్దంలో చూపిన నడబావిలో ఉండాల్సిన నీళ్ల స్థానంలో ఏపుగా పెరిగిన ముళ్ల పొదలు, ఎల్లకొండ ప్రజలకు, అడపాదడపా వచ్చిపోయే సందర్శకులకు మూకుమ్మడిగా విజ్ఞప్తి చేస్తున్నాయి, మౌనరాగాలతో దీనగానాలతో కాలం గాలానికి చిక్కుకొని విలవిలలాడుతున్న ఈ శిథిలాలు పదిల పరిచే మనసున్న మహారాజు కోసం ఎదురు చూస్తున్నాయి. వీలైతే మీరు కూడా చేతనైనంత సాయం చేయండని అడగలేక అడుగుతున్నాయి.

–ఈమని శివనాగిరెడ్డి–స్థపతి,
m : 9848598446
e : nagireddy@malaxmi.in

ద

# రాచిప్పల పచ్చిపులుసు

రాచిప్ప అంటే రాతి చిప్ప అని అర్థం. ముప్పై వేల సంవత్సరాలకు పూర్వం పాతరాతి యుగం దాటి కొత్త రాతి యుగంలకు ఆదిమ మానవుడు ప్రవేశిస్తున్నప్పుడు రాళ్లను చెక్కి, సానపట్టి పదునుగా నూరిన వాటిని కత్తులుగా, వేటాడే ఆయుధాలుగా, గుంటలుగా మారిన మిగిలిన రాళ్లను వేట మాంసాన్ని దాచుకునే పాత్రలుగా వాడుకునే వాడు. అవే రాచిప్పలుగా ఉనికిలోకి వచ్చాయి. అప్పటికింకా పశుపోషణ, వ్యవసాయం ప్రారంభం కాలేదు. రాచిప్పలు అట్లా వాడుకలోకి వచ్చి, మా చిన్నతనంల అంటే 75 సంవత్సరాల క్రింద మా వంటింట కూడా కొనసాగాయి. ముప్పై వేల సంవత్సరాల క్రిందటి కాలానికి సాక్ష్యాలుగా, ఆనవాళ్లుగా!

ఆ కాలాన, అయ్యవార్ల ఇండ్లల్ల రకరకాల సైజులలో రాచిప్పలు, మడత మానులు, భూమిల పాతిన రాతి రోళ్లు, రోకళ్లు (అప్పటికింకా మిక్సిలు, గ్రైండర్లు అన్న పదాలు డిక్షనీర్లల్ల రాలేదు) రాతితో చేసిన గుండ్రని "ఇసుర్రాళ్లు" కూడా ఉండేవి. ఆ ఇసుర్రాళ్ల లయబద్ధ సంగీతం మా చిన్న చెవులకు వినసొంపుగా ఉండేది. ఆయుర్వేదం మందులు మెత్తగా నూరటానికి "రాతి కల్వాలు", గంధం తీయటానికి "సాన పీటలు" కూడా ఉండేవి. 1950 చివరి దశకం వరకూ అల్యూమీనియం గిన్నెలు (ఆ ఇంగ్లీషు పదం పలుకరాక సీమెండి గిన్నెలు అనేవారు) ఇత్తడి సామానులు ఉండేవి. ఇత్తడి బిందెలు, గంగాళాలు, కొప్పెరలే కాక రాగి బఫ్ఫలు (బొగ్గులతో కాచుకునే వేడినీళ్ల సాధనం) 1960 తర్వాత స్టీలు సామానులు వాడుకలోకి వచ్చి మోత బరువుగా ఉండే ఇత్తడి సామానులు వెనుకబడి పోయాయి. నవాబుల కాలం కనుమరుగు కాగానే ఇత్తడి 'పోక కత్తెరలు', పాన్ దాన్‌లు ఒగల్‌దాన్‌లు కూడా మూలబడ్డాయి. "జమానే కే సాత్ సభ్ కుచ్ బదల్ గయా."



రాచిప్పల ముచ్చట్ల కంటె ముందు వాటిని అమ్మే "జుమ్మేరాత్ బజార్" గురించి చెప్పాలె. చెట్టు మీది ఉసిరికాయకు సముద్రంల ఉప్పుకు దగ్గరి సంబంధం ఉన్నట్లు!

ఏడవ నిజాం కాలంల సుమారు 1940ల జుమ్మేరాత్ బజార్ శురూ అయ్యింది. జుమ్మేరాత్ బజార్ అంటే గురువారపు సంత లేదా అంగడి అని అర్థం. బజార్ అన్న పదం ఉర్దూ కూడా కాకపోవచ్చు. చాలా ఉర్దూ పదాలు ఫార్సీ నుండి, అరబ్బీ లేదా తుర్కీ భాష నుండి దిగుమతి అయినవే, తెలుగులోకి సంస్కృత పదాలు వచ్చినట్లు. మధ్య ఆసియా దేశాలలో ఇప్పటికీ ఈ బజార్ అన్న పదం వాడుకలో ఉంది.

ఎనభై సంవత్సరాల క్రింద ప్రారంభమైన ఈ బజార్ ఇప్పటికీ నడుస్తుంది. ఇప్పుడు ఈ విశ్వనగరంలో ఎన్నెన్ని షాపింగ్ మాల్స్ వచ్చినా దీని అందం దీనిదే. అన్ని పాత సామానులు ఇక్కడ "బలే మంచి చౌక బేరము" అన్నట్లు అమ్ముతారు. ఇటు ముస్లిం జంగ్ (అసలు పేరు ముసల్లం జంగ్) పూల్ అటు పురానాపూల్ ఈ రెండింట మధ్య ఒక పెద్ద మైదాన్‌ల ధూల్‌పేట బస్తీకి దగ్గరగ ఈ బజార్ ఉంది. సస్తామాల్‌కు ఆలవాలం ఈ జుమ్మేరాత్ బజార్.

చిన్నప్పుడు మా ఇంటికి ఏ చుట్టమొచ్చినా షాపింగుల కోసం పోయే ఒకే ఒక్క జాగా ఈ జుమ్మేరాత్ బజార్. ఇల్లందు నుండి కన్నయ్య మామ వచ్చినా, మాన్కోట నుండి అప్పయ్య మామ వచ్చినా పొద్దుపొద్దున్నే లేచి ఇత్తడి గిలాసులల్ల కాలుతున్న గరం గరం చాయను "ఉఫ్ ఉఫ్"మని ఊదుకుంట తాగి, సైకిళ్ల మీద ఈ బజార్‌కు పోయేవాళ్లు. అగ్గువ సగ్గువకు బేరాలాడి చాలా సామానులు సైకిలు ఎన్క క్యారేజీకి మూట కట్టుకుని విజయగర్వంతో పగటి యాళ్ల మా ఇంటికి వచ్చేవారు. మొదటిసారి కన్నయ్యమామ నా చిన్న చిన్న పాదాలకు చెమ్కీల చెప్పులు కొన్నది ఈ బజారులనే!

ఇక మా అమ్మ సంగతి సరేసరి. రెండు, మూడు నెల్లకోసారి చేతిల కొన్ని పైసలు పడంగనే ఖాళీ సంచులతో బయలుదేరేది. ఒక రోజు ముందే ఆ సంగతి నాకు తెలిసిపోయేది. ఇక నా పోరు పడలేక అమ్మ సరే అనేది. ఆ తెల్లారి నాకు ప్రతిరోజు కన్నా పొద్దున్నే తొందరగ మేల్కవచ్చేది. ఆదరబాదరగ వంటబొగ్గు కసపిసా నమిలి, ఆ నల్లబొగ్గుతో పండ్లు తెల్లగ తోమి, కుడి చేతి బొటనవ్రేలితో నాలుకను 'ఒయిక్, ఒయిక్'మని గీసిగీసి కడిగి, ఉడుకుడుకు చాయల క్రిందటి రాత్రి చద్దిరొట్టెను ముంచుకుని తిని, తాగి 'ఆవు వెంబడి దూడలా' బరికాళ్లతో జుమ్మేరాత్ బజారుకు బయలుదేరే వాడిని. అబ్బో ఇగ ఆ ప్రయాణం గురించి చెప్పతరం గాదు.

మేమిద్దరం మా రూప్‌లాల్ బజారు నుండి "గ్యారా నంబర్" బస్సు మీద బయలుదేరే వాళ్లం (కాలి నడక). ఖాజీపూరా చేరే సరికి పెద్ద తాటి తోపుల వనం వచ్చేది. తర్వాత 1962ల అక్కడ

''ఆషాటాకీస్'' కట్టారు. అదిప్పుడు కాలగర్భంలో కనుమరుగయ్యింది. సందుగొందులు, గల్లీలు దాటి ఒక మూల మలుపు తిరిగే సరికి నిజాం నవాబులు కట్టించిన "చౌమహల్లా ప్యాలెస్" జగజ్జేయమానంగా దర్శనమిచ్చేది. అప్పుడు నా పసికండ్లు సంభ్రమార్చార్యాలతో పొద్దు తిరుగు పువ్వుల్లా విచ్చుకునేవి. దాని మీదున్న గంటల గడియారం (క్లాక్ టవర్) రాజసం ఉట్టిపడుతూ శీర్షమాణిక్యంలా ప్రకాశించేది. ఆ ఎత్తైన కోటగోడలు, దాని సింహద్వారాలు నన్ను అబ్బుర పరిచేవి. ఆ రాచ వీధిని దాటే సరికి 'ముర్గీ కా చౌక్' వచ్చేది. అది ఆరవ నిజాం కట్టించిన వ్యాపార భవనం. అక్కడ పంజరాలలో బంధింపబడిన రంగు, రంగుల రామచిలకలు, తెల్లపావురాలు, నల్లటి కాకులు, గుడ్లగూబలు, ఊరపిచ్చుకలే గాక అమ్మకానికి ఉడుతలు, కుందేళ్లు, తాబేళ్లు కూడా ఉండేవి. నా కండ్లకు ఆ ప్రాంతం ఒక జంతుప్రదర్శన శాలగా కనిపించేది. ఆ చౌక్‌లో ఖుతుబ్‌షాహీలు కట్టించిన ఒక మసీదు చాలా ఎత్తుగా తంతెల మీద కనిపించేది. ఇటీవల ఆ ముర్గీ కా చౌక్ భవనాన్ని సర్కారు వారు నూతన భవన నిర్మాణం కోసం నేలమట్టం చేసారు. ఆ నాలుగు దారుల కూడలిలో పురాతన గ్రంథాలు విక్రయించే దుఖాణాలు కూడా ఉండేవి. అక్కడ విలువైన అరబ్బీ, ఫారసీ, ఉర్దూ, హిందీ పుస్తకాలు పరిశోధనా విద్యార్థులకు దొరికేయి. వాటన్నింటిని వీక్షిస్తూ "కసార్ హట్టా"లోకి ప్రవేశించేవాళ్లం. కసార్ అంటే నల్లలోహ విగ్రహాలను తయారు చేసే కళాకారులు. "హట్టా" అంటే స్థలం లేక ప్రాంతం. ఆ వీధి దాటి మరో వీధిలకు వచ్చేసరికి ఒక పెద్ద హనుమాన్‌మందిర్. అందులో ఊడలు విస్తరించిన రావి చెట్టు. 1908ల మూసీ నదికి వరదలు వచ్చి పురానాపూల్ (పాత వాలాద్రి) తెగి నగరం పట్నం వరదలల్ల కొట్టుక పోయినపుడు ఆ మందిర్‌లో వున్న భక్తులు ఆ చెట్టు కొమ్మల మీదికెక్కి బతికి బట్టకట్టింద్రని అమ్మ కథలాగ చెప్పింది. ఆ కథ వింటూ "మెహబూబ్ కీ మెహందీ'లోకి ప్రవేశించాం. నాకు వయసు వచ్చిన తర్వాత దాని ముచ్చట్లు తెలిసాయి. ప్రియురాలి లేలేత తమల పాకుల్లాంటి అరచేతులకు, పసుపు పచ్చని పాదాలకు పెట్టుకునే గోరింటాకు పేరే ఈ 'మహబూబ్ కీ మెహందీ'. నవాబుల కాలంలో అదొక ఖరీదైన వసంత సేనల వేశ్యా వాటిక. దీపాలు వెలిగే పరదాలు తొలిగె అన్నట్లు "షమ్మా"ల చుట్టూ దీవానాలు, పర్వానాలు షలభాల్లా ప్రదక్షిణలు చేసేవారు. సారంగీ, తబలా, డోలక్‌లతో పాటు కాలి అందియల మువ్వల సవ్వడులు రసికులను మరిపించి మురిపించేవి.



"కంటికి దూరమైతే కాలికి దూరమా" అన్నట్లు నడిచి నడిచి సిటీ కాలేజికి చేరుకునే వారం. ఆ కాలంలో అది హైద్రాబాద్ పట్నానికి ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ లాంటిది. ఒకప్పుడు అక్కడ మగ్దూం మొహియుద్దీన్ ఇంగ్లీష్ లెక్చరర్‌గ పనిచేసేవాడు. కేశవరావ్ జాదవ్, హరగోపాల్ సార్ కూడా అక్కడి విద్యార్థులే.

సిటీ కాలేజికి ఎదురుగా 'పేట్లాబురుజు' మైదానం ఉండేది. ఆ ఉదయాన అక్కడ వందలాది మంది పోలీసులు చెమటలు కారుతూ జట్లు జట్లుగా పరేడ్ చేసేవారు. చేతులు, కాళ్లు లయబద్ధంగా కదిలిస్తూ ఖాకీ డ్రస్సులో వారు మార్చింగ్ చేస్తుంటే నాకు చూడముచ్చటగా అనిపించి పెద్దగైన తర్వాత నేను కూడా పోలీస్ జవాన్ ఉద్యోగం చేయాలని అనుకునే వాడిని.

ఆ "దునియా కా మేలా" అట్లా అట్లా తిలకిస్తూ, ఆనందిస్తూ చివరికి మూసల్లం జంగ్ పూల్ ఎక్కేవాళ్లం. క్రింద ముచికుందా నది మురికి లేకుండా జోరుజోరుగ స్వచ్ఛంగ ప్రవహిస్తుండేది. వంతెన దాటి ఎడమవైపు తిరిగే సరికి కొంచెం దూరంల జుమ్మేరాత్ బజార్ దర్శనమిచ్చేది. అది పీర్ల పండుగ నాటి జాతరలా నాకు కనబడేది. ముందు అమ్మ ఆ బజార్ నాలుగు మూలలు కలియతిరిగి తనకు పనికి వచ్చే పాత సామానులు ఎక్కడెక్కడ ఉన్నాయో తనిఖీ చేసేది. ధరవరలు కూడా తెలుసుకునేది.

పుకట్ కా మాల్ ఆమె కందుకు గాని గీసిగీసి బేరమాడి సస్తామాల్ కొనాలని ఆమె ఆలోచన.

ఇగ నా చూపులకేమో ఆ పాత సామానులు ఆనకపోయేది. "ఊరందరిది ఒక దారి ఉలిపి కట్టెది మరో దారి" అన్నట్లు అక్కడి రంగుల ప్రపంచం నన్ను ఆకర్షించేది. "బొంబై కా తమాషా దేఖో, ఏ చార్ దిన్ కా తమాషా దేఖో" అంటూ పాడుతున్న రంగుల బొమ్మల డబ్బా నన్ను వెంటాడేది. నాలుగడుగులు వేయగానే ఐస్‌ఫ్రూట్ బండి, దానిలోపల బరఫ్‌ల పెట్టిన రంగు రంగుల పుల్ల ఐస్‌క్రీంలు నన్ను రారామ్మని సైగ చేసేవి. లాయిలప్పలు, రాగమాలలు, మేండక్‌లు, గుండ్రని అట్టలతో చేసిన ఎర్రని కండ్లద్దాలు, కీ ఇస్తే కదిలే నల్లముండ్ల మణికట్టు గడియారాలు, తోపుడు బండిమీద రంగురంగుల నిమ్మెట్ సీసాలు (చవక రకం కూల్ డ్రింక్సు) నన్ను నేల మీద నిలవకుండా చేసేవి. కనీసం "చౌదాల్" (సేవ్‌దాల్) అయినా కొనమని అమ్మవైపు దీనంగా మూగచూపులు చూసేవాణ్ణి. "ముందు సామాన్ కొందాం నానీ, పైసలేమన్నా మిగిలితే అప్పుడు చూద్దాంలే" అని అమ్మ సముదాయించేది. అప్పటికే సూర్యుడు నడినెత్తి మీదికి వచ్చేవాడు. ఆకలితో పేగులు గుర్రుగుర్రు మనేవి. తిరిగి తిరిగి సన్నటి పుల్లలాంటి కాళ్లు గుంజబట్టేవి. ఎర్రటి లేత ముఖం ఎండకు మాడిపోయి చెమటలు కారబట్టేవి.

ఆఖరికి పెరుమాండ్ల దయవలన అమ్మకు రాచిప్పలు

అమ్ముతున్న వడ్డెర ఆడోళ్లు కనబడ్డారు. చిన్నాపెద్దా అనేక రకాల సైజుల రాచిప్పలు వాళ్ల ముందు కొలువై ఉన్నాయి. ఎండకు చెమటలు కారిన వారి నల్లటి శరీరాలు నూనె రాసినట్లు మిలమిలా మెరుస్తున్నాయి. అమ్మ తన వాక్చాతుర్యమంతా ఉపయోగించి తన దగ్గరున్న తక్కువ పైసలతో రెండు రాచిప్పలను కొన్న తర్వాత ఇంకా ఒక ఏకానా మిగిలింది. రూపాయికి పదహారణాల కాలం అది. ఏకానా, దొవ్వానా, చారానా, ఆఠానా, దస్సానా, బారానా, చౌదానాల సత్య కాలం అది. ఆ ఒక్క ఏకానాతో ముందు నాకు చల్లటి నిమ్‌లేట్ తాగించింది. ఎండిపోయిన కుతికకు ప్రాణం లేచి వచ్చింది. ఇంకా మిగిలిన చిల్లర బుడ్డపైసలతో ఎర్రటి అట్ట కండ్లద్దాలు, బెల్లం పానకంతో చేసిన మురమరాల లడ్డూ కూడా కొనిచ్చింది. తను మాత్రం ఏమీ తినలేదు, తాగలేదు మైలా, మడి పాటించే అమ్మగారు కదా!

మళ్లీ తిరుగు ప్రయాణం. రాచిప్పలను కొన్నందుకు అమ్మకు కొండంత సంతోషం. హనుమంతుడు సంజీవని పర్వతాన్ని భుజాలపై మోసినట్లు అమ్మ కుడి భుజంపై రాచిప్పల బరువుతో నడక. ఇంతల చౌమహల్లా ప్యాలెస్ వచ్చింది. ప్యాలెస్ ముందు ఏకాంతంగా, విశాలంగా నిలుచున్న మైదానం. మధ్యన ఊడలు విస్తరించిన ఒక పెద్ద మర్రిచెట్టు. అప్పుడు నగరంలో ఇంత ఆబాదీ లేదు. ఇప్పటి మాదిరిగ సడక్ మీద నడిస్తే టక్కర్ (ఆక్సిడెంట్) అయితదన్న భయం లేదు. ఆ మిట్ట మధ్యాహ్నపు ఎండకు ఎక్కడా ఒక నరమానవుడు కనబడుతలేడు. అమ్మ అలసట తీర్చుకునేందుకు ఆ మర్రిచెట్టు నీడన చేరి రాలిన ఆకుల మీద కూచుంది. భుజం మీది రాచిప్పల బరువును భూదేవికి అప్పగించింది. దాహార్తితో ఆమె అటు ఇటు చూసింది. కొద్ది దూరంల ఆకుపచ్చగ మెరుస్తున్న ఒక సూఫీ సాధువు దర్గా. అక్కడ ఒక సర్కారీ నల్లా. అమ్మ కండ్లకు అదొక చల్లని చలివేంద్రంలా కనిపించింది ఆ రోజులలో సర్కారీ నల్లా బారా గంటా ఖుల్లా. ఎప్పుడంటే అప్పుడు గంగమ్మ తల్లి పిలిస్తే పలికేది. అమ్మకు హుషారొచ్చింది. బిరబిర నడిచి నల్లాఖట్కా తిప్పి కాళ్లు, చేతులు, ముఖం శుభ్రంగా కడుక్కుంది. కడుపునిండా చల్లటి నీళ్లు తాగింది. రవ్వంత సేపు సేద తీరిన తర్వాత మళ్లీ రాచిప్పల బరువుతో గ్యారానంబర్ బస్ శురూ!



ఆ తెల్లారి మా అమ్మ మనసాలకు ఎదురుంగ ఉన్న చేదబావి ముందు కూచుని ఆ రెండు రాచిప్పలను రాసిరాసి, గీసిగీసి శుభ్రంగా కడిగింది. వాటి మురికంతా మాయమై అవి కృష్ణ వర్ణంలో కళకళలాడాయి. అందులో ఒకటి చింతకాయ 'తొహి'కి (తొహి తమిళపదం. తొక్కు తెలంగాణా పదం) రెండో రాచిప్ప పాత చింతపండుతో చేసే పచ్చిపులుసు కోసం. పాత చింత పండుకు ఔషదగుణాలు ఎక్కువని, ఆరోగ్యానికి మంచిదని ఆయుర్వేదం చెపుతుంది. స్వర్గీయ దాశరథి రంగాచార్యగారు తమ ఆత్మకథ "జీవన యానం"లో వారి అమ్మగారు చేసే పచ్చి పులుసు గురించి వైన వైనాలుగా వర్ణించారు. ఇంటికి వచ్చిన అతిధులు ఏ అధరువులు లేకుండా ఉత్త పచ్చిపులుసుతోనే అన్నమంతా తిని బ్రేవ్ మని త్రేన్చేవారట. ఆమె చేతి మహత్యమో లేక ఆ పచ్చిపులుసు మహత్యమో అట్లా ఉండేదట.

మాచిన్నతనంల పచ్చడి పెట్టటమంటే ఒక చిన్న సైజు యజ్ఞం చేసినట్లే. నియమ, నిష్ఠలతో పెట్టిన పచ్చడి చెడిపోకుండా, బూజు పట్టకుండా, కలకాలం నిల్వ ఉంటదని నమ్మేవాళ్లు. ముందు మీరాలం మండికి పోయి, ఇటు కాయ అటు పండు కాక మధ్యరకం చింతకాయను బేరం చేసేవారు. అవి బాగా పొడుగ్గా కండపట్టి ఉండేవి. వాటిని ఇంటికి తెచ్చి శుభ్రమైన పొడి గుడ్డతో జాగ్రత్తగా తూడ్చి గాలికి ఒక రోజు ఆరబెట్టి తెల్లారి దాని మీదున్న పొట్టు, నారా వేరు చేసేవారు. వాటిని రోట్లోవేసి రోకలిబండతో "కచ్చాపచ్చా" దంచి బయట పడిన గింజల్ని పక్కన పెట్టి మళ్లీ మరోసారి దంచి సరిపడా లవణాన్ని (ఉప్పు) మిలాయించి కొత్త రాచిప్పల ఆ ముద్దను వేసి ఆ రాచిప్పకు ఒక శుభ్రమైన గుడ్డను బిగించి మూత కట్టేవారు (వాసెన కట్టటం) ఆ తర్వాత అవసరం పడ్డప్పుడు ఒక గంటె లేదా రెండు గంటెల ముద్ద ఇవతలికి తీసి చిన్న కడాయిలో పోపు పెట్టేవారు (తిరగమోత) పోపుపెట్టట మంటే అల్లాటప్పా, ఆషామాషీ వ్యవహారం కాదు. అదొక 'పాకశాస్త్రం' కళ. శ్రేష్టమైన గానుగ నూనెను మండుతున్న కడాయిలో కొంచెం మరిగించి పొగలు రాగానే పోపు గింజలు, పొట్టు తీసిన ఎల్లిపాయలు, తాజా కరివేపాకు ఆకులు, ఇంగువా, కొంచెం మినపప్పు (పంటికిందికి కరకరలాడటానికి) ఆ నూనెలో వేసి, కలిపి పక్కన పెట్టుకున్న చింతకాయ ముద్దను ఆ పోపులో వేయగానే "చుఁయ్"మని పెద్ద శబ్దంతో, పొగలతో ఇల్లంతా గుమగుమలాడి గుభాళించి పోయేది. కడుపులో 'జఠరాగ్ని' రెట్టింపు అయ్యేది. మంచి ఎండాకాలం ఉదయం పూట (ఒంటిపూట బళ్ల రోజులలో) తరవాణిలో ఈ చింతకాయ 'తొహి' నంచుకుంటే ఆత్మారాముడు పరమానందభరితుడౌతాడు. తరవాణి అంటే రాత్రి మిగిలిన అన్నాన్ని బాగా పిసికి మట్టి కుండలో వేసి అందులో మజ్జిగ, ఉల్లిపాయ ముక్కలు, పచ్చి మిరపకాయ ముక్కలు వేసి రాత్రంతా పులియపెడితే ఉదయానికి తయారయ్యే బ్రేక్‌ఫాస్ట్ అన్నమాట.

ఇక రెండవ రాచిప్ప సంగతి. అండ్ల ఒకటి రెండు రోజుల కోసం పచ్చిపులుసు లేదా మజ్జిగ పులుసు పోసేవారు. తెలంగాణా





ప్రజలకు పచ్చిపులుసు చల్లని తల్లిలాంటిది. అది అందరికీ ఆరో ప్రాణం. పులుసును తమిళంలో 'పుళి' అంటారు. పుళిహెూర, పచ్చిపుళి, తణ్ణి (నీరు) మెళుగు (మసాలా) తిరుక్కోవణ్ణం (పాయసం) లాంటి తమిళ పదాలు, మా ఇంట్ల చిన్నప్పుడు సాధారణ వాడుక పదాలు. ఇప్పుడు ఆ పదాలన్నీ గ్లోబలైజేషన్‌లో గల్లంతయినాయి.



ఇన్‌స్టంట్ కాఫీలాగా ఇన్‌స్టాంట్ పచ్చిపులుసు చేయటం చాలా ఈజీ. పాతబడి నల్లగా మారిన చింతపండును బాగా నానబెట్టి, బాగా పిసికి, గుజ్జును తీసివేసి వచ్చిన పచ్చి పులుసుతో మరికొన్ని నీళ్లు కలిపి పలుచగా చేసి, దానికి సరిపడ గల్లా ఉప్పును కలగలిపి, ఉల్లిపాయ, పచ్చిమిరపకాయల్ని సన్నగా తురిమి ఆ రసంలో వేసి మరికొంచెం పిసికి చివరికి కొత్త బెల్లం పొడి దానికి జోడించి పోపు గింజలతో తిరగమోత పెట్టి ఆపైన సన్నగా తరిగిన కొత్తిమీరను చల్లితే అద్భుతమైన 'పచ్చిపుళి' తయ్యార్. దానిని ఆ రాచిప్పల పోసి కొద్దిసేపు ఓపిక పడితే ఫ్రిజ్‌లో పెట్టినట్లు చల్లగా అవుతుంది. అది ఆ రాతి మహిమ. ఉష్ణ శరీర గుణం కల్గిన వారికి పచ్చిపులుసు చలువ చేస్తుంది. ఆహారం సులభంగా జీర్ణం కావటమే గాక నోరు "సాఫ్" అయ్యి నాలికకు రుచుల పసిగట్టె గుణం పెరుగుతుంది.

చాలా కాలం తర్వాత నాకు యాభై సంవత్సరాల వయసు వచ్చిన తర్వాత ఒక దినం చౌమహల్లా ఫ్యాలెస్ ముందున్న విశాలమైదానం, దాని మధ్యల మర్రిచెట్టు యాదికొచ్చింది. ఆ వటవృక్షం చల్లని నీడలో కూచుని అమ్మను జ్ఞాపకం చేసుకుందామని ఆశతో బయలుదేరాను. మూసీ నది దాటి పాత నగరంలోకి ప్రవేశించటమంటే చల్లని అమ్మ ఒడిల కూచుని పరవశించినట్లే కదా!

తీరా నేను అక్కడికి చేరకునే సరికి ఒకప్పుడు అక్కడ ఉండిన విశాలమైన మైదానమూ లేదు, మర్రి చెట్టూ లేదు. ఆ చెట్టును ఎవరో కొట్టేసారు. ఆ స్థలంలో ఒక ప్లాను, పద్ధతి లేకుండా వంకరటింకరగా గల్లీలు ఉన్నాయి. ఇష్టం వచ్చినట్లు కట్టుకున్న ఇండ్లు. ప్రతి ఇంటి ముందు ప్రవహిస్తున్న మురికి నీళ్ల కాలువలు, హడావుడిగా అటుఇటు తిరుగుతున్న కుక్కలు, పిల్లులు దర్శనమిచ్చాయి.

సూఫీ సాధువు దర్గామాత్రం అట్లనే ఉంది. సర్కారీ నల్లా కూడా అట్లనే అక్కడే ఉంది. గతించిన కాలానికి ప్రథమ సాక్షిగ! అమ్మ జ్ఞాపకం వచ్చింది. ఆమెను తలుచుకుంటూ నల్లా దగ్గరికి వెళ్లి కాళ్లూ, చేతులూ ముఖం శుభ్రంగా కడుక్కుని కడుపునిండా నీళ్లు తాగిన. అమ్మ నా పక్కన వున్నట్లే అనిపించింది. ఇంతల "ఉమ్రావ్ జాన్" సీన్మాల రేఖ పాడిన పాట యాది కొచ్చింది.

**"ఏ క్యా జగే హై దోస్తోఁ**
***ఏ కౌన్ సా దయార్ హై***
***హద్-ఎ-నిగా జహాఁతక్***
***గుబార్ హి గుబార్ హై"***
**ఇది ఏ ప్రాంతం మిత్రులారా**
**ఇది ఏ ప్రాంగణం స్నేహితులారా**
**కనుచూపు సరిహద్దు మేరా**
**దుమ్ము, ధూళి, విధ్వంసమే, విధ్వంసము.**

-పరవస్తు లోకేశ్వర్,
m: 91606 80847
e : lokeshwar.hyderabadi@gmail.com

# మాకూ... జీవించే స్వేచ్ఛ నివ్వరూ...
# @ గ్రేట్ ఇండియన్ బస్టర్డ్

నింగి, నేల, నీరు, నిప్పు, గాలి... అనేవి పంచభూతాలు. మనిషి శరీరం పాంచభౌతికం అన్నది శాస్త్రం. "పంచభూతాల సమాహారమే ఈ ప్రకృతి" అంది ప్రాచీన సాహిత్యం. అయితే మనిషి ఈ పరమసత్యాన్ని విస్మరించాడు. పంచభూతాల్లో దేన్నీ సజావుగా, సహజంగా మననీయడం లేదు. మనిషి ఎక్కడున్నా విచ్చిన్నమే! అడుగిడిన ప్రతిచోటా పర్యావరణ విధ్వంసమే అని మనిషి – ప్రకృతి గ్రంథంలో పెర్కిన్స్ మార్ష్ చెప్పిన మాటలు అక్షర సత్యాలు. పచ్చటి అడవులన్నీ మటుమాయమై కాంక్రీట్ అరణ్యాలుగా మారుతూ... చెరువులు, వాగులు, వంకలూ కాలుష్య కాసారాలుగా మారడం వల్ల భూమిపై నున్న జీవజాలం విలవిలలాడి పోతోంది. అనేక జీవులు ఇప్పటికే అంతరించిపోగా, లెక్కకు మిక్కిలి జీవులు మనుగడ కోసం, శక్తికి మించిన పోరాటం చేస్తూ, మాకూ జీవించే స్వేచ్ఛ నివ్వరూ అంటూ కనిపించిన వారినందరినీ దీనంగా వేడుకుంటున్నాయి. ఇలా ఉనికి కోసం పోరాటం చేస్తున్న పక్షిరాజమే గ్రేట్ ఇండియన్ బస్టర్డ్ (బట్టమేక పక్షి). గ్రేట్ ఇండియన్ బస్టర్డ్ పరిరక్షణ కొరకు తగు చర్యలు సూచించాల్సిందిగా కోరుతూ సుప్రీంకోర్టు ఇటీవల ఒక నిపుణుల బృందాన్ని ఏర్పాటు చేసిన నేపథ్యంలో, ఆ పక్షి దయనీయ గాథను మనమూ తెలుసుకుందామా..!!



### బట్టమేక పక్షి – విశిష్టత

గ్రేట్ ఇండియన్ బస్టర్డ్ పక్షి శాస్త్రీయనామం ఆర్డియోటిస్ నైగ్రిసెప్స్ (Ardiotircs Nigriceps). ఈ పక్షి భారత ఉపఖండంలో కనిపించే అతిపెద్ద భూగోళపక్షి. ఇది ప్రపంచంలోనే అతి పెద్ద ఎగిరే పక్షిగా గుర్తింపు పొందింది. ఇది వివిధ రాష్ట్రాల్లో వివిధ పేర్లతో పిలవబడుతోంది. మల్ఢోక్, ఎర్‌బాట్, ఘోరడ్, గోడవాన్, తుక్దర్, సోహన్ చిడియా, బట్టమేక పక్షి లాంటివి వివిధ రాష్ట్రాల్లో గ్రేట్ ఇండియన్ బస్టర్డ్‌ను పిలిచే ప్రసిద్ధ పేర్లు. ప్రసిద్ధ భారత పక్షిగా శాస్త్రవేత్త డా॥ సలీం అలీ గ్రేట్ ఇండియన్ బస్టర్డ్‌ను భారత జాతీయ పక్షిగా ఎంపిక చేయాలన్న నిర్ణయానికి తన పూర్తి మద్దతును ప్రకటించాడు. అయితే భారత ప్రభుత్వం గ్రేట్ ఇండియన్ బస్టర్డ్‌కు బదులుగా ఇండియన్ పీ ఫౌల్ (Indian Pea Fowl)ను భారత జాతీయ పక్షిగా ప్రకటించింది.

### భౌతిక లక్షణాలు

గ్రేట్ ఇండియన్ బస్టర్డ్ పొడవాటి కాళ్ళు, ఉష్ట్రపక్షిలాగా పొడవాటి మెడతో చాలా పొడవుగా ఉండి, దాదాపు ఒక మీటర్ ఎత్తు ఉంటుంది. రెక్కలు, నలుపు, గోధుమ మరియు బూడిద రంగులను కలిగి ఉండగా, శరీరం లేత గోధుమ రంగులో ఉంటుంది. ఈక రంగు మగ మరియు ఆడ బస్టర్డ్‌ల మధ్య తేడాను గుర్తించడంలో సహాయపడుతుంది. పొట్ట, మెడ భాగాల్లో తెల్లగా, వీపు గోధుమ రంగులో ఉంటుంది. తల మరియు మెడపైనున్న నల్లటి టోపీ లాంటి నిర్మాణం దానిని ఇతర పక్షుల నుండి వేరు చేస్తుంది. ఛాతి వద్ద నలుపు, తెలుపు ఈకలు హారంలా ఉంటాయి. మగ పక్షి 1.1-1.20 మీ॥ పొడవు, 8-18 కిలోల బరువు కలిగి ఉంటాయి. ఇది ముదురు మరియు ఇసుక బఫ్ రంగును కలిగి ఉంటాయి. ఆడపక్షి మగపక్షి కన్నా పరిమాణంలో చిన్నగా ఉండి 3.5 నుండి 6.75 కేజీల బరువును కలిగి ఉంటాయి. అవి నివసించే ప్రాంతంలో గ్రేట్ ఇండియన్ బస్టర్డ్‌లు అతిపెద్ద ఎగిరే పక్షులైనప్పటికీ కోరి బస్టర్డ్ (శాస్త్రీయనామం Ardotis Kori) మరియు గ్రేట్ బస్టర్డ్ (otis tarde)లు పరిమాణంలో గ్రేట్ ఇండియన్ బస్టర్డ్‌ల కన్నా పెద్దవిగా ఉంటాయి.

### నివాసం మరియు విస్తరణ

గ్రేట్ ఇండియన్ బస్టర్డ్స్ శుష్క మరియు అర్ధ శుష్క

ప్రాంతాలలోని గడ్డిభూముల, పొదలు, పంట దిగుబడి తక్కువగా ఉన్న భూములు కలిగిన ప్రాంతాలలో ఎక్కువగా నివసిస్తాయి. నీటి పారుదల కలిగిన ప్రాంతాలో ఇవి నివసించవు. ఇవి ఎక్కువ సమయం భూమి మీద గడపడానికే ఇష్టపడతాయి. విభిన్న ప్రాంతాల మధ్య ఇవి తక్కువ దూరం మాత్రమే ఎగురుతూ ప్రయాణిస్తాయి.

శుష్కప్రాంత గడ్డి భూముల్లో వీటిని అత్యున్నత పక్షి జాతులుగా (Flagship Bird Species of Grass lands) పిలుస్తారు. మెరుగైన రీతిలో గ్రేట్ ఇండియన్ బస్టర్డ్‌ల యొక్క విస్తరణ ఈ పర్యావరణం యొక్క సుస్థిరతను సూచిస్తుంది. ఒకప్పుడు భారత ఉపఖండంలోని కొన్ని నిర్దిష్ట ప్రాంతాలకు మాత్రమే పరిమిత మయ్యాయి.



గతంలో ఇవి మనదేశంలో 11 రాష్ట్రాల్లో కనిపించేవి. ప్రస్తుతం 6 రాష్ట్రాల్లో మాత్రమే తమ ఉనికిని చాటుతున్నాయి. అవి ఆంధ్రప్రదేశ్, రాజస్థాన్, గుజరాత్, కర్నాటక, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, రాజస్థాన్. రాజస్థాన్ ప్రభుత్వం గ్రేట్ ఇండియన్ బస్టర్డ్‌ను రాష్ట్ర పక్షిగా ప్రకటించి, అంతరించిపోతున్న ఈ పక్షి జాతిని సంరక్షించడానికి "ప్రాజెక్ట్ గ్రేట్ ఇండియన్ బస్టర్డ్" పేరుతో ఒక ప్రాజెక్ట్‌ని ప్రారంభించింది. రాజస్థాన్‌లో ఈ పక్షిని స్థానికంగా గోదావన్ అని పిలుస్తారు.

**ఆహారం:**

గడ్డి భూముల్లో విరివిగా సంచరించే ఈ పక్షులు 1 లేదా 2 సం॥రాలకు ఒకసారి గుడ్డుపెట్టి, 25-30 రోజుల పాటు పొదుగుతాయి. తమకు సమీపంల ఎలాంటి ఆహారం లభ్యమైనా తిని జీర్ణించుకోగలవు. సాధారణంగా ఇవి మిడతలు, కీటకాలు, తొండలు, బల్లులు, చిన్నపాటి పాములు, గింజలు, పళ్లను తిని జీవిస్తాయి.



**తెలుగు రాష్ట్రాలలో ఉనికి:**

తెలుగు రాష్ట్రాలలో ఈ పక్షి ఆంధ్రప్రదేశ్‌లో ఒకప్పుడు విరివిగా కనిపించేది. 1979లో గ్రేట్ ఇండియన్ బస్టర్డ్ (బట్టమేక పక్షి) ప్రాధాన్యతను గుర్తించిన ముంబైకి చెందిన ప్రముఖ పక్షి శాస్త్రవేత్త సలీం అలీ కర్నూలుకు 45 కి॥మీ దూరంలోని నంది కొట్కూరు నుండి నంద్యాలకు వెళ్ళే దారిలోని రోళ్ళపాడు వద్ద 1980లో ఈ పక్షిని సంరక్షించేందుకు చర్యలు తీసుకోవలసిందిగా ప్రభుత్వానికి సూచించారు. దీంతో అప్పటి ప్రభుత్వం 1988లో ఈ ప్రాంతాన్ని అభయారణ్యంగా ప్రకటించి 600 హె॥ల భూమిని వీటి సంరక్షణ కోసం కేటాయించింది. అదేవిధంగా అలగనూరుకు సమీపంలోని సుంకేసుల వద్ద మరో 800ఎకరాలు కేటాయించి, ఈ పక్షి సంరక్షణకు సిబ్బందిని కూడా కేటాయించారు.

**గ్రేట్ ఇండియన్ బస్టర్డ్ – ఐయూసీఎన్ స్టేటస్ :**

ఇంటర్నేషనల్ యూనియన్ ఫర్ కన్సర్వేషన్ ఆఫ్ నేచర్ (IUCN) అన్న సంస్థ భూగోళం మీద నున్న జంతువుల, పక్షుల స్థితిగతుల ఆధారంగా కొన్ని జీవితాలు ప్రచురిస్తూ ఉంటుంది. గ్రేట్ ఇండియన్ బస్టర్డ్‌ను ఈ సంస్థ క్రిటికల్లీ ఎండేంజర్డ్ (Critically Endangered) జాబితాలో చేర్చింది. ఈ పక్షి పూర్తిగా అంతరించే దశకు చేరుకోవడంతో "బర్డ్ లైఫ్ ఇంటర్నేషనల్ అన్న సంస్థ 2011లో గ్రేట్ ఇండియన్ బస్టర్డ్‌ను ఎండేంజర్డ్ నుండి క్రిటికల్లీ ఎండేంజర్డ్ జాబితాలోనికి మార్చింది.

**గ్రేట్ ఇండియన్ బస్టర్డ్ ఎందుకు అంతరించి పోతున్నాయి?**

- 1969లో 1260 గ్రేట్ ఇండియన్ బస్టర్డ్ జాతులుండగా, 2008 నాటికి 300 జాతులు మాత్రమే మిగిలాయి.
- ప్రస్తుతం దేశవ్యాప్తంగా 150 పక్షులు మాత్రమే ఉన్నట్లు అంచనా. వేటాడం వల్ల గత 15-20 సం॥రాలలో గ్రేట్ ఇండియన్ బస్టర్డ్ (జీఐబీ)ల సంఖ్య పూర్తిగా తగ్గి పోయిందని నిపుణులు అభిప్రాయం పడుతున్నారు.
- సాపేక్షంగా తక్కువ జనాభా కలిగి ఉండడం, కర్నూడి చావుకు సవాలక్ష కారణాలన్నట్లు అనేక ఇతర కారణాలు జీఐబీల ఉనికిని ప్రశ్నార్థకం చేస్తున్నాయి.
- వ్యవసాయం విస్తరించడం, వ్యవసాయంలో యాంత్రీకరణ పెరగడం వల్ల గ్రేట్ ఇండియన్ బస్టర్డ్స్ యొక్క నివాస ప్రాంతాలు పూర్తిగా కనుమరుగవుతున్నాయి. తద్వారా అవి అంతరించే దశకు చేరుకుంటున్నాయి.

2020వ సం॥లో వైల్డ్ లైఫ్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇండియా

**సుప్రీంకోర్టు జోక్యం :**

గణనీయ సంఖ్యలో గ్రేట్ ఇండియన్ బస్టర్డ్‌ల మరణాలను నివారించడానికి గానూ సుప్రీంకోర్టు జీఐబీల నివాస ప్రాంతాలకు సమీపంలోని విద్యుత్ లైన్లను భూగర్భంలో నిర్మించాలని ఎం.కె. రంజిత్ సింగ్ వర్సస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసు విచారణలో భాగంగా ఏప్రిల్, 2021న తీర్పునిచ్చింది. అయితే సుదూర ప్రాంతాలకు భూగర్భంలో విద్యుత్ లైన్లను నిర్మించడం ఆచరణ సాధ్యం కాదంటూ కేంద్రప్రభుత్వం అఫిడవిట్‌లో పేర్కొనడంతో ఏప్రిల్, 2021 నాటి తీర్పును సమీక్షించిన సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి డివై చంద్రచూడ్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం, జీఐబీల ప్రాధాన్యతా ప్రాంతాల్లో అండర్ గ్రౌండ్ మరియు ఓవర్ హెడ్ ఎలక్ట్రిక్‌లైన్ల పరిధి, విస్తరణ మరియు సాధ్యాసాధ్యాలను అధ్యయనం చేసేందుకు గానూ మార్చి 21, 2024న ఏడుగురు సభ్యులతో ఒక నిపుణుల కమిటీని ఏర్పాటు చేసింది. అదేవిధంగా ఈ కమిటీ సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను మరియు పక్షుల సంరక్షణను సమన్వయం చేయడం కొరకు ప్రత్యామ్నాయాలను అన్వేషించవచ్చు. జీఐబీల ప్రాధాన్యతా ప్రాంతాలను గుర్తించడానికి అదనపు సిఫార్సులను సూచించవచ్చు. జులై 31, 2024లోపు ఈ కమిటీ తన నివేదికను సుప్రీం కోర్టుకు సమర్పించాలి. ఈ కమిటీ వైల్డ్ లైఫ్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇండియా డైరెక్టర్‌తో పాటు వన్య ప్రాణి మరియు అటవీ



సంరక్షణ నిపుణులైన హరిశంకర్‌సింగ్, నిరంజన్ కుమార్ వసు, బి. మజుందార్, దేకేశ్‌ఫడ్కేలతో పాటు ఇతరులు సభ్యులుగా ఉంటారు.

(WII) నిర్వహించిన ఒక అధ్యయనం ప్రకారం గుజరాత్‌లోని కచ్, రాజస్థాన్‌లోని థార్ ఎడారి ప్రాంతాల్లో పవర్ లైన్లకు తగిలి గ్రేట్ ఇండియన్ బస్టర్డ్‌లతో పాటు, మొత్తం మీద 84000 వేల విభిన్న పక్షి జాతులు మరణించాయి. మిగిలిన పక్షులతో పోలిస్తే జీఐబీల శారీరక పరిమాణం ఎక్కువగా ఉండడం, వాటికి ముందుచూపు సరిగా కనిపించకపోవడం వల్ల ఇవి సులువుగా టవర్‌లైన్లకు చిక్కిమరణిస్తున్నాయని నిపుణులు చెబుతున్నారు.

**గ్రేట్ ఇండియన్ బస్టర్డ్ అంతరించడం వల్ల పర్యావరణంపై ఎలాంటి ప్రభావం ఉంటుంది!!**

భూమిపై నున్న ప్రతి జీవి కూడా ఆహారం కొరకు ఒకదానిపై ఒకటి ఆధారపడి ఉంటాయి. తద్వారా ఇవన్నీ ఆహారపు గొలుసులో భాగంగా ఉంటాయి. ఆహారపు గొలుసులో ఒక జీవి అంతరించినా, అది మిగిలిన జీవులపై ప్రభావం చూపుతుంది. తద్వారా పర్యావరణ వ్యవస్థపై ప్రతికూల ప్రభావం పడుతుంది. గ్రేట్ ఇండియన్ బస్టర్డ్ పక్షుల మనుగడ గడ్డి భూముల ఆవరణ వ్యవస్థ (Grass Land Ecosystem) యొక్క సుస్థిరతను సూచిస్తుంది. గ్రేట్ ఇండియన్ బస్టర్డ్ పక్షులను భారతీయ గడ్డి భూముల ఆవరణ వ్యవస్థలో గొడుగు జాతులు (Umbrella Species)గా పేర్కొంటారు. ఈ పక్షులను రైతు మిత్రులుగా పేర్కొంటారు. ఈ పక్షులను పరిరక్షించినట్లయితే మిగిలిన గడ్డిభూములలో నివసించే జీవుల మనుగడ కూడా సుస్థిరంగా ఉంటుంది. కీటకాలు, ఎలుకలు, సరీసృపాలను జీఐబీలు ఆహారంగా తీసుకుంటాయి. జీఐబీలు అంతరించినట్లయితే కీటకాలు, ఎలుకల జనాభా విపరీతంగా పెరుగుతుంది. తద్వారా ఆహారపు గొలుసులో ప్రతికూల ప్రభావం ఏర్పడుతుంది. దీనినే "డొమినో ఎఫెక్ట్" (Domino Effect) అంటారు. ఎలుకలు, కీటకాల జనాభా విపరీతంగా పెరగడం వ్ల వ్యవసాయ దిగుబడులు కూడా గణనీయంగా తగ్గిపోతాయి.

**జీఐబీల పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలు:**

**ఆవాస ప్రాంతాల పరిరక్షణ:**

జీఐబీలు విరివిగా సంచరించే ప్రాంతాలను భారత ప్రభుత్వం రక్షిత ప్రాంతాలుగా ప్రకటించి, వాటి సంరక్షణకు చర్యలు చేపడుతోంది. రాజస్థాన్‌లోని డెజర్ట్ నేషనల్ పార్క్, ఆంధ్రప్రదేశ్‌లోని రోళ్ళపాడు, మధ్యప్రదేశ్‌లోని కరేరా మరియు ఘటిగావ్ అభయారణ్యాలు ఇందుకు ఉదా॥లుగా చెప్పవచ్చు. తద్వారా ఈ అభయారణ్యాలలో జీఐబీలు వేట మరియు ఇతర రకాల ముప్పుల నుండి మెరుగైన రక్షణ పొందుతున్నాయి.

**క్యాప్టివ్ బ్రీడింగ్ :**

భారతదేశంలోని అనేక పరిశోధనా సంస్థలు మరియు జంతుప్రదర్శనశాలల్లో క్యాప్టివ్ బ్రీడింగ్ ప్రోగ్రామ్‌లు ప్రారంభించబడ్డాయి. వీటి ద్వారా జీఐబీల యొక్క పిల్లలను ఉత్పత్తి చేసి, వాటిని అటవీ ప్రాంతాలలో వదిలి పెట్టడం ద్వారా, వాటి జనాభా పెరుగుదలకు



ఇలాంటి ప్రోగ్రామ్‌ల తోడ్పడుతున్నాయి.

**సామాజిక చేతనను పెంపొందించడం :**

జీఐబీలు మనుగడ పర్యావరణానికి ఎలాంటి ప్రయోజనాలు చేకూరుస్తుందో తెలపడం మరియు ప్రస్తుతం దాని దుస్థితి గురించి ప్రజల్లో అవగాహనను పెంపొందించాలి. ఇందుకు స్వచ్ఛంద సంస్థల సహకారం తీసుకోవాలి.

**చివరగా :**

స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన వాతావరణంలో జీవించే మక్కు ప్రతి ఒక్కరికీ ఉంది. కానీ వనరుల దుర్వినియోగం, మార్కెట్‌శక్తుల ప్రకృతి విధ్వంసం, పెరిగిపోతున్న వినియమవాదం ప్రాణాల మీదకు తెస్తోంది. తెలిసైనా, తెలియకైనా పర్యావరణానికి హాని చేయడమంటే, మనిషి జీవించే హక్కును నిరాకరించడమేనని చెప్పవచ్చు. జీవితాలను, జీవనోపాధిని దెబ్బతీస్తున్న ఈ పరిస్థితులు మానవాళి ఉనికికే ఎదురైన సవాళ్ళు. పైపెచ్చు ధనికులతో పోలిస్తే, దారి తెన్నూ లేని బీద సాదలపైనే ఈ ప్రభావం అధికమని అందరూ అంగీకరిస్తున్నారు. మన దేశ సర్వోన్నత న్యాయస్థానం కూడా ఈ అభిప్రాయంతో ఏకీభవిస్తూ "పర్యావరణ మార్పుల దుష్ప్రభావం నుండి విముక్తిని సైతం" ప్రత్యేకమైన ప్రాథమిక హక్కుగా గుర్తించింది. సమానత్వపు హక్కు (ఆర్టికల్ 14), వ్యక్తిగత స్వేచ్ఛ, జీవించే హక్కు (ఆర్టికల్ 21)ల పరిధిలోకే అదీ వస్తుందంటూ ఎంకె రంజిత్‌సింగ్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో సుప్రీంకోర్టు తీర్పునిచ్చింది. పర్యావరణ పరిరక్షణను గాలికొదిలేసి ప్రభుత్వాలు చేపడుతున్న అనేక విధానాలు ఇవాళ ప్రజల పాలిట శాపంగా మారుతున్నాయి. ఈ పరిస్థితుల్లో సుప్రీంకోర్టు గుర్తించిన ఈ ప్రత్యేక హక్కుతోనైనా ప్రభుత్వాలు మేల్కొంటాయని ఆశిద్దాం.

**-పుట్టా పెద్ద ఓబులేసు,**
స్కూల్ అసిస్టెంట్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల
రావులకొలను, సింహాద్రిపురం, కడప
m : 9550290047
e : obu.jmd@gmail.com

DECCAN
దక్కన్
CHANNEL



పిల్లో లావా స్ట్రక్చర్ - మరడిహళ్లి, చిత్రదుర్గ జిల్లా, కర్ణాటక



పెనిన్సులర్ నైస్ - లాల్ భాగ్, బెంగళూరు

# కర్ణాటక రాష్ట్రంలోని జియో హెరిటేజ్ స్థలాలు

కర్ణాటక రాష్ట్రంలో కేంద్ర ప్రభుత్వం జియోలాజికల్ మాన్యుమెంట్స్‌గా గుర్తించిన స్థలాలు నాలుగు (4).

1) మరిడిహళ్లి పిల్లో లావాస్ట్రక్చర్, చిత్రదుర్గా జిల్లా

2) లాల్‌భాగ్, బెంగళూరులోని పెనిన్సులర్ గ్నైస్

3) సేంట్ మేరీస్ ద్వీపంలోని కాలమ్నార్ జాయింట్స్ వల్కానిక్స్‌లో

4) పెద్దపల్లిలోని పైరోక్లాస్టిక్ శిలలు, కోలార్ జిల్లా

ఈ జియోహెరిటేజ్ స్థలాలు వివరణ క్రింద ఇవ్వబడినది.

### మరిడిహల్లి పిల్లోలావా స్ట్రక్చర్

మరిడిహల్లిలోని పిల్లోలావా స్ట్రక్చర్ చిత్రదుర్గా టౌన్‌కు 16 కి.మీ. దూరంలో సౌత్ ఈస్ట్ దిశలో మరియు ఆయమంగలం గ్రామానికి 4 కి.మీ. దూరంలో ఉత్తర దిశలో కలదు. బెంగళూరు నుండి 180 కి.మీ. దూరంలో ముంబై బెంగళూరు రహదారి (ఎన్‌హెచ్-41)కి చేరువగా వున్నది. ఈ స్ట్రక్చర్ జియోలాజికల్‌గా చిత్రదుర్గా శిస్ట్ బెల్ట్‌లోని భాగం. ఇది ప్రపంచంలోని బెస్ట్ పిల్లోస్ట్రక్చర్స్‌లో ఒకటిగా నిర్ధారించబడినది.


ఈ పిల్లో లావా స్ట్రక్చర్స్ ఫారమ్ అయ్యే విధానం ఏమిటంటే, సముద్రమట్టంలో అగ్నిపర్వతం బద్దలై, లావా ఒక్కసారిగా నీటితో కలిసి కూలింగ్ కావడం వల్ల ఇలాంటి స్ట్రక్చర్స్ ఏర్పడడం జరుగుతుంది. వీటి వయస్సును డేటింగ్ మెథడ్స్ ద్వారా 2500 మిలియన్ సంవత్సరాలుగా నిర్ధారించబడినది. ఇలాంటి స్ట్రక్చర్స్ బసాల్టిక్ కాంపొజిశన్ గల శిలలో ఏర్పడతవి. ఓసియానిక్ క్రస్ట్ యొక్క పై భాగంలోనే ఇవి దొరుకును. ఎప్పుడైతే శిల యొక్క కాంపొజిషన్ ఇంటర్‌మీడియట్‌గా ఉంటుందో అప్పుడు పిల్లోల సైజ్ పెరుగుతుంది.

### పెనిన్సలర్‌నైస్, లాల్‌భాగ్, బెంగళూరు

ఈ పెనిన్ సలర్‌నైస్ ఇండియన్ పెనిన్సులాలోని 1/3వ భాగంలో విస్తరించి యున్నది. ఇది ఏర్పడిన విధానం ఏమిటంటే, పూర్వం ఉన్న రకరకాల శిలలు గ్రానిటైజేషన్ ప్రాసెస్ వల్ల గ్రానైట్-నైస్ శిలగా మార్చబడినవి. బెంగళూరులోని లాల్ భాగ్‌లో చాలా మంచి ఎక్స్‌పోజర్ కలదు. సిటీలో మరియు ప్రముఖమైన బొటానికల్ గార్డెన్‌లో ఉండడం వల్ల అందరికి అందుబాటులో వుంటుందన్న కారణం వల్ల దీన్ని జియోలాజికల్ మాన్యుమెంట్‌గా గుర్తించారు. ఈ నైస్ కోర్స్‌గ్రేన్డ్, హైగ్రేడ్ మెటమార్ఫిక్ శిల. ఈ శిలలో ఆల్టర్‌నేట్ డార్క్, లైట్ బ్యాండ్స్‌తో చూడటానికి ఆకర్షవంతంగా ఉంటుంది. ఈ శిల యొక్క వయస్సు 2500



పైరోక్లాస్టిక్ రాక్స్ –
పెద్దపల్లి, కోలార్ జిల్లా, కర్ణాటక



కాలమనార్ వాల్కానిక్స్ –
సెయింట్ మే రీ స్ ఐ లాండ్, కర్ణాటక

నుండి 3400 మిలియన్ సంవత్సరాలుగా నిర్ధారించబడినది.

### సేంట్‌మేరీస్ ద్వీపంలో కలామ్ నార్ వల్కానిక్స్

సేంట్‌మేరీస్ ద్వీపం కొన్ని చిన్న చిన్న ద్వీపాల సమూహం. ఇది అరేబియన్ మహాసముద్రంలోని మాల్పేలిన్ అనే చిన్న తీరం వద్ద కలదు. ఇది ఉడిపి పట్టణానికి పశ్చిమంలో 6 కి.మీ. దూరంలో కలదు. ఉడిపి పట్టణం మంగళూరుకు వెస్ట్ నార్త్-వెస్ట్ దిశలో 60 కి.మీ. దూరంలో ఉన్నది. ఈ ద్వీపాన్ని పాపులర్‌గా కోకోనట్ ద్వీపం అని కూడా అంరురు. ఫెల్సిక్ వాల్కనిక్స్ మరియు రయోడయొసైట్ శిలల్లో బాగా తయారైన కలామ్ నార్ జాయింట్స్, వాటి హెగ్జాగోనల్ ఫేసెస్, వీటి ప్రత్యేకత. ద్వీపం యొక్క వైశాల్యం 500 మీ × 100 మీ మరియు ఎత్తు 10 మీ. M.S.L. పైన. ఇవి భారతంలోని సౌత్-వెస్ట్ ప్రాంతంలో విస్తృత మొల్టన్ లావా అగ్ని పర్వతం నుండి విరజిల్లడం వల్ల ఏర్పడినవి. ఈ సంఘటన క్రిటేశియస్ పీరియడ్‌లో అనగా 88 మిలియన్ సంవత్సరాల క్రితం జరిగినది. కొన్ని జానపద కథల ప్రకారం 1948లో వాస్కోడిగామా తను పోర్చుగల్ నుండి ఇండియాకి వచ్చిన సమయంలో దీనికి సేంట్ మేరీ ఐలెండ్ అని నామకరణం చేసారని చెప్పుకుంటూరు.

### పెద్దపల్లిలోని పైరోక్లాస్‌టిక్ శిలలు, కోలార్ జిల్లా

కోలార్ జిల్లాలోని పెద్దపల్లి వద్ద ఉన్న పైరోక్లాస్‌టిక్ శిలలని జియోలాజికల్ వివరణ ఏమిటంటే ఈ శిలలని వెల్డెడ్ అగ్లామరేట్ అని అందురు. ఇగ్నింబరైట్ (ఏశప్లోటుఫ్స్) మెట్రిక్స్‌లో, గ్రానైట్, గ్రానైట్ నైస్, బీసాల్‌ట్స్, బ్యాండెడ్, ఫెరుజినస్ క్వార్ట్జైట్ శిలల యొక్క పెద్ద పెద్ద ముక్కలు కలిసి ఏర్పడినవే ఈ పైరోక్లాస్‌టిక్ శిలలు.

– కమతం మహేందర్ రెడ్డి
m : +91 90320 12955
e : mahikam.reddy0@gmail.com

చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ ప్రచురించిన



తెలంగాణ బడి పిల్లల కథలు

10 పపుస్తకాల సెట్ ధర రూ. 330.
తగ్గింపు ధర రూ. 300

ప్రతులకు
అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలు.
మరియు
'భూపతి సదన్' 3-6-716, స్ట్రీట్ నెం. 12, హిమాయత్‌నగర్,
హైదరాబాద్-500029
**ఫోన్ : 9030 6262 88**
email: edit.chelimi@gmail.com
website : www.balachelimi.com

# సుందర నగరాల్లో ఛిద్రమౌతున్న బాల్యం

నేపథ్యం:

వేగావంతమవుతున్న పట్టణీకరణతో పాటు పట్టణాలలో పేదలు నివసించే ప్రాంతాల జనాభా కూడా పెరుగుతుంది సుమారు ఆరు కోట్ల యాభై లక్షల మంది ప్రజలు అంటే పట్టణ జనాభాలో 27% మంది అరకొర వసతులున్న ఈ బస్తీలలో నివసిస్తున్నారని 2011 జనాభా లెక్కలు నివేదించాయి. 2011 తర్వాత అధికారికంగా మురికివాడల జనాభా లెక్కలు ఏమీ లేవు గాని ఈ 13 సంవత్సరాల కాలం లో గ్రామీణ శ్రామిక పేదలు నగరాలకు తరలడం పెరుగుతూనే ఉంది. గ్రామీణ ప్రాంతాలలో ఉపాధి అవకాశాలు లేక గ్రామాల నుండి పట్టణాలకు రావడం పట్టణీకరణ అనివార్యం అవుతూనే ఉంది. అయితే గ్రామాల నుంచి ఉపాధి కోసం తరలివస్తున్న కుటుంబాలు వారి పిల్లల కోసం నగరాలు ఎంత మాత్రం సిద్ధంగాలేవు. మరోవైపు పట్టణాలలో రోడ్ల విస్తరణ ఫ్లైఓవర్ నిర్మాణం మెట్రో రైలు మాల్స్ ఫుడ్ కోర్టులు పట్టణ సుందరీకరణ వంటి మెగా ప్రాజెక్టులతో పట్టణాలలోని ఇతర ప్రాంతాలు సిద్ధమవుతున్నాయి.



ప్రగతి అభివృద్ధి ఆర్థిక అభివృద్ధికి ఇవి సూచికలుగా నిలుస్తున్నాయి రియల్ ఎస్టేట్ రంగంలోని రియాల్టర్లు వారికి దన్నుగా నిలిచే రాజకీయ వర్గాలు ప్రభుత్వ భూములను ఆధీనంలోకి తీసుకోవడానికి కోసం పోటీ పడుతుంటారు. ఒక రకంగా చెప్పాలంటే ప్రజల ప్రజా ఉపయోగా ప్రదేశాలను ఆక్రమించుకోవడం అధికార దర్పణానికి మార్గంగా తయారయింది. ఫలితంగా పేద మధ్యతరగతి వర్గాలకు చెందవలసిన విద్యా, ఆరోగ్యం, పరిశుభ్రమైన, నీరు, ప్రజా రవాణా సదుపాయం, నివాసం, ఇతర సదుపాయాలు చిన్న చూపుకు గురవుతున్నాయి. ఉదాహరణకు హైదరాబాదులో నగరం నడిబొడ్డున ఉండి ప్రఖ్యాతి గాంచిన ఎయిడెడ్ పాఠశాలల ప్రాంగణాలు వాణిజ్య సముదాయాల కోసం ఆక్రమనకు గురికాబడి నిర్వహణకు నిధుల కొరత చివరికి ఉపాధ్యాయుల కొరత ద్వారా మూతబాదడానికి సిద్ధమయ్యాయి.

ఈ పట్టణీకరణ ప్రక్రియ పేదలను మనం చూసే మనకు తెలిసిన నగర ప్రాంతాలకు దూరం చేసి వారి పిల్లల జీవితాలను ప్రతికూలంగా ప్రభావితం చేయడంతో పాటు వారిని మరింత ప్రమాదకర పరిస్థితులను గురిచేస్తుంది. ఏ బస్తీలో చూసినా టార్పాలిన్ లేదా అల్యూమినియం సీట్లతో ఏర్పడిన నివాసలు అక్కడక్కడ డాబా ఇల్లు టీవీ యాంటినాలు విద్యుత్ తీగలు పాత బట్టల దుంతలు చెత్తతో నిండిన మురికి పరిసరాలు దుర్గంధం వెదజల్లుతు పారే మురికి కాలువల పరిసరాలు వారి నివాస ప్రాంతాలు అవుతున్నాయి. రోజుకి ఒకసారి ఒక గంట పాటు ట్యాంకర్ల ద్వారా సరఫరా అయ్యే నీటి కోసం వారు కుస్తీలు పడతారు. వేసవిలో అయితే నీటి కోసం చిన్నపాటి యుద్ధాలే జరుగుతాయి. తాగడానికి శుభ్రమైన నీరు అందుబాటులో లేని ఫలితంగా నీటిపారుదల వ్యవస్థ లోపం వల్ల జ్వరాలు డయేరియా మలేరియా డెంగ్యూ వంటి అనేక రోగాల బారిన పడుతుంటారు.

బడికి వెళ్ళని పిల్లలు బడికి వెళ్లే కొందరు పిల్లలు కూడా చెత్తకుప్పలు దుకాణాలు భవన నిర్మాణ సైట్లు ఫంక్షన్ హాల్లో కార్యక్రమాలు అయిన తర్వాత క్లీనింగ్ వర్క్ వంటి పనులు చేయడం వల్ల చర్మవ్యాధులకు నోటి పొక్కుల వంటి వ్యాధులకు గురవుతున్నారు. కొన్ని పని ప్రదేశాలలో వెలువడే ప్రమాదకర గ్యాసు దుర్గంధ వాసనాలకు భోజనం రుచించక ఆకలికి దూరమై పిల్లల ఆరోగ్యాల మీద ప్రభావం చూపుతున్నాయి. బడికి వెళ్ళడానికి బస్సులు ఉండవు కొంతమంది పిల్లలు జనం నడవడానికి యోగ్యం కానీ మార్గాలలో నాలుగు నుంచి ఐదు కిలోమీటర్ల కూడా నడిచి బడికి వెళ్లాలి వారు నివసించే నగరం మనం అందరం నివసించే నగరానికి ఎంతో దూరం కాదు మన మధ్యనే పక్కనే ఉంటుంది అయినా మన నగరంతో పోలిస్తే వారి నగరం భిన్నంగా ఉంటుంది.

**బాలురు, పురుశాదిపత్యం మరియు అస్తిత్వ వాస్తవాలు:**

ఈ నేపథ్యంలోనే సికింద్రాబాద్ లోని మధ్యతరగతి ప్రాంతంలోని మా ఇంటి వెనుక ప్రాంతంలోని బాలురు బాలికలతో ఏదో సమావేశంగా కాకుండా వారితో బస్తీలో కూర్చొని మామూలుగా మాట్లాడాను. ఈ సంభాషణ మొత్తం వారి రోజువారి జీవనం చదువు ఆటలు క్రీడలు స్నేహితులు జీవనోపాధి వాళ్ల తల్లిదండ్రులు వారి వృత్తి వంటి మొదలగు అంశాలు మా చర్చలోకి వచ్చాయి.

స్నేహితులు పుట్టినరోజుల పార్టీలు సినిమాలు మొబైల్ ఫోన్లు ఇంస్టాగ్రామ్ వంటి అంశాలపై మాట్లాడినప్పుడు బాలురు హాయిగా మాట్లాడుతూనే ఉన్నారు. అయితే చదువులు బడులు గురించి మాట్లాడినప్పుడు మాత్రం కొంత ఇబ్బంది పడ్డారు. వారు వాళ్ళ ఆడే ఆటలు గురించి హుషారుగా మాట్లాడారు క్రికెట్ అందరికి ఇష్టమైన ఆట దగ్గర్లోనే గుడి పక్కన ఉన్న ఖాళీ స్థలంలో క్రికెట్



ప్రాక్టీస్ కోసం టీమ్స్ ను ఏర్పాటు చేసుకున్నారు క్రికెట్ బ్యాట్ బంతి ప్యాడ్స్ కొనడానికి చెందాలు వేసుకుంటామని చెప్పారు. నెలలో రెండు సార్లు ఒక స్లమ్‌కు మరో స్లమ్‌ల మధ్య క్రికెట్ చాంపియన్షిప్ పోటీలు నిర్వహిస్తారట. ఈ పోటీల నిర్వహణ కోసం కావాల్సిన నిధులను చందాలు వేసుకుని నిర్వహిస్తారట. ఈ పోటీలలో పాల్గొనడానికి సరైన గ్రౌండ్లో ప్రాక్టీస్ చేయడం కోసం బస్సులో ను మెట్రోలోనూ వెళతారు. నాతో మాట్లాడిన పిల్లల టీం పేరు 'గల్లి బాయ్స్' టీం అని గర్వంగా చెప్పారు. క్రికెట్ పట్ల వారి మోజు ఎంత అంటే వారిలో ఒకరు క్రికెట్ కోసం మేం ప్రాణాలైనా ఇస్తాం అని చెబుతుంటే మిగతా మిత్రులు చప్పట్లు కొట్టారు. గోలీల ఆట గురించి కూడా వారు ఉత్సాహంగా వివరించారు అయితే ఇందులో డబ్బు పందెం జూదం ఉంటేనే గోలీల ఆటలో మజా ఉందని అందరూ ముక్తకంఠంతో చెప్పారు అయితే బస్తి లో ఉన్న 40 ఏళ్ల గోపి అనే సామాజిక కార్యకర్త పిల్లలు చెడు అలవాట్లకు అలవాటు కాకుండా చూస్తుంటాడాని గోలీలు అడుతున్నప్పుడు చూసినప్పుడు మాత్రం గోలీలు డబ్బులు దాచిపెట్టి ఆయన పోయిన తరువాత మళ్ళీ ఆడుతామని చెప్పారు. గోపి పైసలు పెట్టి ఆడడం చూస్తే మాత్రం మందలిస్తాడని చెప్పారు. గోపి వారిలో క్రమశిక్షణకు ప్రయత్నిస్తున్న వ్యక్తిగా కనిపించారు.

ప్రతి రెండు నెలలకు ఒకసారి అయినా మిత్రులలో ఎవరో ఒకరి పుట్టినరోజు వస్తుంది. బర్త్ డే బాయ్ బొమ్మతో ఒక ఫ్లెక్సీ లేదా కటౌట్ తయారు చేస్తారు పిక్నిక్ కి వెళతారు ఫాస్ట్ ఫుడ్ సెంటర్లో తింటారు కేక్ కట్ చేస్తారు డాన్సులు చేస్తారు మద్యం కూడా ఉంటుంది పార్టీలో. దీని అంతటికి ఖర్చుకు వారిలో వారు చందాలు వేసుకొని డబ్బు సమకూర్చుకుంటారు సరదాగా గడుపుతారు. ఈ బాలల హెయిర్ స్టైల్ కూడా ప్రత్యేకంగా చెప్పుకోవచ్చు పైకి నిక్కపొడిచినట్లు కత్తిరించుకోవడం, జూలపాలు పెంచడం, జుట్టుకు పసుపు ఎరుపు నీలం రంగులు వేయడం నల్లద్దాలు ధరించడం వంటి వేషాదారణాలు కనిపిస్తాయి, యూట్యూబ్ చూసి డాన్స్ చేయడం నేర్చుకుంటారు. వీళ్ళు తాము చేసే సరదాలకు నెలకి 500 నుంచి 1000 రూపాయల వరకు ఖర్చు పెడతారు నెలకు 200 రూపాయలు ప్యాకెట్ మనీ కావాలని ఇంట్లో తల్లిదండ్రుల నుండి డిమాండ్ చేసి అడుగుకుంటారు. ఇది కాక బెదిరించొ బతిమాలో తల్లి నుంచి మరో 100 రూపాయలు గుంజుతారు కొడుకుల పట్ల తల్లికి ఉండే ప్రేమను ఇలా క్యాష్ చేసుకుంటారు.

పెళ్లిలు ఇతర ఫంక్షన్లలో యూనిఫాం వేసుకుని వెయిటర్స్ గానూ బరువులు మోయడం దింపడం లారీలలో సామాన్లు ఎక్కించడం వంటి పనులు చేయడం ద్వారా దుకాణాలలో సహాయకులుగా నిర్మాణ పనులలో మేస్త్రీలకు సహాయంకులుగా బ్యాండ్ మేళం వంటి వాటిలో పనిచేసి సంపాదిస్తారు ఇలా సంపాదించి దాసుకున్న సొమ్మును వారు తమపై తమ ఆప్తమిత్రులపై ఖర్చు పెడతారు.

ఈ బాలలు వీధి గ్యాంగులలో సభ్యులుగా కూడా ఉండి హింస ముష్టి యుద్ధాలలో పాలుపంచుకుంటారు. ఎవరిని వారు రక్షించుకోవడానికి శిక్షణ ఇస్తారు ఇదంతా గ్యాంగ్‌కి వారు చెప్పే విధేయత దీని ద్వారా వీరికి మిత్రులు సన్నిహితులు ఏర్పడతారు. దూకుడుగా ఉండటాన్ని ఆనందిస్తూ మగతనాన్ని ప్రదర్శిస్తుంటారు. అక్కచెల్లెళ్లు ఆడపిల్లలు బలహీనులని పనికిరాని వాళ్ళని వారి పాత్ర ఇంటికే పరిమితం అని చాలా చిన్న చూపు చూస్తారు.

లాక్ డౌన్ లో ఆన్లైన్ క్లాసుల కోసం మొబైల్ ఫోన్ తప్పనిసరిగా వాడవలసి అవసరం వచ్చింది. ఫలితంగా చాలా మంది బాలురు మొబైల్ ఫోన్ లకు బానిసలు అయ్యారు. అశ్లీల వెబ్సైట్లకు అలవాటుపడ్డారు. అంతేకాదు మద్యపానం మత్తు పదార్థాలకు బానిసలు అయ్యారు. తాము నివసించే ప్రాంతాలు వాతావరణం తమ ఆత్మ అభిమానాన్ని ఎలా దెబ్బతీశాయో మానసిక కుంగుబాటు మానసిక ఆందోళనకు కలిగించాయో ప్రమాదకర ప్రవర్తనలకు ఉరిగొలిపాయో బాలురు వివరించారు ప్రతి ఒక్క బాలుడు వద్ద మొబైల్ ఫోన్ ఉంటుంది అది లేకుండా ఉండలేరు.

వాట్సప్ గ్రూపులో ఏర్పాటు చేసుకుని యూట్యూబ్ లింక్ షేర్ చేసుకుంటారు పాటలు డాన్స్ నేర్చుకుంటారు వీడియో గేమ్స్ ఆడతారు సోషల్ మీడియాలో తన్మయం కలుగుతారు. ట్విట్టర్

ఎక్స్ ప్రెస్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లో అందరూ చురుకుగా ఉంటారు ఇన్‌స్టాల్‌లో తమను ఫాలో అయ్యే వారి సంఖ్యను వారు గర్వంగా చూపారు. ముంబైకి ట్రిప్ వెళ్లడానికి కొంత నగదును కూడా వారు పోగేసుకున్నారు. వర్చువల్ స్పేస్ వారికి ఒక ఊహాలోకం వంటిది తమను తాను హీరోలుగా భావించుకోవచ్చు ఇష్టమైన నటులు లేదా క్రికెట్ ఆటగాళ్లతో లగ్జరీ హోటల్లో ఉన్నట్లు అందమైన సరస్సు ఒడ్డున కూర్చున్నట్లు ఊహించుకోవచ్చు. ఈ వర్చువల్ స్పేస్ తమకు అనేకమంది వర్చువల్ మిత్రులు అనుచరులు ఉన్నారని తాము అందరితో సమానం అని అనిపించేలా ఒక మత్తులో ఉండేటట్లు చేస్తుంది.

చదువు మీద ధ్యాస పెట్టి చదువుల వల్ల వచ్చే కొలువుల మీద దృష్టి పెట్టమని తల్లిదండ్రులు తమ కొడుకుల్ని నిరంతరం కోరుతూనే ఉంటారు బాలురకి చదువు విలువ తెలిసు కానీ స్కూళ్లలో తమకు కలిగిన అనుభవాలు తామకు ఆత్మనూన్యత భావానికి గురిచేశాయని భావిస్తారు లేదా చదువులో వెనుకబడడానికి తామే కారణం అని చదువులకు తాము పనికిరామని తమ అసమర్ధత కు తమకు తామే నిందించుకుని కొందరు పదవ తరగతి పూర్తి చేయకుండా బడి మానేస్తే మరి కొందరు ఎనిమిదవ తరగతి పూర్తి చేయకుండానే బడి మానేశారు. స్కూళ్లలో ఏం లేనప్పుడు అక్కడికి ఎందుకు వెళ్లాలి అని తమ తాము ప్రశ్నించుకుంటారు. బడి మానేసిన పిల్లలు ఏదో ఒక పని చేసి సొంత ఖర్చులకి డబ్బు సంపాదించు కోవడం మొదలెడతారు. ఇది తప్పు చేస్తున్నామని మనసులో అనుకున్న తమలాగే బడి మానేసి పనులు చేసే తమరితో పోల్చుకుని ఆ ఆలోచనల నుండి బయటపడతారు. చదువుతున్నావా ఏం చేస్తున్నావు వంటి ప్రశ్నలకు జవాబు ఇవ్వడానికి తోడ్పడుతుందని కొంత మంది ఓపెన్ స్కూల్ విధానంలో పదవ తరగతి పూర్తి చేసేందుకు ప్రయత్నిస్తారు. తాము చదువు మానేయడం ద్వారా చెడి పోయామని చాలామంది బాలురు అంగీకరించారు.



ఈ పరిస్థితులలో కొంత మంది పిల్లలు మత్తు మందులకు డ్రగ్స్ కు అలవాటు పాడుతారు. బస్తీలలో పిల్లలు పెద్దలు అందరూ కుటుంబాలకు కుటుంబాలు ఈ డ్రగ్స్ బారిన పడుతుంటారు. కుటుంబ వ్యవస్థ మొత్తం నిర్వీర్యం అవుతుంది. సంసారాలు ఒక పద్ధతిలో నడవవు. భర్త మరొక స్త్రీ తో వెళుతూనే భార్య మరో పురుషితో సంబంధాలు ఏర్పరుచుకోవడం ఫలితంగా కుటుంబాలలో తగాదాల తో ఛిద్రమైన కుటుంబాలు. కుటుంబం నైతిక విలువలు అనేవే ఏవి లేకుండా ఈ కుటుంబాలు విచ్చలవిడితనంతో జీవనం కొనసాగిస్తున్నారు. ఈ కుటుంబాలకు చెందిన పిల్లలు పూర్తిగా నిర్లక్ష్యానికి గురి అవుతుంటారు.

పిల్లలను తల్లిదండ్రుల బాధ్యతా రహిత ప్రవర్తనతో స్వంత కుటుంబమే ఈ పిల్లలకు అభద్రతలోకి నెట్టి వేయ బడుతారు. ఇలాంటి కుటుంబాలు ప్రతి బస్తీలో 30 నుండి 40 శాతం మంది ఉన్నారని ఒక అంచనా ఈ బస్తీలలోని పిల్లలు మత్తు పదార్థాలను స్వీకరించే కస్టమర్ల నుండి మెల్ల మెల్ల గా మత్తు పదార్థాలను బస్తీలోకి తీసుకు రావడానికి మధ్య వర్తులుగా మారిపోతారు. ఈ బస్తిలలో యువత మరియు యుక్త వయసు పిల్లలు ఎక్కువ మందే ఆత్మ హత్యలకు పాలుపడుతున్నట్లు గా కూడా తెలిసింది. ఇలా చనిపోయిన వారిని గోడకు వేలాడేసిన ఫోటో గా మారి పోయారని అనుకుంటారట. ఒక సారి తమా తో పదవ తరగతి చదువుతున్న విద్యార్థి మత్తుకు అలవాటుపడి అనుమానస్పద మృతి చెందిన సంధర్భంగా శవానికి పాలు పోస్తూ స్నేహితులంతా కలిసి తాగి డ్యాన్సులు చేస్తూ ఒక ట్రక్ మీద ఊరేగించి దహనం చేశారు. ఇది ఒక నూతనఆ భయంకరమైన చావు సంప్రదాయం.

అబ్బాయిలు ఒక్కసారి వారి పరిసరాల నుండి బయట పట్టణ పరిసరాలలోకి అడుగుపెట్టినప్పుడు వాళ్ళ పట్టణం పూర్తిగా భిన్నమైనది. వారు జీవించే పరిస్థితులు ఎలా ఉన్నా వారు ఇంట్లో అనుభూతి చెందుతారు, తక్షణ అవసరాలు మరియు కోరికలను తీర్చుకుంటారు. మగ పెత్తనాన్ని ప్రదర్శిస్తూ దూకుడుగా తృప్తిగా ఉంటారు. మనం నివసిస్తున్న మన పట్టణ ప్రాంతాలు ఆధునిక హంగులు పట్టణ అభివృద్ధి వారి పట్టణం కాదు. అణిగిమణిగి ఉండడం భావోద్వేగంతో మరియు ఆత్మగౌరవం కోల్పోవడం వారి జీవిత అనుభవం. నిజానికి వారి నిత్య జీవితం వాస్తవ ప్రపంచం మరియు భ్రమలో ఉన్న ప్రదేశాలలో మనోవైకల్యం తో తిరగాడుతున్నారు.

ఇలాంటి పరిస్థితుల జీవనం కొనసాగిస్తున్న ఈ పిల్లల వ్యక్తిత్వంపై ఎలాంటి ప్రభావం చూపుతుందో నా ఊహకు అందని విషయం. వారి అస్పష్టమైన భవిష్యత్తు ముందుగా ఊహించి చెప్పడం చాలా కష్టమే.

ముఖ్యంగా 30-40 ఏళ్ల వయసున్న వారి జీవితాలను పరిశీలిస్తే మగవారు మద్యానికి బానిసలు కావడం తమ కోప తాలను ఇంట్లో మహిళల, పిల్లల మీద చూపించడం గమనించవచ్చు.

బాలికలు, లింగ వివక్ష మరియు విద్య

అడుగడుగునా ఆడపిల్లలు కుటుంబాలలో పితృస్వామ్య విలువలు వీధుల్లో, పాఠశాలల్లో, బస్ స్టాప్లో లింగ వివక్షతో పోరాడుతున్నారు. వారు తమ గురించి విప్పి చెప్పడానికి కొంత సమయం తీసుకున్నారు. మొదటి సంభాషణ లింగ వివక్ష మరియు హింస గురించి. బాలికలు పాఠశాల నుంచి వచ్చిన తర్వాత ఇంటికే

పరిమితమితం కావడం, స్కూల్ నుండి ఆలస్యంగా ఇంటికి చేరుకోవడంతో తల్లిదండ్రులు వారిని అనుమానించడం మొదలైన అనేక ఇబ్బందులను బాలికలు ఈ బస్తీలలో ఎదురుకుంటున్నారు. పైగా మద్యానికి బానిసైన తండ్రుల హింస నుండి తల్లిని రక్షించేది ఆడపిల్లలే. తమ అన్న దమ్ములు చెలాయిస్తున్న పెత్తనాన్ని మగ పిల్లలకున్న అధికారాలను చూస్తూ వారి పట్ల కొంత ద్వేషాన్ని కూడా పెంచుకున్నారు.

మగ పిల్లలకు వేడి వేడి ఆహారాన్ని వడ్డించడం, ఏదైనా ప్రత్యేక వంటకం చేస్తే వారే ముందుగా తింటారు. అమ్మాయిలేమో మిగిలిపోయిన పదార్థాలతో సరిపుచ్చుకోవాలి. అబ్బాయిల ఇంటిపనులు లో ఏ మాత్రం సహాయం చేయరు మరియు ఎటువంటి బాధ్యత వహించరు. అబ్బాయియులు ఎంత సేపు వారి గురించి వారే ఆలోచించుకుంటారు తప్ప కనీసం అందరూ తినడానికి సరిపోను ఆహారం ఉందా లేదా అని తెలుసుకోవడానికి కూడా ప్రయతించరు. అదే ఆడ పిల్లలకు ఇంటి పరిస్తితి అంతా తెలిసి ఉంటుంది. కోవిడ్ లాంటి కష్ట సమయాల్లో కూడా అబ్బాయిల పరిస్థితి ఇదే.



బస్తీలలో అమ్మాయిలకు కూర్చోవడానికి, మాట్లాడుకోవడానికి, స్నేహితులతో కలవడానికి చోటు లేదు. అదే అబ్బాయిల విషయం లో 90% మంది ఆటలు పాటలతో సమయాన్ని గడుపుతుండగా అమ్మాయిలకు ఆటలు ఆడడం అనే ప్రశ్నే లేదు. ఆడ పిల్లలకే కాదు వాళ్ళ తల్లులకు కూడా వారి స్వంత గుడిసె బయట కూర్చొని మాట్లాడే స్థలం లేదు.

కోవిడ్ సమయంలో స్వచ్ఛంద సంస్థల సామాజిక వ్యక్తులు చేసిన సహాయం గురుంచి చాలా విషయాలు చెప్పారు. వాళ్ళు పంచిన రేషన్ల గురుంచి తమ బస్తీలో సంఘ పెద్దలు ఒక్కటై అతి పేద కుటుంబాలను ఆదుకున్న విషయాలను చెప్పారు. క్లిష్ట సమయంలో కుటుంబాలు ఒకరికొకరు మద్దతుని చూసి మనుషులలో మానత్వ రూపాన్ని చూశామని చెప్పారు. వారి వారి కుటుంబాలలో చాలా మంది రోజుకు ఒక పూట మాత్రమే భోజనం చేసేవారని మరియు కరోనా కాలం అంతా కూడా ఆందోళన కలిగించిన కాలంగా చెప్పారు. అదే సమయంలోనే తమతో పాటు చదువుతున్న చాలా మంది స్నేహితుల పెళ్లిళ్ళు కావడం వలన చదువు మానేయాల్సి వచ్చింది. కొన్ని సందర్భాలలో పెళ్లి వద్దని ప్రతిఘటించిన వారిని ఒక గదిలో బంధించి దారుణంగా కొట్టి బలవంతంగా పెళ్లికి ఒప్పించారని కూడా చెప్పారు. కోవిడ్ సమయంలో కొన్ని కుటుంబాలకు కరెంటు బిల్లులు చెల్లించడానికి కూడా డబ్బు లేక వారాల తరబడి చీకటిలోనే జీవించాల్సిన పరిస్తితి ఏర్పడింది. ఈ పరిస్థితులు వారి ఆందోళన మరియు నిస్పృహకు తోడైంది.

ఆడపిల్లలు బడులకు వెళ్ళే క్రమం ఒక తరగతి నుండి మరో తరగతికి మారడం లాంటి అనేక అనుభవాలను చాలానే పంచుకున్నారు. చదువు గురించి అబ్బాయిలతో మాట్లాడినప్పుడు అబ్బాయిలు దాటవేయడంతో చూస్తే ఆడ పిల్లల విషయంలో పూర్తిగా భిన్నంగా ఉంది. కోవిడ్ సమయంలో ఆన్లైన్ తరగతులు ప్రారంభమయ్యాయి తాము పాఠాలను వినే అవకాశాన్ని ఏ మాత్రం కోల్పోవద్దు అని అనుకున్నారు. స్మార్ట్ ఫోన్ల కోసం వారు తల్లిదండ్రుల మీద వత్తిడి తెచ్చారు. కొందరు తల్లులు అయితే ఎలాంటి వత్తిడి లేకుండానే, తమ పిల్లలు (కొడుకు, కూతురు ఇద్దరూ) చదువులు కొనసాగించాలని కోరికతో స్మార్ట్ ఫోన్లు సమకూర్చారు. ఆన్లైన్ తరగతులతో ఇబ్బందులు వున్నా, చదువులు కొనసాగించాలనే ఆసక్తి అలాగే బాల్య వివాహాలు తప్పించు కోవడానికి అమ్మాయిలకు ఆన్లైన్ తరగతులు ఉపయోగపడ్డాయి.

ఆన్లైన్ తరగతుల తరువాత స్మార్ట్ ఫోన్లు వినియోగించడానికి తమకు అనుమతి వుండదు అని బాలికలు చెప్పారు. కానీ బాలుర విషయంలో ఇందుకు భిన్నంగా ఉంది. బాలురకి ఈ నిబంధనలు, పరిమితులు లేవు. వారు 24 గంటలు ఫోన్ లో నిమగ్నమై అన్ని రకాల వెబ్సైట్లు చూసినా తల్లిదండ్రులు ప్రశ్నించరు. తమ పై 'కోవిడ్ బాచ్' అని ముద్ర వేశారని, జీవితాంతం ఆ ముద్రతోనే ఉండాల్సి రావడం ఇబ్బందికర విషయమని బాధ పడ్డారు. కష్టపడే, మెరిట్ విద్యార్థులకు అలాంటి ముద్ర వేయడం సరికాదని కొందరు విద్యార్థులు వాదించారు.

కోవిడ్ వుధృతి తగ్గిన తర్వాత కూడా ఆన్లైన్ తరగతులు కొనసాగించారు అని విద్యార్థినులు తెలిపారు. టీచర్లు తమను Whatsapp గ్రూపులుగా ఏర్పాటు చేసి, సబ్జెక్టుల వారీగా నోట్స్ హెూమ్ వర్క్తో బోధన కొనసాగించారు. కోవిడ్కి ముందు ప్రాజెక్టుల కోసం, హెూమ్ వర్క్ కోసం గ్రూప్లు గా పనిచేయడం వల్ల విద్యార్థుల మధ్య, విద్యార్థులు ఉపాధ్యాయుల మధ్య చక్కని సంబంధాలు, సంభాషణలు వుండేవి. కోవిడ్ తర్వాత ఇదంతా మారిపోయింది. పిల్లలు, టీచర్లు ఎదురెదురుగా కలవడం తగ్గిపోయింది. వారి మధ్య సంభాషణలు ఎక్కువ భాగం సోషల్ మీడియా ద్వారానే జరుగుతున్నాయి.

ఇంట్లో అబ్బాయిలకి పార్టీలకు, కొత్త దుస్తులు కొనడానికి, ఫ్రెండ్స్ తో కలిసి కేక్ కట్ చేయడానికి, ఇలా అనేక అవసరాలకి పైసలు ఇస్తారు గానీ, బాలికలను మాత్రం వున్న దానితో సరిపెట్టుకోమంటారు అని బాలికలు వెల్లడించారు. పుట్టిన రోజు బాలికల కోసం ఇంట్లో కనీసం అన్నం, చికెన్ కూర నన్న చేస్తారు అని వారు చెప్పారు.

బాలికలు తమ విద్యను కొనసాగించాలని దృఢ నిశ్చయంతో ఉన్నారు. వారిలో కొందరు పార్టమ్ ఉద్యోగాలు లేదా సెలవుల్లో విద్య కోసం తమ ఖర్చులను తీర్చడానికి పని చేస్తున్నారు. తల్లిదండ్రులు కూడా వారిని ప్రోత్సహిస్తారు మరియు వారి ఉన్నత చదువుల కోసం రుణాలు తీసుకోవడానికి సిద్ధంగా ఉన్నారు. అదే సమయంలో, వారు హైస్కూల్లో చదివే సమయానికి, వారిని వివాహం చేసుకోవాలని వారిపై ఒత్తిడి ఉంటుంది. అమ్మాయిలు ఏ వివాహ కార్యక్రమాలకు కానీ వేడుకలకు కానీ హాజరు కావడానికి ఇష్టపడరు. ఎందుకంటే 'ఆంటీలు' వారిని పెళ్లి సంబాధాలు చూసి పెట్టటానికి నలుగురికి చూపించడానికి సిద్ధంగా ఉంటారని. చదువుకోవాలని, తమ దారులు తామే వెతుక్కోవాలని, స్వతంత్రంగా ఉండాలని, బలవంతపు పెళ్లిళ్ళు చేసుకోకూడదని అమ్మాయిలు కోరుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్య ప్రాముఖ్యత విద్యను ఆపకుండా కొనసాగించాలని ఆడపిల్లలా చర్చాలలో ముఖ్యమైన సారాంశం. ఉన్నత విద్యను అభ్యసించాలనే ఆకాంక్షలను గౌరవ ప్రదమైన జీవితాన్ని గడపాలని కలలు కంటున్న ఈ బాలికలను 'ఇతర' నగరం వారిని భయపెట్టవద్దు.



అయితే చదువు మానేసిన బాలికలకు స్నేహితులు కానీ అందరితో కలిసి మెలిసి తిరిగే అవాకశాలు లేవు. వారు కేవలం తమ ఇంటికే పరిమిత మవుతూ ఇంటి పనులు చేస్తూ, ఇళ్ళలో చాకిరీ చేస్తూ, చిన్న చిన్న పరిశ్రమలలో రోజు కూలిగా పని చేస్తూ కర్మాగారాల్లో ఎల్లప్పుడూ పెద్దవారి కనుసన్నులలోనే ఉంటారు. ప్రతి నిత్యం అవమానాలు భరిస్తూ అంతులేని విషయవలయం చిక్కుకున్నారు. అడుగడుగునా ఒంటరితనం ఇతరులచే చీదరించ బడుతూ ఉంటుంది. ఇక వివాహం కనుక జరిగి ఉంటే శారీరక, మానసిక మరియు లైంగిక హింస మరియు అణచబడి ఉంటారు. ఈ పరిస్తితి ఆమెలో భయం ఆందోళనతో కాలం గడుపుతుంది. ఈ పరిస్థితికి అంతటికీ సామాజిక అనుమతి తోనే జరుగుతుంటుంది. ఇట్టి పరిస్థితులలో వారు నిరాశ నిస్పృహలకు గురవుతు విధి రాసిన రాతగా భావించి నిస్పృహలోకి జారీ పోతారు. వారి అనుభవిస్తున్న రోదన వినే వారు ఉండరు. విచారకరమైన విషయం వారి జీవితంలో హింస నుండి బయటపడే అవకాశం వారికి ఉండదు.

**ముగింపు**

మొత్తం మీద అబ్బాయిలు హానికరమైన ప్రవర్తనను ఆశ్రయిస్తారు. వారి ప్రవర్తనల గురించి తీర్పు చెప్పడంలో అర్థం లేదు. అదేసమయంలో బాలికలు పితృస్వామ్యం మరియు లింగ హింస నుండి బయటపడటానికి విద్యను ఒక మార్గంగా చూస్తారు. ప్రశ్నించవలసిన అమానవీయ పరిస్థితులు మామూలు విషయాలుగా మారి పోయాయి. వారు నివసించే పరిసరాల్లో మరియు ప్రదేశంలో వారు అస్థిరంగా, దుర్భరంగా జీవించడం మాత్రం అన్యాయం.

ఒక వైపు విద్యపై రాష్ట్ర పెట్టుబడులను ఉపసంహరించు కోవడం మరో వైపు భరించలేని ఫీజులు ఇతర ఖర్చులతో ప్రైవేట్ పాఠశాలల విస్తరణ పిల్లలు పాఠశాలల్లో కొనసాగడం ఎంత కష్టతరం చేసిందో మనం చూస్తూనే ఉన్నాము. ఇలాంటి బస్తీలలో నివసిస్తున్న పిల్లలను పాఠశాలల నుండి మాత్రమే కాకుండా మొత్తం సమాజం నుండె బహిష్కరించాము. అన్ని వసతులతో కూడిన ప్రభుత్వ పాఠశాలలను తిరిగి పునరిద్దయించ వలసిన అవసరం ఉంది. అంతే కాకుండా మొదటి తరం చదువుకు కదిలిన పిల్లల పట్ల వివక్షత భావం మరియు మొద్దుబారిన విద్యా వ్యవస్థను పూర్తిగా ప్రక్షాళన చేయవలసిన అవసరం ఉంది. పిల్లలందరికీ న్యాయం చేయడమే విద్యా లక్ష్యం కావాలి.

పిల్లలను హానికరమైన వాతావరణం నుండి రక్షించడం ఒక సవాలు. వారికి అన్నీ విధాలా సౌకర్యాలు కల్పించడం. ఆటలు ఆడు కోవడానికి పాటలు పాడుకోవడానికి, వాళ్ళకిష్ట మైన పనులు చేసుకునే అవకాశాలను కల్పించడం చెప్ప దలచుకున్న విషయాలను ధైర్యంగా చెప్పే అవకాశాలు ఇవ్వడం, ఆట స్థలాలను కల్పించడం, పాఠశాలలను అందుబాటులో ఉంచడం, కమ్యూనిటీ సెంటర్లను అందుబాటులో ఉంచడం మొదలగు ఇతర సదుపాయాలు కల్పించాలి.


మరో సవాలు ఏంటంటే అణగారిన వర్గాల పిలల దృష్టిలో నుండి నగరం మరియు దాని పరిసరాలను చూడటం మరియు వారు చెప్పే మాటలు వినడం. ముఖ్యంగా అన్ని పట్టణ ప్రణాళికలను పిల్లల కేంద్ర వేదికగా చేయడం, మైదానంలో, స్కూల్, సామాజిక కేంద్రాల్లో, ఇతర బహిరంగ ప్రదేశాల్లో అన్ని సదుపాయాలు అందుబాటులో ఉంచాలి. ఈ ప్రక్రియ పిల్లల హక్కుల రక్షణ మాత్రమే కాదు మొత్తం సమాజాన్ని సంపూర్ణ మార్పుకు దోహదపడుతుంది. ఆ క్రమంలో పట్టణ స్థల ప్రజాస్వామ్యీకరణ ప్రక్రియ ప్రారంభమవుతుంది.

పట్టణ పేదలు నివసించే జనాభా పెరుగుదల అందులో అత్యధిక శాతం మంది దూరమవుతున్నందున వారి ఆందోళనలు, జీవిత పరిస్థితులు నగరం మొత్తం మీద ప్రభావం చూపడం అనివార్యం. నిజానికి రెండు నగరాలు లేవని గుర్తించడమే సవాలు. వారి జీవితాలు మన జీవితాలు ఒకరితో ఒకరికి ముడిపడి ఉన్నాయని గుర్తించాలి.

– ప్రొఫెసర్ శాంత సిన్హా
పూర్వ జాతీయ బాలల హక్కుల కమిషన్, చైర్పర్సన్

# మే 3న పత్రికా స్వేచ్ఛా దినోత్సవం

ప్రపంచ పత్రికా స్వేచ్ఛ దినోత్సవం ప్రతి సంవత్సరం మే 3న నిర్వహించబడుతుంది. పత్రికా స్వేచ్ఛ పరిరక్షణకు, పత్రికా స్వేచ్ఛపై అవగాహన కల్పించటానికి ఈ దినోత్సవం జరుపుకుంటారు. ఆఫ్రికాలోని చాలా దేశాల్లో పత్రికా స్వేచ్ఛపై ఆంక్షలు ఉండేవి. వాటికి నిరసనగా ఆఫ్రికన్ జర్నలిస్టులు 1991, ఏప్రిల్ 29 నుండి మే 3వ తేదీవరకు ఆఫ్రికాలోని నమీబియా దేశపు విండ్ హాక్ నగరంలో సమావేశం ఏర్పాటుచేసి, పత్రికా స్వేచ్ఛకు సంబంధించిన అనేక తీర్మానాలు వచ్చాయి.






ఆఫ్రికన్ జర్నలిస్టుల నిరసనగా గుర్తుగా మే 3వ తేదీని ప్రపంచ పత్రికా స్వేచ్ఛా దినోత్సవంగా జరపాలని 1993, డిసెంబరు నెలలో ఐక్యరాజ్య సమితి సర్వసభ్య సమావేశం నిర్ణయించింది. అప్పటినుంచి ప్రతి సంవత్సరం మే 3వ తేదీన ప్రపంచ పత్రికా స్వేచ్ఛ దినోత్సవంను జరుపు కుంటున్నారు.

ప్రపంచవ్యాప్తంగా ఉన్న పత్రికా స్వేచ్ఛను అంచనా వేయడం, దానిని రక్షించడం. విధుల్లో ప్రాణాలు కోల్పోయిన జర్నలిస్టులకు నివాళి అర్పించడం అనేవి ప్రపంచ పత్రికా స్వేచ్ఛా దినోత్సవం లక్ష్యాలు.

పత్రికారంగంలో ప్రపంచవ్యాప్తంగా జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలు, పరిష్కారం, వృత్తి నిర్వహణలో జర్నలిస్టుల స్వేచ్ఛ, సమాజాన్ని ఎడ్యుకేట్ చేయడంలో వారి సహకారం వంటి అంశాలపై ప్రపంచ పత్రికా స్వేచ్ఛ దినోత్సవం సందర్భంగా చర్చిస్తుంటారు.

ఇటీవల కాలంలో జర్నలిస్టులపై దాడులు విపరీతంగా పెరిగాయి. వృత్తి నిర్వహణలో కొందరు ప్రాణాలను సైతం కోల్పోతున్నారు. పత్రికారంగంలో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న జర్నలిస్టుల హత్యలను ప్రెస్ ఎంబ్లెన్స్ క్యాంపెయిన్ (PEC) తాజా గణాంకాలను వెల్లడించింది.

2013 సంవత్సరం నుంచి పరిగణలోకి తీసుకుంటే దాదాపు 1200 మంది జర్నలిస్టులు వృత్తి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయారు. సగటున సంవత్సరంలో 113 మంది, వారానికి ఇద్దరు చొప్పున జర్నలిస్టులు హత్యకు గురవుతున్నారు.

ప్రస్తుతం దేశ వ్యాప్తంగా 400కి పైగా టీవీ న్యూస్ చానళ్లు ఉన్నాయి. పత్రికలైతే వేలల్లో ఉన్నాయి. ప్రాంతీయ ప్రతికా స్వేచ్ఛ సూచీలో నార్వే, డెన్మార్క్, స్వీడన్ మొదటి స్థానాల్లో ఉండగా చివరి స్థానంలో నార్త్ కొరియా ఉంది.

చాలా దేశాల్లో డిజిటల్ సాంకేతికత, స్వతంత్ర మీడియా వృద్ధి, అపరిమిత సమాచార వ్యాప్తిని సులభతరం చేశాయి. అయినప్పటికీ మీడియా స్వేచ్ఛ, జర్నలిస్టుల భద్రత, భావప్రకటనా స్వేచ్ఛకు ముప్పు వాటిల్లుతోంది. ప్రాథమిక మానవ హక్కులపై ప్రతికూల ప్రభావానికి దారి తీస్తోంది.

2024లో ప్రపంచ పత్రికా స్వేచ్ఛా దినోత్సవం యొక్క థీమ్ “ఎ ప్రెస్ ఫర్ ది ప్లానెట్: జర్నలిజం ఇన్ ది ఫేస్ ఆఫ్ ది ఎన్విరాన్‌మెంటల్ క్రైసిస్” చుట్టూ కేంద్రీకృతమై ఉంటుంది. ఈ ముఖ్యమైన రోజు మే 3, 2024న జరుపుకోవడానికి షెడ్యూల్ చేయబడింది.

ప్రపంచ పత్రికా స్వేచ్ఛ దినోత్సవం రోజున యూనెస్కో మరియు గులెర్మో కానో ఇసాజ ఫౌండేషన్ వరల్డ్ ప్రెస్ ఫ్రీడమ్ ప్రైజ్ (world press freedom prize)ను ప్రపంచ వ్యాప్తంగా పత్రిక స్వేచ్ఛ కోసం కృషి చేసిన వ్యక్తి, సంస్థకు ఇస్తారు.

– దక్కన్‌న్యూస్
m : 9030 6262 88
e: desk.deccan@gmail.com



# జీవవైవిధ్యంతో పశ్చిమ కనుమలు

**ఉనికి:** మహారాష్ట్ర, కర్నాటక, తమిళనాడు, కేరళలో 39 సీరియల్ సైట్స్

**గుర్తింపు :** 2012


**విభాగం :** నేచురల్

**సార్వత్రిక విలువ:**

భారతదేశ పశ్చిమ తీరం పొడుగునా కొండల గొలుసుగా ఉండే పశ్చిమ కనుమలు హిమాలయ పర్వతాల గొలుసు కంటే ప్రాచీనమైనవి. ఇవి ఈ ప్రాంతపు ఉష్ణ వాతావరణాన్ని చల్లబరిచేలా భారతీయ రుతుపవనాల తీరుతెన్నులను మారుస్తాయి. వీటికి ఉన్న మరో విశిష్టత జీవపరమైన వైవిధ్యత, స్థానికంగానే కనిపించే కొన్ని జీవజాతులు. ఇవే వీటికి ప్రకృతి పరిరక్షణపరంగా అపరిమిత ప్రాధాన్యాన్ని కూడా అందించాయి.

**ప్రాథమ్యాలు:** (x) (X)

(ix): మొదటగా, జురాసిక్ కాలం తొలినాళ్లలోని గోండ్వానా ల్యాండ్ ప్రాచీన భూభాగం ముక్కలు కావడానికి సంబంధించిన విశేషాన్ని, రెండవదిగా, భారతదేశం ఒక ఒంటరి భూభాగంగా ఏర్పడడాన్ని ఇక మూడోదిగా భారత భూభాగం యురేషియా వైపు వెళ్లడాన్ని ఈ పశ్చిమ కనుమలు చాటిచెబుతాయి. ఈ పశ్చిమ కనుమలు జీవుల చెల్లాచెదురు, రకాలకు సంబంధించిన అవుట్ ఆఫ్ ఆఫ్రికా, అవుట్ ఆఫ్ ఆసియా సిద్ధాంతాల విప్లవాత్మక ఎకోటోన్ లను ప్రదర్శిస్తాయి.



(x) పశ్చిమ కనుమలు ఉత్కృష్ట స్థాయి జీవవైవిధ్యాన్ని, అక్కడికి పరిమితమైన జీవజాలాన్ని కలిగిఉన్నాయి.

2012లో భారతదేశం చరిత్రాత్మక పరిరక్షణ మైలురాయిని అధిగమించినట్లయింది. నాలుగు వేర్వేరు రాష్ట్రాల్లోని 39 రక్షిత ప్రాంతాల క్లస్టర్ అంతా కలిపి ఒక్కటిగా గుర్తింపును పొందింది. అదేమీ అంత సులభంగా రాలేదు. ఈ విజయం ఎంతో సంక్లిష్టతతో, క్షేత్రస్థాయిలో గొప్పగా పని చేయడం ద్వారా సాధ్యపడింది. అందుకు గాను ఎన్నో ఏళ్ల పాటు రాజకీయ నాయకులు, సామాజిక శాస్త్రవేత్తలు, పర్యావరణవేత్తలు అంతా కలసి చర్చలు జరపాల్సి వచ్చింది. వారందరి ఆశయం ఒక్కటే... వరల్డ్ హెరిటేజ్ కన్వెన్షన్ గొడుగు కిందికి ఈ ప్రకృతి పరిరక్షణను తీసుకురావడం.



ఆ ఏడాది రష్యాలోని సెయింట్ పీటర్స్ బర్గ్ లో జరిగిన వరల్డ్ హెరిటేజ్ కమిటీ ఇలా పేర్కొంది. “మరెక్కడా లేనివిధంగా భూమధ్యరేఖా ప్రాంతానికి చెందని ఉష్ణ సతతహరితారణ్య అడవులకు ఇది చక్కటి ప్రాతినిధ్యం వహిస్తోంది. అంతర్జాతీయంగా అంతరించిపోయే ముప్పు ఎదుర్కొంటున్న కనీసం 325 రకాల జంతువులు, మొక్కలు, పక్షులు, చేపలు, ఇతర జీవులకు ఇది ఆవాసంగా ఉంది. దీని జీవావరణ వ్యవస్థలు భారతీయ రుతుపవన వాతావరణ ధోరణులను ప్రభావితం చేస్తున్నాయి. ఈ ప్రాంతపు ఉష్ణవాతావరణాన్ని తగిన విధంగా ఉంచుతున్నాయి. ఇది భూగ్రహంపై రుతుపవన వ్యవస్థలకు చక్కటి ఉదాహరణల్లో ఒకటిగా ఉంటోంది”.



హిమాలయాల కంటే ప్రాచీనమైన ఈ ఘాట్స్ (ఈ పేరు బహుశా మరాఠీ పదం ఘాట్ నుండి వచ్చింది, దీని అర్థం “మార్గం”) భారతదేశ పశ్చిమ తీరానికి సమాంతరంగా ఉన్న పర్వతాల పొడవైన గొలుసు. మహారాష్ట్ర-గుజరాత్ సరిహద్దులోని డాంగ్స్ (వెదురు అడవులు) నుండి 1,600 కిలోమీటర్ల పొడుగునా సుమారు 1,40,000 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఇవి విస్తరించి ఉన్నాయి. తమిళనాడు - కేరళ సరిహద్దు వెంబడి 30 కిలోమీటర్ల పాల్ఘాట్ గ్యాప్ ద్వారా మాత్రమే అంతరాయం కలిగింది.

ఈ విధమైన హోదా పొందిన ఘాట్స్‌లో అనేక రక్షిత ప్రాంతాలు ఉన్నాయి. వీటిలో ముఖ్యమైనవి మహారాష్ట్రలోని సహ్యాద్రి క్లస్టర్, కర్ణాటకలోని కుద్రేముఖ్ క్లస్టర్, తమిళనాడులోని ముకుర్తి-కలకడ్-ముందంతురై క్లస్టర్, కేరళలోని సైలెంట్ వ్యాలీ-పెరియార్ క్లస్టర్.

అంతరించిపోతున్న నిర్దిష్ట జాతులను, ప్రపంచంలో మరెక్కడా లేని ఐకానిక్ జాతులను ఈ రక్షిత రక్షించడానికి నాలుగు రాష్ట్రాల్లోని అటవీ శాఖలచే తీవ్రంగా కృషి చేస్తున్నాయి.

ఈ ప్రపంచంలో అధిక స్థాయి జీవ వైవిధ్యం మరియు స్థానికతను ప్రదర్శించడంతో ఈ సైట్‌ను గ్లోబల్ బయోడైవర్సిటీ హాట్‌స్పాట్‌గా కూడా పిలుస్తారు. ఇక్కడ అనేక వన్యమృగాలు, మచ్చిక చేసిన జీవుల జాతులు ఉద్భవించాయి. ప్రస్తుతం ఇవి మానవ-ప్రేరిత అభివృద్ధి ముప్పు, స్థానిక విలుప్తానికి గురవుతున్నాయి.

పశ్చిమ కనుమలు వేసవి చివరలో నైరుతి నుండి వచ్చే వర్షాలతో కూడిన రుతుపవనాల గాలులను అడ్డగిస్తాయి. ఇక్కడి అడవులు స్థిరీకరణ ఏజెంట్‌గా పనిచేసి భారీ వర్షాలను ప్రేరేపిస్తాయి. ఈ అడవులు గోదావరి, కావేరి, కృష్ణ, తుంగభద్ర, కబిని, పెరియార్, భరతపూజ, పంబా, నేత్రావతి, శరావతి, మండోవి, జువారీ వంటి అనేక శాశ్వత నదులు, వాటి ఉపనదులకు అత్యంత ముఖ్యమైన పరీవాహక ప్రాంతాలలో ఒకటిగా ఉన్నాయి. 200 మిలియన్లకు పైగా ప్రజలు తమ మనుగడ కోసం ఈ సహజ వనరులపై ఆధారపడి ఉన్నారు.

నీల కురుంజి (స్ట్రోబిలాంథెస్ కుంతియానా) పూల విస్తాలను చూసేందుకు ప్రజలు తరలి రావడంతో స్థానిక సమూహాలు “ప్రపంచ వారసత్వం” ట్యాగ్ నుండి ప్రయోజనం పొందాయి. ఇది కేరళలోని మున్నార్ లేదా గ్రాస్ హిల్స్ నేషనల్ పార్క్ లో పన్నెండు సంవత్సరాలకు ఒకసారి మాత్రమే పూస్తుందిబీ మహారాష్ట్రలోని కాస్ పీఠభూమిలో ఎనిమిది సంవత్సరాలకు ఒకసారి పూసే కాలానుగుణ కార్వి (స్ట్రోబిలాంథెస్ కాలోసల్) ఉన్నాయి. అనేక ఇతర పుష్పించే మూలికలు, పొద జాతులతో పాటు అవి ఆకుపచ్చని నేపథ్యంలో ప్రకృతి రంగుల కార్పెట్ లాంటి విస్తాను ఏర్పరుస్తాయి.

కమ్యూనిటీ-ఆధారిత పర్యాటకం ప్రధానంగా వ్యవసాయ దారులైన ఈ స్థానిక సమూహాలకు ప్రత్యామ్నాయ ఆదాయాన్ని అందించింది. ప్రాంతీయ, జాతీయ స్థాయిలో, ప్రపంచ వారసత్వ గుర్తింపు అంటే అభివృద్ధి ప్రాజెక్టులు (రోడ్లు, రైల్వేలు, విద్యుత్ లైన్లు వంటివి) రూపకల్పన, ప్రణాళిక, అమలు దశలో సహజ పర్యావరణ వ్యవస్థల పర్యావరణ సున్నితత్వాన్ని పరిగణలోకి తీసుకుంటాయి. అంతర్జాతీయ స్థాయిలో, అంతర్జాతీయంగా భూతాపాన్ని తగ్గించడంలో పశ్చిమ కనుమలు, తీరప్రాంత మడ అడవుల పాత్ర గుర్తింపులు, శాస్త్రీయ ఆధారాలు పెరుగుతున్నాయి.

– సోనాలి ఘోశ్

అనువాదం : ఎన్. వంశీ

# సంక్షోభంలో జ్ఞాన భాండాగారాలు

## మే 18న అంతర్జాతీయ మ్యూజియం దినోత్సవం సందర్భంగా

అంతర్జాతీయ మ్యూజియం దినోత్సవం (IMD) ప్రతి సంవత్సరం మే 18న జరుపుకుంటారు. ఏ సంస్కృతిలోనైనా మ్యూజియంల ప్రాముఖ్యతను హైలైట్ చేయడానికి ఈ రోజును పాటిస్తారు. మ్యూజియంలు సాంస్కృతిక మార్పిడి, సంస్కృతుల సుసంపన్నం, ప్రజల మధ్య పరస్పర అవగాహన, సహకారం మరియు శాంతి అభివృద్ధికి ముఖ్యమైన సాధనాలు.

మ్యూజియంలు, వారు ఎదుర్కొంటున్న సవాళ్ల గురించి ప్రజలకు అవగాహన కల్పించే లక్ష్యంతో అంతర్జాతీయ మ్యూజియం దినోత్సవాన్ని జరుపుకుంటారు. ప్రతి సంవత్సరం అంతర్జాతీయ కౌన్సిల్ ఆఫ్ మ్యూజియమ్స్ (ICOM) ఒక నిర్దిష్ట నేపథ్యంతో వస్తుంది. అన్ని కార్యకలాపాలు ఈ నిర్దిష్ట అంశం చుట్టూ తిరుగుతాయి. మ్యూజియం అనేది ప్రపంచవ్యాప్తంగా ఉన్న సంస్కృతులు, సమాజాలు, ప్రకృతికి సంబంధించిన అన్ని రకాల పత్రాలు, చారిత్రక కళాఖండాల సేకరణలను ప్రదర్శించే ప్రదేశం.






ఈ సంవత్సరం థీమ్, "మ్యూజియంలు, విద్య మరియు పరిశోధన," సంపూర్ణ విద్యా అనుభవాన్ని అందించడంలో సాంస్కృతిక సంస్థల యొక్క కీలక పాత్రను ప్రత్యేకంగా చెబుతుంది. ఈ రోజు మరింత స్పృహతో కూడిన, స్థిరమైన మరియు సమ్మిళిత ప్రపంచం కోసం ముందుకు వస్తుంది.

మానవ సంస్కృతి, చరిత్రలను పరిరక్షించే జ్ఞానభాండాగారం మ్యూజియం. ఇలాంటి ప్రదర్శనశాలల్లో భద్రపరిచే పురాతన వస్తువులు, కళాఖండాలు పరిశోధనలకు ఎంతో ఉపయుక్తంగా ఉండటమే కాకుండా, భావితరాలకు విలువైన పాఠాలు బోధిస్తాయి. వీటి సందర్శనతో విద్యార్థుల విషయ పరిజ్ఞానం- పాఠ్యాంశాల పరిధిని దాటి విస్తరిస్తుంది. ఒక్క అమెరికాలోనే ఏటా 85 కోట్ల మంది పురావస్తు ప్రదర్శనశాలలను సందర్శిస్తారు. ఇది పశ్చిమ దేశాల్లో వీటికున్న ఆదరణకు నిదర్శనం. 1784లో కలకత్తాలో రాయల్ ఏసియాటిక్ సొసైటీ స్థాపించినప్పటి నుంచి పరిశోధనలో భాగంగా బ్రిటిష్ అధికారులు, శాస్త్రవేత్తలు ఎంతో విలువైన సాంస్కృతిక సంపదను సేకరించి భద్రపరచడం ద్వారా మన దేశంలో వస్తు ప్రదర్శనశాలల శకం మొదలైంది. 1814లో ఈ సొసైటీ ఆవరణలోనే మొట్టమొదటి ప్రదర్శనశాలను ప్రారంభించారు. తదనంతర కాలంలో దేశవ్యాప్తంగా వీటి విస్తరణ కొనసాగింది.

### మారిన అభిరుచులు

స్వాతంత్ర్యం వచ్చిన తరవాత భారతీయ అస్తిత్వం ప్రతిబింబించేలా 1949లో దిల్లీలో జాతీయ సంగ్రహాలయం ఏర్పాటుతో మరింత ముందడుగు పడింది. 1956లో కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖలో ఏర్పాటు చేసిన కేంద్ర సలహా బోర్డు సహకారంతో దేశంలోని పురావస్తు ప్రదర్శనశాలలను సర్వే చేయడంతోపాటు- కొత్త వాటిని నెలకొల్పేందుకు కావాల్సిన ఆర్థిక, సాంకేతిక సహాయం అందిస్తున్నారు. దాంతో వివిధ రాష్ట్రాల్లో గిరిజన ప్రదర్శనశాలలతో పాటు ఆర్ట్ గ్యాలరీలు, విజ్ఞాన, సాంకేతిక, పారిశ్రామిక, హస్తకళ, విద్య, ఆరోగ్య, తపాలా, అటవీ తదితర ప్రదర్శనశాలలు ఏర్పాటయ్యాయి. ప్రస్తుతం మనదేశంలో వివిధ ఇతివృత్తాలతో జాతీయ, ప్రాంతీయ ప్రాధాన్యం కలిగిన 1,500 ప్రదర్శనశాలలు ఉన్నట్లు అంచనా. 1984లో మన దేశంలో స్థాపించిన భారత జాతీయ సాంస్కృతిక వారసత్వ ట్రస్టు (ఇంటాక్) ప్రపంచంలోని అతిపెద్ద వారసత్వ కట్టడాల పరిరక్షణ సంస్థల్లో ఒకటి. ప్రజల మధ్య సాంస్కృతిక మార్పిడి, పరస్పర సహకారం, శాంతి పట్ల అవగాహన కల్పించేందుకు అంతర్జాతీయ సంగ్రహాలయాల మండలి (ఐకామ్) సర్వప్రతినిధి సభ తీర్మానం ప్రకారం ఏటా మే నెల 18వ తేదీని అంతర్జాతీయ మ్యూజియం దినోత్సవంగా జరుపుకోవాలని 1977లో నిర్ణయించారు. సామాజికాభివృద్ధిలో ప్రదర్శనశాలల ప్రాధాన్యాన్ని చాటిచెప్పడంతోపాటు, భావి తరాలకు సాంస్కృతిక వారసత్వ సంపదను అందించాలన్నదే ఈ దినోత్సవం ముఖ్య ఉద్దేశం.

ప్రపంచీకరణతో చోటుచేసుకున్న మార్పులతో ప్రజల అభిరుచులు మారిపోవడం, టీవీలు కంప్యూటర్లు స్మార్ట్‌ఫోన్ల

ప్రభావం పెరగడంతో విజ్ఞాన ఆధారిత ప్రదర్శనశాలలపై ఆసక్తి తగ్గింది. దీనికితోడు- కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆర్థిక సహాయం తగ్గడంతో వాటి విస్తరణ, నూతన ఆవిష్కరణలు, సదుపాయాలు కరువై ఎక్కువమంది సందర్శకులను ఆకర్షించలేక పోతున్నాయి. మరోవైపు, బహిరంగ ప్రదర్శనశాలలకు సంబంధించిన ఎన్నో భూములు ఆక్రమణలకు గురయ్యాయి. కొన్ని ప్రభుత్వ అవసరాల పేరిట అన్యాక్రాంతమవుతున్నాయి. కేంద్ర సాంస్కృతిక శాఖ సర్వే ప్రకారం- 321 బహిరంగ వారసత్వ ప్రదేశాలు, చారిత్రక కట్టడాలు ఆక్రమణలకు గురయ్యాయి. మన తెలుగు రాష్ట్రాలకు సంబంధించి- ఇటీవల విశాఖపట్నం సమీపంలోని తొట్లకొండ వద్ద ప్రభుత్వ అతిథి గృహం నిర్మాణానికి భూమి కేటాయింపులు, హైదరాబాద్‌లోని గోల్కొండ కోటలో ఆక్రమణలు వివాదాస్పద మయ్యాయి. ప్రదర్శనశాలల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉదాసీన వైఖరిని అవలంబిసన్తూ, సరైన వసతులు కల్పించకపోవడంతో విద్యావేత్తలు, పరిశోధకులు నిరాశ నిస్పృహలకు గురవుతున్నారు.

### వర్చువల్ పద్ధతిలో...

ప్రపంచంలోనే మొదటిసారిగా కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వశాఖ - ఇతర సంస్థల సహకారంతో రూపొందించిన ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌తో ప్రస్తుతం మన దేశంలో పది జాతీయ సంగ్రహాలయాలను ఆన్‌లైన్ పద్ధతిలో ఉచితంగా వీక్షించే అవకాశం కల్పిస్తున్నారు. ఆధునిక సమాజంలో మారుతున్న ప్రజల అభిరుచులకు అనుగుణంగా, సంగ్రహాలయాల అభివృద్ధి కోసం డిజిటలీకరణపై అధికంగా దృష్టి సారిస్తూ, వర్చువల్ విధానంలో సందర్శనకు అవకాశాలు కలిగించడం తదితర నూతన ఆవిష్కరణలకూ అవకాశం కల్పించారు. జాతీయ డిజిటల్ రిపోజిటరీ ద్వారా అనేక ఇతివృత్తాలతో కూడిన కళాఖండాలను డిజిటల్ మాధ్యమంలోకి మార్చి విద్యార్థులు, ఉపాధ్యాయులు, పరిశోధకులు, పర్యాటకులకు జాతీయ పోర్టల్ ద్వారా అందిస్తున్నారు. ఇదే క్రమంలో వీలైనన్ని సంగ్రహాలయాలను డిజిటలీకరించి విద్యార్థులకు ప్రయోజనం కలిగేలా తీర్చిదిద్ది, పలురకాల అభ్యసన వనరులుగా పాఠశాల విద్యతో అనుసంధానించాలి. దీనివల్ల ప్రస్తుత కొవిడ్ సంక్షోభ సమయంలో విద్యార్థులకు విజ్ఞాన ఆధారిత వినోదాన్ని అందించడంతో పాటు మనోవికాసానికీ తోడ్పడినట్లవుతుంది. ఇలాంటి పద్ధతుల ద్వారా సంక్షోభంలో కూరుకుపోతున్న సంగ్రహాలయాలను సామాజిక మాధ్యమాల ద్వారా వర్చువల్ విధానంలో ప్రజల చెంతకు చేరవేసే కృషి ప్రస్తుతావసరం. అంతేకాదు, పశ్చిమ దేశాల తరహాలో ఇంటరాక్టివ్, మల్టీమీడియా పద్ధతులతో ప్రజలను ఆకట్టుకోవడం ద్వారా సంగ్రహాలయాలను సంరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉంది.

-సువేగా, m : 9030 6262 88
e: edit.deccan@gmail.com



నాణేలున్న కుండ, దాని మూత,
చిన్నారులు ఆడుకునే బండి చక్రం నమూనా

ఫణిగిరి బౌద్ధక్షేత్రం తవ్వకాల్లో బయల్పడిన

# కుండలో 3,730 సీసపు నాణేలు

## నగల ఆనవాళ్లు, ఆట వస్తువులూ లభ్యం
## ఇక్ష్వాకుల కాలం నాటివిగా గుర్తింపు

సూర్యాపేట జిల్లా నాగారం మండలం ఫణిగిరిలోని బౌద్ధక్షేత్రంలో జరిపిన తవ్వకాల్లో భారీ సంఖ్యలో పురాతన సీసపు నాణేలు బయల్పడ్డాయి. రాష్ట్ర చరిత్ర, వారసత్వ సంపదశాఖ డైరెక్టర్ భారతిహొూలికేరి, సూర్యాపేట అదనపు కలెక్టర్ బీఎస్ లతతో కలిసి రాష్ట్ర పురావస్తు శాఖ ముఖ్య కార్యదర్శి శైలజారామయ్యర్ వాటిని ఏప్రిల్4 పరిశీలించారు. మీడియా ఎదుట ప్రదర్శించిన అనంతరం శైలజారామయ్యర్ వివరాలు వెల్లడించారు. 'ఇటీవల బౌద్ధ క్షేత్రంలో తవ్వకాలు జరపగా ఓ కుండ బయల్పడింది. అందులో 3,730 సీసపు నాణేలు ఉన్నాయి. దానికి సమీపంలోనే గాజు నమూనాలు, స్త్రీలు ధరించే నగల ఆకృతులు, అప్పట్లో పిల్లలు ఆడుకునే బండి చక్రం వంటివి లభ్యమయ్యాయి. ఆ సీసపు నాణేలు ఇక్ష్వాకుల కాలం నాటివిగా గుర్తించాం. ఒకేచోట ఇంత పెద్ద మొత్తంలో నాణేలు దొరకడం దేశంలోనే మొదటిసారి. బౌద్ధ చరిత్రను వెలికితీడయంలో ఇది గొప్ప మైలురాయి వంటిది. ఈ పరిణామంతో ఫణిగిరి గ్రామం ప్రపంచ పటంలోకి ఎక్కినట్లయింది అని వెల్లడించారు. భారతి హొూలికేరి మాట్లాడుతూ, బౌద్ధక్షేత్రంలో నిజాం కాలంలోనే చారిత్రక ఆనవాళ్లనూ గుర్తించామని, ప్రపచంలోని అనేక దేశాల పర్యాటకుల దృష్టిని ఫణిగిరిపై పడిందని అన్నారు.


చరిగొండ గధేగల్ శాసనం


చరిగొండ ఖిల్లా ఆర్చులు


చరిగొండ ఖిల్లా కోటగోడలు

# చరిగొండ చరిత్ర

చరికొండ గ్రామము పాత మహబూబ్ నగరం జిల్లా, కల్వకుర్తి తాలుకా, ఆమనగల్ మండలంలో వుండేది. ఇప్పుడది రంగారెడ్డి జిల్లా, కడ్తాల మండలానికి మార్చబడ్డది. గ్రామానికి ఉత్తరంగా మేడిపల్లి నక్కేర్త, తూర్పున కొలుకులపల్లి, దక్షిణాన నాగిళ్ళ, పడమర ముదివెన్ను గ్రామాలున్నాయి.

చరికొండలో అడివి దాదాపు 5వేలఎకరాలలో విస్తరించి వుండేది. అడవిలో నీటివూటల కాలువలు, వూరి దగ్గర పారే కల్లెడ వాగు, గౌరమ్మ చెరువు చరికొండ నీటివనరులు. ఊరావల గుట్టల్లో నాగప్పచెరువు, పెరుమాండ్ల కుంట, కొత్తచెరువులు అదనపు నీటిసంపదలు. ఊరికి వ్యవసాయాధారాలు.

**చరిగొండసీమ ప్రశస్తి**

కవులకు పుట్టినిల్లు, బుధకాండము మెట్టినఇల్లు, అగ్రసం
భవులకు నల్లయిల్లు, పలువర్ణములున్ విలసిల్ల నిత్యమై
భవములపెల్లు, దుర్మతుల పాలిటి ముల్లు అనంగ జెల్లు, నుం
కువయయి శ్రీలకున్ 'చరియగొండ' సదా శుభవర్తి గావునన్

(దుందుభి పత్రికలో గుండూరు హనుమత్ శర్మగారు రాసిన కల్వకుర్తి సీమ ప్రశస్తి పద్యాన్ని చరియగొండ ప్రశస్తికనువుగా మార్చినందుకు మన్నింపుకోరుతూ...)

చరిగొండ చారిత్రకంగా, సాహిత్యపరంగా, రాజకీయపరంగా అన్నివిధాల బహుధా ప్రశంసలకు యోగ్యతగల పట్టణం. చరిగొండ ధర్మన్న చరిగొండకు ఖ్యాతితెచ్చిన గొప్పకవి ఈ వూరి వాడే.

గ్రామంలో ఉత్తరదిశలో రుక్మిణీ, సత్యభామా సమేత వేణుగోపాలస్వామి దేవాలయముంది. ఈ దేవాలయంలోని స్వామికి ప్రతిసంవత్సరం ఫాల్గుణమాసంలో బ్రహ్మోత్సవాలు జరుగుతాయి.

ఇంకా ఈ గ్రామంలో గ్రామదేవతలు దుర్గమ్మ, పోచమ్మ, కోటమైసమ్మలకు గుడులు వున్నాయి. దుర్గమ్మదేవత మహిమ కలదని, భయంకర స్వరూపిణి అని చెప్పుకుంటారు ప్రజలు. దుర్గమ్మ అష్టభుజి. చక్రం, త్రిశూలం, ఖడ్గం, శంఖం, విల్లు, గదలు ఆరుచేతులలో, మిగిలిన రెండు నిజహస్తాలు అభయ, వరదహస్తాలుగా ఉన్నాయి. మణిమయకిరీటం, సింహవాహనంపై దేవి సుఖాసనంలో ఆసీనురాలై వున్నది. కొత్త శిల్పం.

ఊరి సమీపంలోని పెరుమాండ్లకుంట దగ్గర శివాలయం ఉంది. అది శిథిలమైన గుడి. అక్కడొక తలలేని నంది పడివుంది. ఆ గుడికెదురుగా ఉన్న రాతిగుండు చెక్కి వున్న అర్ధశిల్పాలు చాలా విశేషమైనవి. అక్కడ కనిపించే మూడు శిల్పాలలో

1. మొదటి శిల్పం చతుర్భుజుడైన మూర్తి వెనక రెండు చేతుల్లో వంపుదిరిగిన దండాన్నెత్తుకుని, ముందు కుడిచేయిని లాస్యంగా వదిలి, ఎడమచేతిలో ఫలం ధరించివున్నాడు. పాదాలు నాట్యభంగిమలో వున్నాడు. శివగణంలోనివాడు.

2. మధ్యలో నాలుగు చేతులతో, మూడు కాళ్ళతో కనిపిస్తున్నది. శివుని ప్రమథగణంలోని ప్రముఖుడు భృంగి. నాట్యలోలుడు. పరమశివభక్తుడు. అర్ధనారీశ్వరునిలో పార్వతిని వదిలి శివునికొక్కనికే మొక్కి దేవతచేత శపించబడ్డవాడు.

3. మూడవ చివరి శిల్పం నందిది. నంది భృంగి నాట్యాని కనువుగా మృదంగం వాయిస్తున్నాడు.

ఇంతవరకు తెలంగాణాలో ఒకేచోట ఇటువంటి శిల్పాలు అగుపించలేదు. అక్కడికి కొంత దూరంలో ఒక రాతిగుండుకు 4 అర్ధశిల్పాలు చెక్కివున్నాయి. పరిశీలిస్తే 3గురు శైవమత గురువులు ఆసనస్థితిలో... అగుపిస్తున్నారు. చివర కాయోత్సర్గభంగిమలో జైన తీర్థంకరుని శిల్పం వుంది. 6,7 శతాబ్దాల నుంచి అతిశైవశాఖలైన కాలాముఖులు, కాపాలికులు, మాహేశ్వరులు, వీరవ్రతుల వంటివారు బౌద్ధ, జైన మత నిర్మాణాలు, గురువుల మీద దాడులు చేసేవారు. ఇక్కడ ఈ ముగ్గురు కాలాముఖగురువులు జైన గురువు మీద దాడిచేసిన సందర్భం అనిపిస్తున్నది.

ఆ పరిసరాల్లోని ఒకరాతిగుండుకు చెక్కిన చతుర్భుజ గణపతి. పొట్టమీద ఉదర(నాగ)బంధం. మూషికవాహనం. 9,10 శతాబ్దాల శిల్పశైలి. పెట్రోగ్లిఫ్ వంటి శిల్పం లోతులేని అర్ధశిల్పం.




లక్ష్మమ్మ గుడి



పహారీ



దర్గా



కృష్ణాపురం గుళ్లు

రాతిగుండుకే చెక్కిన విలుకాడు వీరుడు. పొడవైన జడతో కత్తి, డాలుతో కనిపిస్తున్నాడు. శైలిని బట్టి ఈ వీరగల్లు శిల్పం 17, 18 శతాబ్దాలకు చెందినది. గ్రామరక్షణకై ప్రాణత్యాగం చేసిన వీరుని యాదిలో వేసిన స్మారకవీరశిల.

గ్రామము చివర పాతకాలంనాటి మసీదు వుంది. అక్కడికి దగ్గరగా హజ్రత్ పీర్ గయిబ్షావలి దర్గాషరీఫ్ ఉన్నది. అక్కడక్కడ పాతకాలం కుతుబ్షాహీల కాలంనాటి ముస్లింసమాధుల మీద బొద్దురాళ్ళు పడివున్నాయి. సమాధులు వుండివుండాలి.

గ్రామానికి ఉత్తరదిశలో ఖిల్లాగుట్ట వుంది. గుట్టమీద కోట ఆనవాళ్ళున్నాయి. గుమ్మటాలు అని ప్రజలు పిలుచుకునే కట్టడాలు 4 మిగిలివున్నాయి. ఈ కోటను రేచెర్ల పద్మనాయకులు కట్టించారని చరిత్ర. రాచకొండను, దేవరకొండను పాలించిన పద్మనాయకులే చరిగొండలో కోటను నిర్మింపజేసారు.

ద్వారము నుంచి కోట లోపలికి ప్రవేశించగానే పెద్దబావి అగుపిస్తుంది. ఆ బాయి వొడ్డున నిలబడి రాయి విసిరితే అవతలి వొడ్డుకు పడదని స్థానికులు చెప్పుకుంటారు. అంత పెద్దబాయన్న మాట.

మరొకచోట ఒక బండకింద వున్న బావిని 'కన్నికల బావి' (కన్నెలబాయి?) అని పిలుస్తారు. ఆ బండ కిందకు కొందరు స్త్రీమూర్తుల శిల్పాలు చెక్కివున్నాయి.

కూలిన ఆర్చులతో శిథిలమైన నివాసాలజాడలు. భోగందాని మంటపంగా పిలువబడే కాపలా స్థానం. చాలాదూరం మిగిలివున్న రాతి కోటగోడ కనిపిస్తాయి.

పద్మనాయకరాజు తవ్వించిందే చరిగొండలోని గౌర సముద్రం. రేచెర్ల పద్మనాయక రాజయిన రెండవ లింగమనీడు శాలివాహన శకము 1349, ప్లవంగనామ సంవత్సర, మార్గశిర పౌర్ణమినాడు అనగా క్రీ.శ. 1427 డిసెంబర్ 4వ తేదీన లింగమనీడు భార్య గౌరీదేవి పేరున ఈ చెరువు నిర్మాణము చేయించెనని చరిగొండ శాసనమువల్ల తెలుస్తున్నది. అంతేగాక ఆమె శ్రీశైల మల్లిఖార్జున స్వామికి, తిరుపతి వెంకటేశ్వరస్వామికి కానుకలు అర్పించిందట. భక్తులకు ధర్మసత్రాలను కట్టించినదట.

చెరువుకట్ట మీద తొవ్వలో హనుమాండ్లు, తిరునామపీఠం చెక్కిన రాతిస్తంభం ఉంది.

దుర్గమ్మగుడి ముందు నుంచి పొయ్యే గౌరమ్మచెరువు కాలువ గ్రామాన్ని రెండుగా చేసింది. కాలువకు దక్షిణాన చరికొండ పట్టి పడకలు, ఉత్తరాన చరికొండ పట్టి కల్వకుర్తి. వెనుకటి తూర్పుకోట, పడమటికోట అని ఇద్దరు మక్తేదార్ల నివాసాలు శిథిలస్థితిలో వున్నాయి.

గౌరమ్మ చెరువు ఆవలి వొడ్డున పడమర దిక్కున ఒక దేవాలయమున్నది. వాటిని కృష్ణాపురము గుళ్ళు అంటారు. పెరుమాళ్ళకుంట శిథిల దేవాలయానికి వైష్ణవ ద్వారపాలకులున్నారు. ద్వారానికి లలాటబింబంగా గజలక్ష్మి. ద్వారానికి కుడిపక్కన పెద్ద భక్తాంజనేయుని విగ్రహముంది. అంతరాళ ద్వారానికి లలాటబింబం చతుర్భుజి లక్ష్మిదేవిని ఏనుగులు అభిషేకిస్తున్నాయి. సుఖాసనస్థితి. దేవాలయద్వారానికి రెండువైపుల కీర్తిముఖతోరణాలతో చతుర్భుజులైన వైష్ణవద్వారపాలకులు. లోపల మంటపస్తంభాలు కనిపిస్తున్నాయి. అక్కడి శిథిల దేవాలయ ద్వారానికి కూడా లలాటబింబం గజలక్ష్మియే. వైష్ణవ ద్వారపాలకులు.

త్రిభుజశీర్ష రాతిఫలకమ్మీద అర్ధశిల్పంగా చతుర్భుజుడైన వీరభద్రుని విగ్రహం అభంగ భంగిమలో అగుపిస్తున్నది. దక్షుడున్నాడు.

కోనాపురం నుండి చరికొండకు వచ్చే తొవ్వలో రాకాసిగుళ్ళు, రాక్షసుల బొందలు అని పిలువబడే మెగాలిథిక్ సమాధులున్నాయి.

చరిగొండ ధర్మన్న చిత్రభారత కావ్యం రాసిన కవి. చరిగొండ వాడే. వరంగల్ నేలిన షితాబుఖానను సీతాపతి వద్ద మంత్రిగా పనిచేసిన ఎనములూరి పెద్దనకు 8 ఆశ్వాసాల ప్రబంధ కావ్యాన్నంకితం చేసాడు చిత్రభారత కవి చరిగొండ ధర్మన్న. పెద్దన ధర్మపురికి చెందినవాడు. ధర్మన్న జీవితాకాలాన్ని ఆయన రచనలతో లెక్కించి క్రీ.శ. 1480 నుంచి 1530గా నిర్ణయించారు. ధర్మన్న "శతలేఖిన్యవధాన పద్యరచనా సంధాన సురత్రాణ చిహ్నితనామా, చరికొండ ధర్మసుకవీ" అని పిలువబడ్డాడు. చరిగొండ ధర్మన్న అవధానంలో ప్రవీణుడు. గంటకు వందపద్యాలు చెప్పగలవాడట.

మరొక ప్రతిభావంతుడైన కవి చరిగొండకే చెందిన హొన్నయ్య. ఈయన 17వ శతాబ్దంలో 'జ్యోతిష్యరత్నాకరం' రచించాడు. ప్రస్తుతమీ గ్రంథం లాస్ ఏంజెల్స్ గ్రంథాలయంలో



కాలాముఖ గురువులు, జైనుడు | శైవమూర్తులు | వైష్ణవ మూర్తులు | గణపతి | వీరభద్రుడు | వీరగల్లు | తిరుస్తంభం హనుమాన్

వుందని 'చరిగొండ చరిత్ర' రాస్తున్న యారీదా రాధాకృష్ణా రావు గారు చెప్పారు.

**చరిగొండ గధేగల్ శాసనం:**

చరిగొండ ఖిల్లా మీద బండరాయిపై కుతుబ్షాహీలకాలంనాటి ఒక శాసనఫలకం ఉంది.

**శాసనభాష:** తెలుగు శాసనలిపి: తెలుగు శాసనపంక్తులు: 12.

**శాసన సందర్భం:** దాన శాసనం.

**శాసన సమయం:** శక సం. 1418 నలనామ సం.ర ఆశ్వయుజ శుద్ధ దశమినాడు అనగా క్రీ.శ. 1496 సెప్టెంబర్ 17వ తేదీ శనివారం.

**శాసనకాల పరిపాలకుడు:** బీదర్ బహమనీసుల్తాను షాబుద్దీన్ మహమూద్ (1482-1518) పాలనలో తెలంగాణా గవర్నర్ కుతుబుల్ ముల్క్.

**దానగ్రహీత:** బొమ్మజియ్యవ తిపజియ్యవ బసవజయ్య.

**శాసనపాఠం:**

1. స్వస్తిశ్రీ శాక 1418 అగు నల సంవత్సర ఆశ్వజ
2. శుద్ధ 10గు నాడు ఖానె ఆజంమల్లూఖా నవొదయలుంగారి
3. మలుక శరఖు మలుక మింన్నాజయినుకారు పరమా వొదయలు
4. 0గారు చరికొండ్ల బొంమజియ్యవ తిపజియ్యవ బసవజయ్య గార్కి ఇ
5. చ్చిన శాసనపత్రము॥ హులిమఖలోను వలివేంద్రి చలిమల వె
6. స్వకాలం యెనిమిది నెల్లొని(క్మా)పొయను కట్టడిచేశి మీకు సిప్పా
7. హంజా నవొదయలుంగారు మాకు గవురసముద్రవెన
8. క ఖా.. పుట్టెడు వడ్లపొలం యిచ్చినారు. ఆ పొలంలోన మీ
9. కు వొరబూవుపొలం యిస్తిమి॥ ఖాన వొదయలుంగా
10. రు కారు పరమాయిచ్చన కవులు క్రమాననిని మున్ను ఇస్తిమి యె
11. యింద్దుకు యవ్వరు తప్పినాంను వాని ఆలి మింద గాడిది
12. ...యెక్కును మంగళ మహా శ్రీశ్రీశ్రీ

శాసనం కొసన స్త్రీపైన పడుతున్న గాడిద బొమ్మ చెక్కివుంది.

**శాసన సారాంశం:**

బీదర్ బహమనీ సుల్తాను షాబుద్దీన్ మహమూద్ (1482-1518) పాలనలో తెలంగాణా గవర్నర్గా కుతుబుల్ ముల్క్ వున్నపుడు రాజప్రతినిధి ఖాన్ ఆజం అలీఖాన్ మాలిక్ సరఖ్ మాలిక్ మిన్నా జైన్ పరమవొదయలుగారు చరికొండలోని బొమ్మజియ్య గారి బసవజయ్యకు వేసవికాలంతో పాటు 8నెలలు పంటసాగు చేసుకునే, పుట్టెడు వడ్లు పండే భూమిని గౌరసముద్రము వెనక యిచ్చాడు. ఇది కవులుగా యివ్వబడింది. ఇందుకు ఎవరు తప్పినా, శాసనం తప్పినవాని భార్యమీద గాడిద ఎక్కును అంటే వానిభార్య గాడిదచే భోగింపచేయబడునని శాసన శాపోక్తి చెప్పబడింది.

ఇటువంటి శాసనాలను 'గధే(గాడిద)గల్లు'లంటారు.

**గధేగల్లులు:** వీరగల్లు, సతిగల్లు, వీరశైవభక్తిగల్లు, జంతువీరగల్లులు చూసాం. కొందరికి మాత్రమే తెలిసిన కొత్తది 'గధే(గాడిద)గల్లు'. మహారాష్ట్ర (బరోడా, బీజాపూర్, తుల్జాపూర్), గోవా, గుజరాత్, బీహార్, తెలంగాణాలలో ఈ గాడిదగల్లులు కనిపిస్తున్నాయి. ఇవి ప్రధానంగా 11వ శతాబ్దం నుంచి కనిపిస్తున్నాయి. వాస్తవానికి ఇవి దానశాసనశిలలు. సాధారణంగా దానశాసనాలలో అంతిమంగా దానాన్ని తప్పినవారు పాపాన్ని మూటగట్టుకుంటారని హెచ్చరించే శాపోక్తుల శ్లోకాలుంటాయి. అటువంటి హెచ్చరికగా శాసనాల కింద స్త్రీతో గాడిద సంభోగ దృశ్యాలు చెక్కివుండడం 'గాడిదగల్లుల' ప్రత్యేకత. నాటి పాలకుల ఆజ్ఞ, అధికారం, శాసనాన్ని పాటించని, విధేయత చూపనివాడి తల్లిని లేదా వాడింటిలోని స్త్రీని గాడిదతో సంభోగింపచేసే శిక్ష వేస్తారని సూచించే శిలాఫలకం ఈ 'గధేగల్'. ఇది దారుణమైన శాసనం. Harshada Wirkud వంటి చరిత్రకారులు వీటిని (Ass-curse steles) అన్వేషించి బయటకు తీయించి పరిశోధనలు జరిపి పుస్తకంగా తెచ్చారు. ఇంకా కొంతమంది పరిశోధనలు చేసారు, చేస్తున్నారు కూడా.

పై శాసనం తరవాత వేయబడిన మహబూబునగర్ జిల్లా శాసనాల సంపుటిలో పేజి.నం.167, శాసనం సం. 70 కోయల కొండ శాసనంలోని 57,58 పంక్తులలో శాసనాన్ని తప్పిన వారు '... యిదిగాక తమ మానము గాడుదులకు యిచ్చిన....' అని వుండడం చేత ఆ శాసనం మరొక 'గధేగల్లు' శాసనంగా చెప్పవచ్చు.

ఈ శాసనంలో పేర్కొనబడిన గౌరసముద్రం ప్రస్తావన మహబూబునగర్ జిల్లా శాసనాల సంపుటిలో పేజి.నం.105, శాసనం సం. 34 చరికొండశాసనం, చరికొండలో గతంలో చదివి, పరిష్కరించబడిన శాసనం రేచెర్ల పాలకులు 2వలింగమనేడు పాలనా కాలంలో క్రీ.శ. 1427 సం.లో వేయబడినది. తెలుగులిపి, సంస్కృత భాషలలో వున్నది. లింగమనేడు భార్య గౌరి తనపేర చరికొండలో ఒక చెరువును తవ్వించింది. ఆ చెరువు ఇప్పుడు ఆమె పేరుతో 'గౌరసముద్రమ'నే పిలువబడుతున్నది.

**ధన్యవాదాలు:** ఫోటోలు, చారిత్రక వివరాలు: వై.రాధాకృష్ణారావు, చరిగొండ చరిత్ర రచయిత.

- శ్రీరామోజు హరగోపాల్,
m : 99494 98698
e: akshara25@gmail.com

# బి.పి. మండల్

## (బిందేశ్వరి ప్రసాద్ మండల్)

బీహార్‌లోని బనారస్‌లోని ఒక యాదవ్ కుటుంబంలో 1918 ఆగస్టు 25న జన్మించాడు. మాధేపురా జిల్లాలోని మోరో గ్రామంలో పెరిగాడు. మండేపురంలో మండల్ తన ప్రాథమిక విద్యని, దర్భాంగాలో ఉన్నత పాఠశాల విద్యని, 1930లలో పాట్నా కాలేజీలో ఇంటర్మీడియేట్ పూర్తి చేసిండు. ఆ తరువాత పై చదువులకై అతను ప్రెసిడెన్సీ కళాశాల కలకత్తాలో చేరిండు. దురదృష్టవశాత్తు, ఇంట్లో కొన్ని అనివార్యమైన పరిస్థితుల కారణంగా, అతను తన చదువుని విడిచిపెట్టవలసి వచ్చింది.




మండల్ తన 23వ యేటా జిల్లా కౌన్సిల్‌కి ఎన్నికయ్యాడు. 1952లో మొదటిసారి బీహార్ అసెంబ్లీకి శాసనసభ్యునిగా ఎన్నికయ్యాడు.

1967లో జరిగిన ఎన్నికలలో ఎస్.ఎస్.పి అభ్యర్థుల ఎంపికపై ఆయన చేసిన కృషి అద్భుతం. ఆయన ప్రచారం వల్ల 1962లో కేవలం 7 సీట్లు కల ఆ పార్టీకి 1967లో 69 సీట్లు వచ్చాయి. బీహార్లో మొట్టమొదటి కాంగ్రెస్ యేతర ప్రభుత్వం ఏర్పడింది. 1968 ఫిబ్రవరి 1న అతను బీహార్ రాష్ట్ర రెండవ బీసీ ముఖ్యమంత్రిగా పదవీ భాద్యతలు స్వీకరించాడు.

1974లో శాసన సభ సభ్యత్వానికి రాజీనామా చేసి జయప్రకాష్ నారాయణ నేతృత్వములో నడుస్తున్న అవినీతి వ్యతిరేక ఉద్యమములో పాల్గొన్నాడు. 1977లో జనతా పార్టీ తరపున లోక్ సభకి ఎన్నికై 1979 వరకు కొనసాగాడు. ఎమర్జెన్సీ తర్వాత ఏర్పాటైన జనతా ప్రభుత్వం ఇందిరా గాంధీని డిబార్ చేయాలని అధికార పార్టీ సభ్యులు తెచ్చిన తీర్మానాన్ని మండల్ వ్యతిరేకించాడు. మండల్ తన రాజకీయ జీవితంలో సోషలిస్ట్ రాజకీయాల ఆలోచనపరుడిగా పని చేసాడు.

బిపి మండల్ చైర్మన్‌గా ఐదుగురు సభ్యుల పౌరహక్కుల కమిషన్‌ను డిసెంబర్ 1978లో, ప్రధాన మంత్రి మొరార్జీ దేశాయ్ నియమించారు. అణగారిన తరగతులకు మండల్ యొక్క దీర్ఘకాల మద్దతు ఫలితంగా ఈ కమిషన్ ఏర్పడింది, దీనిని "మండల్ కమిషన్" లేదా "వెనుకబడిన తరగతుల కమిషన్" అని పిలుస్తారు.

కమిషన్ నివేదిక 1980లో పూర్తయింది. అన్ని ప్రభుత్వ మరియు విద్యా స్థలాలలో గణనీయమైన భాగాన్ని ఇతర వెనుకబడిన తరగతులు, సామాజికంగా వెనుకబడిన వర్గాల అభ్యర్థులకు కేటాయించాలని మండల్ కమిషన్ సిఫార్సు చేసింది. కమిషన్ నివేదికను ప్రధాని ఇందిరా గాంధీ నిరవధికంగా ప్రవేశపెట్టారు. ఒక దశాబ్దం తరువాత, ప్రధాన మంత్రి VP సింగ్ మండల్ నివేదిక యొక్క సిఫార్సులను అమలు చేశారు. ఇది 1993లో అమలులోకి వచ్చింది.

మండల్ కమీషన్‌ను అనేక అగ్రవర్ణ సంఘాలు వ్యతిరేకించాయి. బిసి రిజర్వేషన్ వ్యతిరేకులు, దేశవ్యాప్తంగా నిరసనలు మరియు ఆందోళనలకు దిగి విధ్వంసం సృష్టించారు.


బిపి మండల్ 1982 ఏప్రిల్ 13న మరణించాడు. అతని భార్య సీతా మండల్. వారికి ఐదుగురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. భారత ప్రభుత్వం 2001లో బి పి మండల్ గౌరవార్థం ఒక పోస్టల్ స్టాంపును విడుదలచేసింది.

– దక్కన్‌న్యూస్
m : 9030 6262 88
e: desk.deccan@gmail.com

JBR
ARCHITECTURE COLLEGE
HYDERABAD
(Approved by Council of Architecture, New Delhi - Affiliated to JNA&FAU Hyderabad)
E-mail : jbrarchitecture@jbgroup.org.in, www.jbrachitecture.com

# స్వేచ్ఛా విహంగులం! అయినా, అనునిత్యం ప్రాణసంకటం!!

గోడలపై పులి చర్మాలు, ద్వారాల పైభాగంలో దుప్పుల కొమ్ములు, మెడలో పులిగోళ్ళు, తలపైన అందమైన పక్షి ఈకలతో చేసిన టోపీలు ఉన్నత వర్గాల దర్పానికి చిహ్నం! ఇలాంటి ప్రతీకల్ని సినిమాల్లో చూస్తూ వుంటాం! పాశ్చాత్య దేశాల్లో రాణులు, మహా రాణులు, రాజులు, యోధులు పక్షుల ఈకలతో చేసిన అలంకరణ ఆహార్యాలతో కనిపిస్తూ వుంటారు. పక్షి ఈకల రకాల్ని బట్టి వారివారి హోదా ఎగిసిపడేది. ఇప్పటికి ఈ విధానం లాటిన్ అమెరికా, ఆఫ్రికా దేశాల్లోని వివిధ గిరిజన తెగలల్లో కనిపిస్తాయి. గోండులు గుస్సాడి నృత్యంలో నెమలి ఈకలతో చేసిన అలంకరణలు వాడేది మనకు తెలిసిందే! ఇతిహాస కృష్ణుడు తలలో నిరంతరం నెమలి పింఛాన్ని (ఈక) ధరించడం గుర్తెరిగిందే!




**మాదో వైవిధ్యభరిత జాతి:**

మీ మానవుల అంచనాల ప్రకారమే ప్రపంచ వ్యాపితంగా సుమారు పదివేల రకాలకు పైగా పక్షుల జాతులున్నట్లుగా అంచనా! (ఇంతకు రెండింతలని అంటారు) ఇందులో భారత్‌లో సుమారు 1400 రకాలున్నాయంటున్నారు. పోతే, ఇతర జంతువుల లాగా మా పక్షిజాతిని అంచనా వేయడం కష్టమే! కారణం, మేం వుండే విభిన్న ఆవాసప్రాంతాలు. చిటారు చెట్ల కొమ్మల్లో, నీళ్ళల్లోకి దూకి, ఇసుక బొరియల్లో దాక్కొని, చిత్తడి నేలల్లో, ఏపుగా పెరిగిన గడ్డి ప్రాంతాల్లో అంటే, నింగి, నేల, నీరు మా ఆవాసాలే అయినా, అంత సులువుగా మేం దొరకం. చిన్న అలికిడి విన్నా తుర్రున లేచి ఎగిరిపోవడం మా భయానికి కారణం. మా జీవన గమనాలు, నిర్మించుకునే గూళు ఒక్కో జాతిది ఒక్కోరకం. మా గూళ్లను బట్టి, ఎగిరే విధానాన్ని బట్టి, ఆకాశంలో మా గుంపుపోతున్న అమరికను బట్టి మేం ఏ జాతో మీరు అట్టే గుర్తు పడుతారు. మా పక్షి జాతులకున్న విశిష్టలక్షణాల్లో మా కూతలు, అరుపులు, శబ్దాలు వుంటాయి. ఒక్కో జాతి పక్షి ఒక్కో వైవిధ్యభరిత శబ్దాన్ని కల్గిస్తాయి.

అందుకే ఆబాలగోపాలం, మమ్మల్ని చూసి ఆనందిస్తువుంటారు. కాని, ఆ ఆనందం వెనుక అత్యధిక మానవులది కపట ప్రేమని తెలిసినా మేమేమి చేయని నిస్సాహాయులం! జంతువుల్ని ఇష్టపడని వారు వుంటే వుండవచ్చు! కాని, పక్షుల్ని ఇష్టపడని వారు బహుషా వెతికినా కానరారు. పల్లెల్లో, పట్టణాల్లో, చెట్లతోపుల్లో, ఉద్యానవనాల్లో, గడ్డిభూముల్లో, పంట చేళ్లల్లో మా కిలారావములు అనునిత్యం వింటున్నదే! ఉదయాన్నే నిద్రలేపే కాకి, మీ ఇంటి చూరుల్లో ఎగురుతూ కిచకిచలాడే పిచ్చుక, వచ్చిరాని మాటల్ని పలికే రామచిలుక, వసంతగానం చేసే కోకిల, ఇంటి పెరట్లో నడయాడే కోళ్లు, వెనక తిరుగాడే బాతులు, మేఘ గర్జనకు పురివిప్పి ఆడే నెమలి. ఇలా ఎన్నింటి గూర్చి చెప్పినా తక్కువే! అయితే ఇవన్నీ ఒకనాటి మధుర జ్ఞాపకాలు. నేటి తరానికి ఇవి ఊహకు కూడా అందని కథలు. మా పక్షి జాతులకు మీరేమి నేర్పారో తెలియదు గాని, మా నుంచి మీరే ఎన్నో సంగతుల్ని నేర్చుకున్నారు. మీరు కట్టుకునే నివాసాలకు ఇంజనీర్లం మేమే! గగనయానంలో పయనించే గాలిమోటర్ల నిర్మాణం, మా ఎగిరే కళతోనే కదా! నీటిలోకి దూకే (dive) మా నైపుణ్యాన్ని పసిగట్టి, మీరు సముద్రలోతుల్ని తడుముతున్నారు. అంటే, మీ మానవుల నైపుణ్యతలకు మేమే హక్కుదారులం. పేటెంట్లం! అంతెందుకు, మా పలుకులు, శబ్దాలు, కూతలు మీకు మాటల్ని, భాషని నేర్పాయంటే మీరు ఒప్పుకుంటారా?

**మా అందమైన ఈకలే మాకు ఉరితాళ్లు!**

ఇలాంటి వైవిధ్యభరిత జాతి నేడు ఏ పరిస్థితుల్లో వుందో, రోజురోజుకు మా విభిన్న జాతి పక్షులు ఎలా చివరి శ్వాసను విడుస్తున్నాయో మీరు గ్రహించండి మీ వక్రబుద్ధిని పోనిచ్చుకోకుండా, యమధర్మరాజుకే నీతులు బోధించే రకం కదా!

ఈ సందర్భంగా కొన్ని సంఘటనల్ని మీ దృష్టికి తెస్తున్నాం. నిజానికి మా పక్షిజాతి అంతం పారిశ్రామిక విప్లవం తర్వాతనే వేగవంతం అయినా, మానవ జనాభా పెరుగుతున్న కొద్ది, స్థిరనివాసం ఏర్పర్చుకొని, వ్యవసాయం వృత్తిగా మారినప్పటి నుంచే, మాపై వేట ఎక్కువైంది. విద్యుత్ కేంద్రాలు స్థాపన, ఉత్పాదక ఫ్యాక్టరీలు, ప్రాజెక్టుల నిర్మాణం ఊపందుకున్నప్పటి నుంచి మా మృత్యుగడియలు కూడా ప్రారంభ మయ్యాయి. మాంచెస్టర్ మెట్రోపాలిటన్ విశ్వవిద్యాలయ పక్షుల పరిశీల కుడైన (Ornithologist) అలెగ్జాండర్ లీస్ (Alexander Lees) ప్రకారం క్రీ.శ 1500సం॥ నుంచే మా క్షీణదశ ప్రారంభం కాగా, ఇప్పటికి సుమారు 187 పక్షుల జాతులు మన ఊహల్లో కూడా లేకుండా పోయాయి. భారత్‌కు చెందిన జయశ్రీ నంది లెక్కల ప్రకారం భారత్‌లో గత అయిదు సంవత్సరాలల్లోనే సుమారు 146 పక్షిజాతులు కానరాకుండా పోయాయి. అంటే, అయిదు వందల సంవత్సరాలలో జరిగిన పక్షుల విధ్వంసం గత ఐదేళ్లలోనే జరిగిందన్న మాట!

మా పక్షులు ఏయే కాలాల్లో, ఎలా అంతం అయ్యోయో చూడండి! బ్రిటన్ గణాంకల ప్రకారమే 1875లో సుమారు 14,500 కి.గ్రా. ఉష్ట్రపక్షి ఈకలు ఆఫ్రికా నుంచి యూరప్‌కు దిగుమతి అయ్యాయి.

## పక్షులల్లో పక్షులు వేరయా..!!

- ఉత్తరాల ద్వారా రాయభారం నడిపే పక్షి - పావురం
- మనలాగా మాట్లాడే పక్షి - రామచిలుక
- పక్షులరాణి - నెమలి (మగ)
- ఆకాశపురాణి - బంగారు డేగ (గద్ద)
- పక్షిరాజు - డేగ
- అతిపెద్ద పక్షి - ఉష్ట్రపక్షి
- అతి చిన్న పక్షి - హమ్మింగ్ పక్షి (1.6-3 గ్రాములు)
- ఎగరలేని పక్షులు - ఉష్ట్ర, ఎమున్, కాస్సోవారిస్, రెహాస్, కివి, పెంగ్విన్
- ప్రేమ పక్షులు - పావురాలు (doves)
- రొమాంటిక్ పక్షులు - లవ్‌బర్డ్స్
- అతి వేగంగా పయనించేది - పెరిగ్రైన్ ఫాల్కన్ (Peregrine falcon) (320 kmph)
- అతి పెద్ద పక్షిగుడ్డు - ఉష్ట్ర
- అందమైన గూళ్ళు నిర్మించేవి - పిచ్చుకజాతి పక్షులు
- అత్యధికంగా ఆక్సిజన్‌ను గ్రహించి, జీవక్రియల్ని జరుపుకునే పక్షి - హమ్మింగ్ (ప్రతికణం మానవుడి కన్నా పదిరెట్లు ఆక్సిజన్‌ను గ్రహించును)
- అత్యధికంగా గుండె కొట్టుకునే పక్షి - హమ్మింగ్ (నిమిషానికి 1200 సార్లు)
- వెనక్కి కూడా ఎగిరగలిగే పక్షి - హమ్మింగ్
- అత్యధిక వేగంతో డైవింగ్ చేసే పక్షి - హమ్మింగ్ (సెకనుకు 27.3 మీటర్లు)
- అత్యధికంగా రెక్కల్ని ఆడించే పక్షి - హమ్మింగ్ (సెకనుకు 3 సార్లు)

సాధారణంగా పక్షుల మాంసం అనేక రోగాలకు పనిచేస్తాయనే నమ్మకం మానవులది. అందులో కావల్సినంత మాంసకృత్తులుండడం కూడా ఓ కారణం! అయినా, మాంసానికే కాక, కేవలం ఈకల్నే యూరప్ దిగుమతి చేసుకోవడానికి కారణం, వాటితో అందమైన అలంకరణ సామాగ్రిని, టోపీలను, బుట్టల్ని, బ్యాగుల్ని తయారు చేసి వ్యాపారం చేసుకుకోవడమే! అయితే, యూరప్ ఈకలచే వ్యాపారం చేసుకుంటే, ఆఫ్రికన్లు మమ్మల్ని చంపి ఈకలు అమ్ముకొని మాంసాన్ని స్థానికంగా వినియోగించుకున్నారు.



ఆల్బాట్రోస్

ప్రపంచ పక్షిజాతుల్లో అతి చిన్న పక్షిజాతిగా గుర్తించబడ్డ హమ్మింగ్ పక్షి (Humming) ఓ అందాల రాసి. 20వ శతాబ్దం మొదటి భాగంలో సుమారు నాలుగు లక్షల హమ్మింగ్ పక్షుల చర్మాల్ని లండన్ దిగుమతి చేసుకున్నది. అలాగే 50వేల పారడైస్ పక్షుల్ని (Paradise) పోలోనేసియా నుంచి లండన్‌కు బంధించి పంపించారు.

### ఆల్బాట్రోస్ (Albatross):

సుమారు మూడున్నర మీటర్ల రెక్కల పొడవుతో, సముద్ర ప్రాంతాలలో నైపుణ్యంతో ఎగిరే ఈ పక్షి చూడడానికి బాతులా కనిపిస్తుంది. సముద్ర గగనతలంలో తుఫానులకు, ఉప్పెనలకు కూడా నెరవని ఈ పక్షి సంతానోత్పత్తి సమయంలో తీరంలోని ఇసుక తిన్నెలపై నివాసం వుండి, గుడ్లు పెట్టి పొదుగేదాకా కదలదు. ఆ సమయంలో శక్తిలేక, రెక్కల్లో కొవ్వుశాతం పెరిగి నిస్సాహాయంగా వుంటుంది. దీన్ని అదనుగా భావించిన వేటగాళ్ళు కర్రలతో, శూలాలతో దాడి చేసి చంపి మాంసాన్ని, ఈకల్ని వ్యాపారం చేసుకుంటారు. 1887-1903 మధ్య కాలంలో పసిఫిక్ తీరప్రాంతంలోనే ఈ పక్షులు సుమారు 17 మిలియన్లు చంపబడగా, చివరి పక్షి రెండో ప్రపంచ యుద్ధ ప్రారంభానికి ముందు కనుమరుగై పోయింది.



లాబ్రాడార్

### నారాయణ పక్షి (White Heronx)

కొంగలుగా గుర్తించబడే ఈ పక్షులు వివిధ రంగుల్లో వుంటాయి. దాదాపు నీటి ఆవాస ప్రాంతాల్లో ప్రపంచమంతా అగుపించే ఈ పక్షుల ఈకల్ని పీకి వ్యాపారం చేసుకుంటారు. కొంతమేర మాంసాన్ని కూడా వినియోగిస్తారు. అయితే, వేటకాడు వలల్ని పెట్టినప్పుడు వందల సంఖ్యల్లో ఇవి చిక్కుకుంటాయి. చిక్కినవాటిని చంపి, ఈకల్ని పీకి అవసరం వున్నంతకు ఎగుమతి చేయడం, చంపబడ్డ మిగతా పక్షుల్ని అలాగే పారవేయడం జరుగుతుంది. ఒక్క వెనిజులా నుంచే ప్రతి సంవత్సరం రెండు మిలియన్ల తెల్లరకం నారాయణ పక్షుల్ని చంపి ఎగుమతి చేస్తున్నారంటే, మీరు నమ్ముతారా?

### కార్మోరెంట్ (Cormorant-షాగ్) పక్షి

కొంగలకు, బాతులకు మధ్యస్థంగా వుండే ఈ రకం పక్షులు ఎక్కువ దూరాల్ని ఎగురలేవు. వీటిపై పరిశోధనలు చేసిన జార్జి స్టెల్లర్, చివరి పక్షి 1850లోనే కనుమరుగైనట్లు గుర్తించాడు. చిన్న రెక్కలు కలిగిన ఈ జాతి పక్షులు మంచి ఈత గాళ్లు. ఎగరడానికి కన్నా, ఈదడానికి తక్కువ శక్తిని ఉపయోగించే ఈ పక్షులు భారత ఉపఖండంలో, తూర్పు ఆసియా దేశాల్లోని సరస్సు ప్రాంతాల్లో ఇంకా ఉనికిలో వున్నాయి. ఇవి కూడా త్వరలో అంతరించిపోయే దశకు చేరుకున్నట్లు కథనాలు.


### లాబ్రాడార్ పక్షి (Labrador)

బాతుల జాతికి చెందిన ఈ పక్షులు ఉత్తరార్ధ గోళంలో ఒకప్పుడు కనువిందు చేసేవి. నలుపు, తెలుపు రంగుల్లో, ఎరుపు పసుపు రంగు ముక్కులతో వుండే ఈ పక్షులు నీటి మడుగుల్లోని చేపల్ని తిని జీవించేవి. రాను, రాను నీటి ఆవాసాలు దెబ్బతినడంతో విపరీతమైన ఆహార కొరత ఏర్పడి, ఇవి చివరి దశకు చేరుకున్నాయి. అలాగే వీటి మాంసం రుచికరంగా వుండడంచే, చాలా ప్రాంతాల ప్రజలు వేటాడి చంపడం జరుగుతున్నది. కొన్ని బాతుల ఈకల్ని దుస్తుల్లాగా నడుముకు కట్టుకోవడం కోసం కూడా వీటిని వేటాడడానికి కూడా కారణం. చివరి పక్షి 1878లో కనిపించినట్లుగా కథనాలు.


### పెట్రెల్ (Petrel) పక్షి :

తుఫానులను కూడా తట్టుకొని సముద్రతలాలపై ఎగిరే ఈ పక్షుల తల నల్లని టోపిలా కలిగి వుంటాయి. వీటి పాదాలు నీటిపై


ఉష్ట్రపక్షి


హమ్మింగ్ బర్డ్


డేగ


రాబందు

నడవడానికి అనుకూలంగా వుంటాయి కాబట్టి, పెటర్ అనే బైబిల్ పదంతో వీటిని పెట్రెల్ అని పిలుస్తారు. ఇందులో కొన్ని రకాల పక్షులు అంతరించిపోగా, కొన్ని దక్షిణార్ధ గోళంలో అక్కడక్కడా ఉనికిలో వున్నాయి. ఇవి కూడా సంతానోత్పత్తి దశలో ఎగరలేకుండా వుండడంతో, వేటగాళ్ళు శూలాలతో చంపి, మాంసాన్ని తినడం ఈకల్ని ఎగుమతి చేయడం, జరుగుతుంది. పోతే, చంపబడ్డ పక్షుల మాంసాన్ని మొత్తంగా వాడకున్నా, వాటి ఈకల్ని పీకి సొమ్ము చేసుకోవడం మామూలైంది. మిగిలిన చివరి పక్షులు కూడా అంతరించే దశకు చేరుకున్నాయి.

**ఆక్ (Auk) పక్షి :**

వీటిని ఆల్సిడ్ అనికూడా అంటారు. అతి చిన్న రెక్కలుండడంతో ఇవి ఉష్ట్రపక్షిలా ఎగరలేవు. నల్లని మెడ, తెల్లని శరీరంతో బాతుల్లాంటి తలతో వుండే ఈ పక్షుల పొడవు 75 సెం.మీ. వరకు వుంటుంది. కాని, ఇవి మంచి డైవర్స్. సుమారు 180 సం॥ క్రితమే 3-7-1844న ఆక్ పక్షి చివరిశ్వాస తీసుకున్నట్లుగా రికార్డులున్నాయి. వీటి ఆచూకిని తెలిపిన వారికి నజరానాల్ని ప్రకటించినా ఫలితం లేకుండా పోయింది. 19వ శతాబ్దం ప్రారంభంలోనే నావికులు వీటిని వేటాడి అంతమొందించారు. ఒకప్పుడు ఆర్కిటిక్ ప్రాంతానికి అలంకరణగా అగుపించే ఈ జాతి అంతరించడంతో ఇప్పుడు ఈ ప్రాంతం బోసిపోయింది.

**ప్రయాణికుల పావురం (Passenger Pigeon):**

ఉత్తర అమెరికాకు చెందిన ఈ రకం పావురాలు అంతరించి పోయాయి. వీటి వలస లక్షణాలతో ఈ పేరు వచ్చినట్లుగా చెపుతారు. మన ప్రాంతాల్లో కనపడే పావురాలు, ఈ పావురాలు ఒకటి కాదు. పాసింజర్ పావురాలు పెద్ద ఆకారాన్ని కలిగి అటవికే పరిమితంగా వుండేవి. 20వ శతాబ్దం ప్రారంభంలో బిలియన్ల సంఖ్యలో వున్న ఈ పక్షులు, 1909 నాటికే కనుమరుగైనట్లు రికార్డులు తెలుపుతున్నాయి. వీటి ఆచూకి గాని, నిర్మించుకున్న గూళ్ళనుగాని గుర్తించి తెలిపిన వారికి ఆయా ప్రభుత్వాలు బహుమతుల్ని కూడా ప్రకటించినా ఎలాంటి ఆచూకి లేకుండా పోయింది. ఒక్క మిచిగాన్ రాష్ట్రంలోనే 1.5 మిలియన్ల పావురాలకు పైగా చంపబడ్డాయి. చివరికి సిన్సినాటి జూలో గల ఏకైక పాసింజర్ పావురం సెప్టెంబర్ 1, 1914లో కన్నుమూసింది.

ఈ పక్షులవేట తెల్లవాళ్ళు అమెరికాను ఆక్రమించుకున్న తర్వాతనే అధికమయ్యాయి. ఒకప్పుడు స్థానికులు ఆహారం కోసం వారి అవసరానికి తగ్గట్లుగానే వీటిని చంపేవారు. ముఖ్యంగా అవి సంతానోత్పత్తి జరిపే సమయంలో వాటి జోలికి పోకపోగా, ఏనాడు వాటి పిల్లల్ని స్థానికులు ముట్టుకునే వారు కాదు. కాని నాగరిక

**నెమలి సంపర్కంపై అపోహలు :**



నెమళ్ళు ఇతర జంతువుల్లా సంపర్కం జరపవని, మగనెమలి, ఆడనెమల్ని తన నాట్యంతో ఆకర్శించి, కంటి ద్వార కన్నీటిని స్రవిస్తే, ఆడ నెమలి (Peahen) తాగి గర్భం దాలుస్తుందనేది ఓ అపోహ మాత్రమే. ఇతర పక్షుల్లా ఇవి కూడా వాటి జీర్ణవాహిక చివరి భాగంలో గల మర్మావయవాలతో (cloaca) సంపర్కం జరుపుకుంటాయి.

ప్రపంచమే ఈ పక్షులకు మరణశాసనాన్ని ప్రకటించింది.

**ఎన్నింటికో మేమే మీ ప్రతీకలం!**

మయూరి నాట్యం, హంస నడక, కోయిల కూత, కాకి అరుపు, గుడ్లగూబ (చూపు), కిచకిచలు (ముచ్చట్లు) ఇలా మా పక్షుల గుణగణాల్ని మీ మానవులు వాడి మమ్మల్ని, మా ఔన్నత్యాన్ని చాటుకుంటారు. మీ విష్ణుశర్మ రాసిన పంచతంత్ర కథల్లో అన్నీ జంతువులే! కాని, అన్ని పాత్రల్లో మమ్మల్ని విష్ణుశర్మ స్నేహశీలురుగా అభివర్ణించాడు. చివరికి వాల్మీకి రామాయణ గాథలో, ఓ స్త్రీని (సీత) రక్షించడానికి ప్రయత్నం చేసింది కూడా మా జాతే కదా!

ఇలాంటి ఉన్నతమైన మా పక్షిజాతుల్ని, మీ మానవులు మీ అవసరాలకు మించి, విచ్చలవిడిగా మారణకాండ సాగిస్తూ మమ్మల్ని అంతమొందిస్తున్నారు. మా ఉపయోగాలు పర్యావరణానికే కాదు, మీ మానవ సమాజానికి ఎంత మేలో గత చరిత్రను తిరగేయండి. రాజుల కాలంలో మేం వార్తాహరులం. ప్రేమికుల మధ్యన రాయభారం నడిపే సందేశకులం. ఇలా ఎన్ని చెప్పినా మా గూర్చి తక్కువనే! ఇక వ్యవసాయ రంగలో, మీ ఆహార పంటలకు మేం ఎలాంటి సేవ చేస్తామో తర్వాతి కథనంలో చూద్దాం! ఇంతగా ఉపయోగపడే మా జాతులు రోజురోజుకు వేలల్లో, లక్షలల్లో అంతమైతున్నాయి. మా చివరి గడియల తర్వాతనే మీరు మా రక్షణకై పూనుకుంటున్నారు. ఇదైనా నిజాయితీతో కాదు కదా!

వాస్తవం చెప్పాలంటే, మా మనుగడే మీ మనుగడని గుర్తించండి!

**(వచ్చే సంచికలో మరిన్ని వివరాల్ని చూద్దాం!)**

– డా॥ లచ్చయ్య గాండ్ల,
m : 9440116162
e : drglachaiah@gmail.com

# త్యాగానికి చిరునామా అమ్మ

## మే 12 మాతృ దినోత్సవం

కని పెంచిన తల్లి గొప్పతనాన్ని గుర్తుతెచ్చుకోవడం కోసం ప్రతి సంవత్సరం మే నెలలోని రెండవ ఆదివారం (ఎక్కువ దేశాలలో) నాడు జరుపుకుంటారు. 'మదర్ ఆఫ్ గాడ్స్'గా పిలువబడుతున్న రియా దేవతకు నివాళి అర్పించే నేపథ్యంలో ఈ ఉత్సవాన్ని మొదటిసారిగా గ్రీస్ దేశంలో నిర్వహించారు.

తల్లిదండ్రులను దైవాలుగా భావిస్తూ ఆదరించే సంప్రదాయం భారతదేశంలో ఉంది. పాశ్చాత్య దేశాలలో పిల్లలు ఎదగగానే తల్లిదండ్రులను వదిలిపెట్టి స్వతంత్రంగా జీవించడం ప్రారంభిస్తారు. అలాంటి సందర్భంలో అమ్మను రోజూ చూసుకునే పరిస్థితులు లేకపోవడంతో, అమ్మకోసం ఒక్కరోజును కేటాయించి చాలని మాతృ దినోత్సవంను ఏర్పాటుచేశారు.



అమ్మ అంటే ఇష్టం ఉండని వాళ్లు ఉండరు. ప్రతి ఒక్కరికి కూడా కన్న తల్లి అంటే ఎంతో ప్రేమ ఉంటుంది. అమృతం ఎలా ఉంటుందో తెలియదు. కానీ అమ్మ ప్రేమ ముందు అది ఎంతో తక్కువ. నిజంగా బ్రహ్మ సృష్టించిన వాటిలో అమ్మను మించిన అపురూపం ఇంకేమీ లేదు. నిజానికి బ్రహ్మను సృష్టించ లేదు అమ్మే బ్రహ్మని సృష్టించింది. అమ్మ గొప్పతనం వర్ణించలేము. అందుకే అమ్మకి ఒకరోజు అంకితం చేశారు.. అసలు ఈ మదర్స్ డే వెనుక కథ ఏంటి..

అమ్మ ప్రేమను వివరించలేము. త్యాగానికి చిరునామా అమ్మ. కనిపించే దైవం అమ్మ. అంతులేని ప్రేమానురాగాలకు ఆప్యాయతలకు తల్లి ఎవరికైనా ప్రత్యక్ష దైవం అని చెప్పొచ్చు. నవమాసాలు మోసి కష్ట పడి అమ్మ జన్మనివ్వడం ఒక ఎత్తయితే... రెక్కలు ముక్కలు చేసుకుని సరైన దారిలో పెట్టి ఎంతో కష్ట పడేది అమ్మ. ఇలా మీరు ఈ స్థాయిలో ఉండడానికి కారకురాలైన అమ్మని ఎంత ప్రేమగా చూసుకున్నా తక్కువే అవుతుంది.

ప్రతి ఒక్కరు కూడా కన్న తల్లిని గౌరవించాలి. ప్రతి రోజూ అమ్మని ప్రేమించాలి. అమ్మ చేసిన త్యాగాన్ని గుర్తించాలి. ప్రపంచంలోనే అతి పేద వాడు ధనం లేని వాడు కాదు అమ్మ ప్రేమ లేని వాడే ప్రపంచంలో అతి పేద వాడు. ఇక మదర్స్ డే గురించి చూస్తే... ప్రతి సంవత్సరం మే రెండవ ఆదివారం నాడు ప్రపంచ మాతృ దినోత్సవాన్ని జరుపుకుంటూ వస్తున్నాము. నిజానికి మదర్స్ డే వెనుక ఎంతో పెద్ద చరిత్ర ఉంది. గ్రీస్‌లో రియా అనే ఒక దేవతను మదర్ ఆఫ్ ద గాడ్స్‌గా భావించి ప్రతి ఏడాదికి ఒక సారి నివాళులర్పించే వారు.

17వ శతాబ్దంలో అయితే ఇంగ్లాండ్‌లో తల్లులకు గౌరవంగా మదర్ సండే పేరిట ఉత్సవాలు జరిపే వారు. అదే 1872లో అయితే జూలియ వర్డ్ హెూవే అనే ఒక మహిళ అమెరికాలో తొలిసారిగా ప్రపంచ శాంతి కోసం మదర్స్ డేని జరిపించారు. మదర్స్ ఫ్రెండ్షిప్ డేని జరిపేందుకు అన్న మేరీ జర్విస్ అనే మహిళ ఎంతో కృషి చేశారు. 1905 మే 9న ఆమె చనిపోగా ఆమె కుమార్తె మిస్ జర్విస్ మాతృ దినోత్సవం కోసం ఎంత గానో ప్రచారం చేయడం జరిగింది.

అమెరికాలో అన్ని రాష్ట్రాలలో మాతృ దినోత్సవాన్ని 1911 నాటికి జరపడం మొదలైంది. అధికారికంగా 1914 నుంచి దీనిని జరిపించాలని అమెరికా అధ్యక్షుడు ఉడ్రో విల్సన్ నిర్ణయించారు. ఇలా అప్పటి నుంచి కూడా మే రెండో ఆదివారం నాడు మదర్స్ డేని జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది.

– సత్యప్రసన్న
m : 9030 6262 88
e: desk.deccan@gmail.com

# పగటివేషం - పరమార్థం

పగటివేషాలు అనే కళా రూపం జాతి, కుల, వంశ, వైశిష్ట్యతను కాపాడేదిగా చెప్పవచ్చు, భిన్నమతాలకు, కులాలకు నిలయమైన మన భారతీయ సంస్కృతిలో అట్టడుగు వర్గాలు మాత్రమే పగటివేషాలతో సంస్కృతిని పరిరక్షిస్తున్నారు. పగటివేషాలు అనేక కళల్లో ఒకటి. వీళ్ళను కళాకారులుగా పేర్కొనవచ్చు. ప్రజల వినోదం కోసం ప్రదర్శించబడే కళారూపాలు చాలా వరకు రాత్రివేళల్లోనే ప్రదర్శించబడతాయి. కాని రాత్రి సమయాల్లో కాకుండా పగటిపూట ప్రదర్శించబడటం వల్ల ఈ కళారూపాలకు పగటివేషాలనే పేరు స్థిరపడిపోయింది. తమ హావభావాలతో వాక్చాతుర్యంతో కొందరిని అనుకరించడం, పట్టపగలే వేషం కట్టి గుర్తుపట్టలేనంతగా ఆ పాత్రలో లీనమైపోయి ఇటు పామరులను, అటు పండితులను ఆకట్టుకొని మెప్పించి, మురిపించడం పగటివేషాల ప్రత్యేకత. ఈ కళలు ప్రాచీన భారతంలోనూ కనిపిస్తాయి. ఆనాటి సమాజంలో జమీందార్లు, పెత్తందార్లు, వర్తకులు ఎన్నో అన్యాయాలు, ఆక్రమాలు, పాపాలు, అత్యాచారాలు, దోపిడిలు వంటి సంఘ వ్యతిరేక పనులు చేసే ప్రజాపీడన సమూహానికి ఒక ఆట లేదా కథ రూపంలో వివరించి చెప్పే ఉద్దేశ్యంగా ఈ పగటివేషాలు ఆవిర్భవించాయి.



కాటిపాపల వేషం

పగటివేషాలు చారిత్రకంగా, పౌరాణికంగా, సామాజికంగా దర్శించబడుతుంటాయి. ఆయా పాత్రల ద్వారా సమాజంలో ఉండే మూఢనమ్మకాలు, ఆచారవ్యవహారాల వంటి చీకటికోణాలను తమ చతుర సంభాషణలతో హాస్యధోరణితో వ్యంగ్యంగా బట్టబయలు చేస్తూ సమాజ మార్పుకు దోహదపడేటట్లు ప్రజలను విజ్ఞాన పరుస్తూ ప్రదర్శించబడ్డ ఈ కళల్లో ఆది భైరాగి వేషం, ఫకీరుసాహెబు వేషం, హరిదాసు వేషం, అర్ధనారీశ్వర వేషం, రంభ, శుక మహాఋషి వేషం, చాతాది వైష్ణవుల వేషం, లంబాడీల వేషం, వీరబాహువేషం, ఎరుకలసోది వేషం, వడ్డీ ఉప్పరవేషం, కోయ వేషం, గొల్లబోయడి వేషం, బుడబుక్కల వేషం, మందులవాడి వేషం, సోమయాజులు సోమిదేవమ్మ వేషం, పిట్టలదొర వేషం, మొదలగునవి బాగా జనాదరణ పొందిన వేషాలుగా చెప్పవచ్చు.

### ఆది భైరాగి వేషం :

"మట్టి నుండి పుట్టిన మనిషి చివరకు మట్టిలోనే కలిసిపోతాడు" అనే వైరాగ్యాన్ని ఈఆది భైరాగి వేషం తెలయజేస్తుంది. జానపదులకు భక్తితో పాటుగా హాస్యచతురత ఎక్కువ. కాబట్టి ఈ వేషం ఆలంబనగా వేదాంతధోరణిని కూడా హాస్యప్రధానం చేసుకుని ప్రదర్శిస్తారు. ఆదిభైరాగులు ఒక గ్రామాన్ని ఎంచుకుని ఆగ్రామంలోకి ఒకరు అడ్డనామంతో, వేరొకరు నిలువునామంలో, మరొకరు ఇస్లామిక్ వేషాధారణతో, ఇంకొకరు కాషాయ వస్త్రాలతో ప్రవేశిస్తారు. జానపదులకు వారు ఏమతానికి చెందినవాళ్ళ తెలియకుండా గందరగోళ పరిస్థితి ఏర్పడుతుంది. ఇలాంటి పరిస్థితిని ఆదిభైరాగులు తమకు అనుకూలంగా మలుచుకుంటూ హాస్యోక్తులతో ఒక్కోమతం వారి లోపాలను వట్టింపులను ఎత్తిచూపుతూ తమ కళను ప్రదర్శిస్తారు.

### ఫకీరు సాహెబుల వేషం :

ఈ వేషంలో కూడా వేదాంత ధోరణి, తాత్వికచింతన కన్పిస్తాయి. "మనిషి శరీరం శాశ్వతం కాదు. ధనం కూడా శాశ్వతం కాదు ధనాన్ని చూసి వ్యక్తులకు విలువ ఇవ్వడం సరికాదు" అనే సందేశాన్ని ఈవేషధారణ ద్వారా అందిస్తారు. అలాగే వీరి సందేశంలో మానవ సంబంధాల విశిష్టత తెలుస్తుంది. మమతానురాగాలు ఎక్కువయ్యే కొద్ది బాధలు కూడా ఎక్కువవుతాయనే వాస్తవాన్ని కూడా వీళ్ళు తెలియజెప్తుంటారు. హాస్యప్రియత్వమై ఈ వేషం కొనసాగుతుంది

### హరిదాసు వేషం:

సంక్రాంతి సందర్భంలో హరిదాసులు వస్తుంటారు. వీరు ఎక్కువగా రామదాసుకీర్తనలు, త్యాగరాయ కీర్తనలు, అన్నమాచార్య కీర్తనలు పాడుతుంటారు. తలపై అక్షయపాత్ర ధరించి హరినామ స్మరణ చేస్తూ ప్రతి ఇల్లు తిరుగుతూ భిక్షాటన చేస్తారు. వీరు తమ కీర్తనాలలో భక్తితత్వాన్ని ప్రబోధిస్తుంటారు. జీవితంలో కష్టసుఖాలు అనివార్యమని, దైవనామస్మరణ మనసుని గట్టెక్కిస్తుందని, దైవమే మనిషి మనుగడని నిర్దేశిస్తాయని వీరి కీర్తనలు తెలియజేస్తాయి.



బుడబుక్కల వేషం



అర్ధనారీశ్వర వేషం

"హరి" అంటే జీవితసారం వినిపించే ఉన్నతమైన పదం. ఈ పదమే జీవనసాగారాన్ని నడిపిస్తుందనే మర్మం హరిదాసు కీర్తనల్లో కనిపిస్తుంది. ఇందులో హాస్యం ఉండదు. భక్తిచింతన ప్రధానంగా ఉంటుంది.

**రంభ-శుకమహాఋషి వేషం:**

ఈ వేషంను "బాల్కి భైరాగి వేషం" అని పిలుస్తారు. ఇక్కడ "రంభ" అనే స్త్రీ ప్రలోభానికి ప్రతీక. ఈ వేషంలో బాల్కి భైరాగి తురకయాసలో తెలుగు మాట్లాడుతూ ప్రేక్షకులకు వినోదాన్ని అందిస్తుంటాడు. ఈ వేషంలో "రంభ - శుకమహర్షిల' సంవాదఘట్టం ప్రదర్శింపబడుతుంది. రంభ అందచందాలకు లొంగని శుకమహర్షి నిగ్రహశక్తి ఒక సందేశంగా ఈవేషం విజయం సాధిస్తుంది. మనిషి కూడా శుకమహర్షివలె ప్రలోభాలకు లొంగకుండా, కఠినమైన నిగ్రహశక్తితో, ఏకాగ్రతతో తను అనుకున్నది పట్టువదలకుండా సాధించాలని తెలిపే ఒక దివ్య సందేశమే ఈ కళ ఉద్దేశ్యం.



హరిదాసు వేషం

**అర్ధ నారీశ్వర వేషం :**

ఈ వేషం నిరాడంబరంగా ఉంటుంది. సమాజంలో సవతులపోరు, ఇద్దరు భార్యలు ఉన్న మగాడి పరిస్థితిని కళ్ళకు కట్టినట్లుగా ఈ వేషధారణలో ప్రదర్శిస్తుంటారు. ఈ వేషం ద్వారా భార్యభర్తల బంధంలోని పటిష్టత అర్థమవుతుంది. త్రిపురాసుర సంహారం, దక్షయజం, పార్వతీ పరిణయం, అమృతమధనం, మొదలగునవి ఈవేషధారణలో ప్రదర్శిస్తుంటారు. త్రిమూర్తులలో ముగ్గురు ఈ వేషధారణలో ప్రదర్శిస్తుంటారు. త్రిమారులతో ముగ్గురు ఏదైనా కష్టం వస్తే సమానంగా పంచుకునేవారు. దేవతలను కాపాడటం కోసం శివుడు హాలాహలాన్ని సేవించాడు. ఆ విషయాన్ని తెలియజేస్తూ ప్రతి కుటుంబంలో కష్టసుఖాలను సమానంగా పంచుకుని ఆనందంగా ఉండాలని ఈ వేషం యొక్క పరమార్థాన్ని తెలియజేస్తారు.

**చాతాది వైష్ణవుల వేషం :**

ఈ వేషం వైష్ణవ మతానికి ఎక్కువ ప్రాధాన్యత ఇస్తుంది. మానవుడు జన్మించింది మొదలు మరణించే సమయం వరకు జరిగే కార్యక్రమాలను గురించి కళాశక్తులు తెలియజెప్తుంటారు. జ్యోతిష్యమునకు సంబంధించిన లింగాలు ప్రస్తావించబడతాయి. స్త్రీ గర్భందాల్చిన సమయాన్ని ఆధారం చేసుకుని ఎలాంటి సంతానం కలుగుతుందో ఈవేషం తెలియజేస్తారు. మనిషి చిన్నచిన్న సమస్యలకు భయపడి ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. అలా కాకుండా ఎంతటి పెద్దసమస్యకైనా ఆలోచిస్తే తప్పనిసరిగా పరిష్కారం దొరుకుతుందనే సందేశాన్ని వివరిస్తారు. ఎంతో పుణ్యం చేసుకుంటే తప్ప మానవ జన్మ రాదనే విషయాన్ని తెలుపుతారు.

**లంబాడీ వేషం :**

లంబాడీల కులాచార పద్ధతులను ఈ వేషం తెలియజెప్తుంది. లంబాడీ జాతిలో అన్న మరణిస్తే వదినను మరిది వివాహం చేసుకునే ఆచారం కొనసాగుతున్నది. ఈ ఆచారం తప్పు అని కొందరు వాదిస్తుంటారు. అయితే జీవితం కొల్పోయిన స్త్రీకి కొత్త జీవితాన్ని ఇవ్వడం తప్పుకాదని సూచిస్తారు. అదేక్రమంగా సమాజంలో ఒక స్త్రీకి భర్త లేకపోతే ఆ స్త్రీని ఎన్నిరకాలుగా అవమానపరుస్తూ, గేలి చేస్తారో తెలియజేస్తారు. వితంతు వివాహాల ప్రోత్సాహానికి లంబాడీవేషం ఆదర్శంగా నిలబడుతుంది. రామాయణంలో వాలి, సుగ్రీవుల కథను అనుసంధానం చేస్తూ ప్రదర్శిస్తున్న ఈ వేషం

ఆడపిల్లలకు కుటుంబసభ్యులు అండదండగా ఉండాలని సూచిస్తుంది.

**వీరబాహువేషం :**

ఈవేషం మాదిగవారిది. వీరబాహు అంటే బలమైన భుజాలు కలిగినవాడు అని అర్థం. అనాదిగా మాదిగలు అస్పృశ్యతకు గురౌతున్నారు. ఈ పద్ధతిని నిరసిస్తూ తమ సమస్యలకు బాధలకు పరిష్కారమార్గంగా మాదిగవారు ఈ వేషాన్ని సృష్టించుకున్నారు. వేమన పద్యాలలో, పురాణ శ్లోకాలలో బ్రహ్మంగారి తత్వాలలో అందరూ ఈసృష్టిలో సమానమే అనే సందేశకరమైన సారాంశాన్ని ఈ వేషం ద్వారా ప్రేక్షకులను రంజింపచేస్తారు. పెళ్ళిళ్ళలో వధూవరులు దర్శించుకునే “అరుంధతి నక్షత్రం” తమ కులమేనని చెబుతూ తమ ఆశీర్వాదం లేకుండా ఏ ఒక్కరి జీవితాలు సంతోషంగా ఉండవని, తమకులం గొప్పతనం గురించి ఈ వేషం తెలియజేస్తుంది.

**ఎరుకల సోది వేషం :**

గిరిజనతెగల్లో ఒకరైన ఎరుకల స్త్రీలు మాత్రమే ఈ వేషం ధరిస్తారు. వాగ్దేవి కృపతో సోది విద్యను వీళ్ళు ప్రదర్శిస్తారనేది ఒక నమ్మకం. స్త్రీలు కుటుంబపోషణలో భాగంగా ఉత్తమ ఇల్లాలై, సంసారాన్ని చక్కదిద్దాలనే సంకల్పంతో రమ్యమైన మాటలతో ఎదుటివాళ్ళను ఆకట్టుకుంటుంది. వేషాధారణ దేవతల్ని పోలి ఉంటుంది. ఇందులో భూత, భవిష్యత్, వర్తమానాలకు సంబంధించిన అనేక అంశాల గురించి చెప్పబడతాయి. ఒకరకంగా ఈవేషం జ్యోతిష్యానికి సంబంధించినది. ఇందులో ఎక్కువగా వాస్తవికతకు పెద్దపీట వుంటుంది

**గొల్లబోయడు వేషం:**

ఇది కుల ప్రధానమైన వేషం. ఈవేషంలో ఎక్కువగా హాస్యభరితమైన సంఘటనలు ఎక్కువగా ఉంటాయి. ఈ వేషంలో అమాయకుడైన గొల్లవాడు, దౌర్జన్యం చేసే సాయిబు ప్రధానంగా కనిపిస్తారు. మహాభారతం మొత్తం గొల్లకులం చుట్టూ తిరుగుతుందనే సందేశాన్ని వివరిస్తారు. అలాగే శ్రీకృష్ణ పరమాత్ముడు, పాండవులు కౌరవులు మొత్తం మా గొల్లకుల వారసులు అంటూ మేమిచ్చిన పాలు, పెరుగు, నెయ్యిని ఇష్టంగా ఆరగించినట్లు మీరందరూ కూడా మమ్మల్ని ఉన్నతంగా చూడాలని ఈవేషంను ధరించి అందరి మన్ననలను ఆకట్టుకుంటారు.

**బుడబుక్కల వేషం :**

జానపదుల్లో దుష్టశక్తుల గురించి భయాందోళనలు ఎక్కువగా ఉంటాయి. ఈ భయాల్ని పొగోట్టేందుకు సృష్టించబడిన వేషమే బుడబుక్కల వేషం. వీరు తెల్లవారు జామున గ్రామాల్లోకి ప్రవేశిస్తారు. డమరుకం మోగిస్తూ ఆసక్తికరమైన పదాలతో జానపదులకు వినోదాన్ని కలిగిస్తూ వారిలో ఉండే భయాన్ని దూరం చేస్తారు. ‘ఈ మాటలన్నింటిని దేవతలందరు కలిసి బుడుబుక్కల వేషం వారి చేత మాట్లాడిస్తున్నారని ఆ జనసమూహాన్ని నమ్మిస్తారు. ఆ గ్రామదేవతలు ఆ ఊరివారందరినీ ఎల్లవేళలా కాపాడతారని జానపదులకు ఉండే భయాన్ని పొగొట్టి ధైర్యాన్ని తెలియజేసే వేషమే బుడబుక్కల వేషం,

**మందుల వాళ్ళవేషం :**

జానపదులకు నాటుమందులపై నమ్మకం ఎక్కువ. గిరిజనులకు ఆయుఃర్వేద వైద్యంలో చాలా ప్రావీణ్యం ఉంటుంది. పసర్లు, బెరడులు, ఆకులు, దుంపలు, వేళ్ళు, తీగలు, గడ్డలు, పువ్వులు వంటి తదితర వనసంపద గొప్ప ఔషధ గుణాల్ని కలిగి ఉంటాయి. గిరిజనులు వీటిని సేకరించి జనాలకు విక్రయిస్తుంటారు. ఆ క్రమంలో కొందరు మోసగాళ్ళు గిరిజనుల వేషం గట్టి మాయదారి మొక్కల్ని మందులుగా భ్రమింపజేస్తూ అమ్ముంతుంటారు. ఇలాంటివాళ్ళను నమ్మకూడదని, వైద్యం తెలిసిన



మందుల వేషం

గిరిజనులు మందుల వాళ్ళు వేషంగట్టి జనాలకు అవగాహన కలిగిస్తుంటారు. దొంగ మందులు అమ్మే వాళ్ళు నిలకడలేని జీవితం జీవిస్తారని, ఏ ఊళ్లో మందులు అమ్మినా మరుసటి రోజుకే వారు ఏదో ఒక వేరే గ్రామం వెళ్లిపోతారని వాళ్ళు చేసే మోసాలను జానపదులకు తెలియజేసే వేషమే ఈ మందులవారి వేషం.

**సోమయాజులు - సోమిదేవమ్మ వేషం :**

సంఘసంస్కర్తలు బాల్యవివాహాలను, మూఢనమ్మకాలను ఎలా రూపుమాపాలని ప్రయత్నించారో, అలాంటి ప్రయత్నంలోనే మనకు సోమయాజులు, సోమిదేవమ్మ వేషం కన్పిస్తుంది. ఈ వేషం గొప్ప సందేశాత్మకమైనది. ఇందులో సోమయాజులు వృద్ధుడు. సోమిదేవమ్మ యవ్వనవతి. ఇద్దరూ పెళ్ళిచేసుకోవడం వల్ల వచ్చే సమస్యలు చెప్పలేనివి. నిత్యజీవితంలో చాలాచోట్ల ఇలాంటి వివాహాలు జరుగుతుంటాయి. ‘ఆ దంపతుల మధ్య

వేదనాభరతమైన సంఘటనలను, హాస్యరూపంలో సోమిదేవమ్మ దుస్థితిని తెలియజేస్తుంటారు. వధూవరులు పంచభూతాల సాక్షిగా జీవితాంతం కలిసి ఉండే పెళ్ళిని ఎంపిక చేసుకునేటప్పుడు బాగా ఆలోచించి నిర్ణయం తీసుకోవాలనే అవగాహన కార్యక్రమంను ఈ వేషం ద్వారా తెలియజేస్తారు.

**పిట్టలదొర వేషం :**

ఈ వేషం బాగా జనాదారణ పొందింది. హాస్యప్రధానమైన ఈవేషంలో పాట, మాట, ఆట మూడు ప్రధానంగా ఉంటాయి. పిట్టలదొరను ఒక్కో ప్రాంతంలో ఒక్కోరకంగా పిలుస్తారు. కోతలరాయుడు, తుపాకిరాముడు, లత్కోరుసాయిబు అనేవి పిట్టలదొరకు ఉన్న పేర్లు. తుపాకిరాముని ప్రసంగం కోతలతో నిండిపోయినా తన విషాదజీవితాన్ని అప్పుడప్పుడు వ్యంగమాటలతో వివరిస్తూ జనాలకు వినోదాన్ని, విజ్ఞానాన్ని పంచడవే ధ్యేయంగా ఈ వేషం ప్రదర్శిస్తుంది. సమాజంలో కనబడే కొందరి వ్యక్తులు దోపిడి ప్రవర్తనను అదే క్రమంగా దేశభక్తిని, మాతృభక్తిని ఈవేషధారుడు ప్రకటిస్తాడు. మనిషి నిత్యజీవితంలో తనచుట్టు ఉండే కళాయి, అగ్ని, అరుగు, దీపం, తుమ్మాకు, ఇస్తరాకులు, కోడి, పార వంటి వస్తువుల విశిష్టతను వివరిస్తాడు. స్త్రీకి బంగారంపై ఉండే మక్కువను వ్యంగ్యంగా వ్యక్తం చేస్తాడు. పిట్టలదొర వేషం ప్రజ్ఞాపాటవానికి నిదర్శనంగా కన్పిస్తుంది. పోలిస్ వేషం మాదిరిగా కనబడే పిట్టలదొరలు ప్రస్తుతం చాలా వరకు కనుమరుగైపోయారు.



పిట్టల దొర

**అత్తరుసాయిబు వేషం:**

"మింగమెతుకులేదు మీసాలకు సంపెంగనూనె" అనే సామెత ఈవేషం నిరూపిస్తుంది. ఈ క్రమంలో ఇంట్లో ఆర్థిక స్థోమత లేదు. కొందరు వ్యక్తులు మాత్రం బయటి ప్రపంచానికి ధాంబికంగా కనిపించేందుకు చౌకబారు సెంట్లు, పౌడర్లు, సబ్బులు కాటుకలు మొదలైనవి కొని ఏవిధంగా తమ అందాన్ని, ఆరోగ్యాన్ని చెడగొట్టుకుంటున్నారో వివరిస్తారు. ఉన్నంతలో జీవించాలని విజ్ఞానాన్ని అందించే వినూత్నమైన అంశంగా హాస్యరూపంలో తెలియజెప్తూ సాయిబు వేషం కొనసాగుతుంది

**వడ్డీఉప్పర వేషం :**

కులవృత్తిని, కులం గొప్పతనాన్ని ఈవేషం తెలియజేస్తుంది. వడ్డెరలు, ఉప్పరలు సమాజంలో తక్కువ చేయబడుతుంటారు. కాని వడ్డెరలు రాళ్ళుకొట్టడం, పునాదులు తీయడం, గోతులు తవ్వడం, చేస్తుంటారు. మనిషి నిత్య అవసరాలలో ఉండడానికి కచ్చితంగా గూడు ఉండాల్సిందే అటువంటి ఇల్లు కట్టేది కేవలం మేస్త్రీగా ఉప్పరలు కొనసాగుతున్నారు. ఈవిధంగా తాములేకుండా ఏపనులు జరుగవు కాబట్టి ప్రజలందరి బాధలను, కష్టాలను దూరం చేయడానికి ఆవర్భవించిన వడ్డీ ఉప్పర కులాలను అన్ని కులాలతో పాటు సమానంగా చూడాలనే కులపరమార్థాన్ని ఈ వేషం సోదాహరణంగా వివరిస్తుంది.

**ముగింపు :**

జానపదకళలు ప్రాచీనమైనవి. ఎన్నో సంవత్సరాల నుండి జానపదులు ఈ కళల్ని ఆదరిస్తున్నారు. తమ అవసరాలకోసం ఈ కళల్ని నమ్ముకొని ప్రత్యేకమైన వేషదారణతో హావభావాలను కల్పిస్తూ, రాగమేళ తాళాలతో జానపదులను మెప్పించి మురిపింప చేయడంలో పగటి వేష దారులకు వెన్నతో పెట్టిన విద్య. జానపద కళల్లో ప్రత్యేకతను సంతరించుకున్న ఈ పగటివేషాలు ఒకవైపు జీవనభృతిని మరోవైపు జనాలకు హాస్యాన్ని, విజ్ఞానాన్ని సమపాళ్లలో కలిగిస్తున్నాయి. నాగరికత పెరిగాక జానపదకళలు చాలా వరకు కనుమరుగైపోయాయి. వీటిని కాపాడు కోవాల్సిన అవసరం ఎంతయినా ఉన్నది. ప్రభుత్వాలు పగటివేషాలను కళా ప్రదర్శనలను ప్రోత్సహించాలి. ఇందువల్ల భవిష్యత్ తరాలకు జానపద సాహిత్యాన్ని, కళలను పరిచయం చేయడానికి నిదర్శనంగా నిలుస్తాయి. కనుమరుగై పోతున్న కళల్ని కనీసం కొన్ని ప్రత్యేక సమయాల్లోనూ, పర్వదినాల్లోనూ బాధ్యతయుతంగా ఈ కళారూపాల ప్రదర్శనను ప్రోత్సహించడం అలవర్చుకుంటే ఈ కళలు పునరుజ్జీవనం పొందుతాయి.

**ఆధార గ్రంథాలు :**

1 పగటివేషాలు - ప్రదర్శనరీతులు- డా. గుజ్జం ప్రతాపరెడ్డి
2 జానపద విజ్ఞానాధ్యయనం డా. జి..ఎస్. మోహన్ -
3 తెలుగువారి జానపద కళారూపాలు - డా. మిక్కిలినేని రాధాకృష్ణ
4 తెలుగు జానపద సాహిత్యము డా. చింతపల్లి వసుందరారెడ్డి.

- డా॥ బి. భీమమ్మ
m : 84640 67373
e: bheemaosmania@gmail.com

# ప్రపంచ వారసత్వ దినోత్సవం

## హెరిటేజ్ వాక్

దక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్ట్ (DHAT) సహకారంతో మరియు JBR ఆర్కిటెక్చర్ కాలేజ్ (JBRAC), వొక్సన్ స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ అండ్ ప్లానింగ్ (WSAP) సహకారంతో ఇంటర్నేషనల్ కౌన్సిల్ ఆన్ మాన్యుమెంట్స్ అండ్ సైట్స్, ఇండియా (ICOMOS INDIA) సౌత్ జోన్ సభ్యులు. తెలంగాణ శిల్పులు మరియు కళాకారుల సంఘం (TSAA), అశోక స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ అండ్ ప్లానింగ్ (ASAP), మరియు సాలార్జంగ్ మ్యూజియం, ప్రపంచ వారసత్వ దినోత్సవ వారోత్సవాల ప్రారంభాన్ని పురస్కరించుకుని తెలంగాణ పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ఆదివారం, ఏప్రిల్ 14, 2024న చార్మినార్ నుండి చౌమహల్లా ప్యాలెస్ వరకు హెరిటేజ్ వాక్ నిర్వహించారు.

ఈ కార్యక్రమాన్ని హైదరాబాద్ సర్కిల్‌లోని ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా (ASI) డిప్యూటీ సూపరింటెండింగ్ ఆర్కియాలజిస్ట్ డాక్టర్ రోహిణి ప్రారంభించారు.



Er.యం . వేద కుమార్, దక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్ట్ (DHAT), Ar. నితిన్ ఆర్ సిన్హా, సెక్రటరీ, ICOMOS ఇండియా మరియు Ar. GSV సూర్య నారాయణ మూర్తి, ICOMOS ఇండియా సౌత్ జోన్ ప్రతినిధి. ఏప్రిల్ 18, 2024న అంతర్జాతీయ స్మారక చిహ్నాలు మరియు సైట్‌ల దినోత్సవం (IDMS-2024) యొక్క వారం రోజుల వేడుకలను ప్రారంభించేందుకు ఈ వాక్ నిర్వహించబడింది.

ప్రపంచ వారసత్వ దినోత్సవం 2024 యొక్క థీమ్ 'వెనిస్ చార్టర్ యొక్క లెన్స్ ద్వారా విపత్తులు మరియు సంఘర్షణలు,' ప్రారంభ ప్రసంగంలో Ar.GSV సూర్యనారాయణ మూర్తి ఈ థీమ్ వెనిస్ చార్టర్ యొక్క 60వ వార్షికోత్సవం (మే 31, 2024) మరియు భారతదేశంలో నిర్మించిన వారసత్వ పరిరక్షణకు దాని ఔచిత్యాన్ని గుర్తు చేస్తుంది. Er. యం. వేదకుమార్ ICOMOS ఇండియా, GHMC, TSTDC, మరియు QQSUDA, పర్యాటక శాఖ సహకారంతో DHAT యొక్క మునుపటి కార్యక్రమాలను వివరించారు.

Ar. మధు వోటేరి, ICOMOS ఇండియా సౌత్ జోన్ సభ్యులు నేతృత్వంలో టూర్ మరియు హెరిటేజ్ వాక్ మరియు తెలంగాణ పర్యాటక శాఖ వారు గైడ్‌లను ఏర్పాటు చేశారు. తెలంగాణ పర్యాటక శాఖ గైడ్‌లు సూర్యకాంత్, ఆనంద్ మరియు శ్రీనివాస్ ఈ హెరిటేజ్ వాక్‌లో పాల్గొన్నారు. ఈ ఈవెంట్ ICOMOS ఇండియా, DHAT మరియు వివిధ రిసోర్స్ పర్సన్‌లచే సహకార కార్యక్రమం 'వాయిస్ ఆఫ్ హెరిటేజ్ (VOH) బ్యాడ్జ్ ప్రోగ్రామ్' 2024ని కూడా పరిచయం చేసింది. బ్యాడ్జ్ ప్రోగ్రామ్‌ని ICOMOS ఇండియా సభ్యులు డాక్టర్ వసంత శోభ, ఇందిరా కె మరియు బిందు చందన సమన్వయం చేస్తున్నారు. విద్యార్థులు మరియు నిపుణులతో సహా ఆర్కిటెక్చర్, ఆర్కియాలజీ మరియు చరిత్ర నేపథ్యాల నుండి సుమారు 70 మంది ఔత్సాహికులు ప్రోగ్రామ్ కోసం నమోదు చేసుకున్నారు, DHAT 45 మంది పాల్గొనేవారిని షార్ట్‌లిస్ట్ చేసింది. కార్యక్రమం ముగింపులో నమోదిత పాల్గొనేవారికి పరిచయ ధోరణి అందించబడింది.

హెరిటేజ్ వాక్ చార్మినార్ వద్ద ప్రారంభమై లాడ్ బజార్, షాహి జిలావు ఖానా, మెహబూబ్ చౌక్, అస్మాన్ జాహ్ దేవిడి, ఖుర్షీద్ జాహ్ దేవిడి మరియు ఇక్బాల్-ఉద్-దౌలా దేవిడి వంటి ల్యాండ్‌మార్క్‌ల గుండా చౌమహల్లా ప్యాలెస్‌లో ఈ కార్యక్రమం ముగిసింది. హైదరాబాద్‌లోని రాజభవనాలు మరియు వారసత్వ కట్టడాలను సందర్శించే అవకాశాన్ని పాల్గొనేవారు అభినందించారు. తెలంగాణ శిల్పులు మరియు కళాకారుల సంఘం మద్దతుతో నిర్వహించబడిన ఆర్టిస్ట్ ఏ హెరిటేజ్ కార్యక్రమంలో మరో విశేషాంశం. ఇక్కడ సుమారు 25 మంది కళాకారులు హెరిటేజ్ హైదరాబాద్ గురించి ప్రత్యేకంగా హెరిటేజ్ వాక్ రూట్‌లోని ప్రదేశాలపై దృష్టి సారించి స్కెచ్, ఫోటోలు తీయడం మరియు చర్చించడం జరిగింది. ఈ నడకలో సహాయక సంస్థలు, వ్యక్తులు, ఔత్సాహికుల నుండి సుమారు 140 మంది పాల్గొన్నారు.

## రాజా దీన్ దయాళ్ ఛాయాచిత్రాల ప్రత్యేక ప్రదర్శన మరియు వారసత్వంపై ప్రముఖుల ప్రసంగాలు

వరల్డ్ హెరిటేజ్ డే సందర్భంగా South Zone, ICOMOS, India (సౌత్ జోన్, ఇంటర్నేషనల్ కౌన్సిల్ ఆన్ మాన్యుమెంట్స్ అండ్ సైట్స్, ఇండియా) దెక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్ట్ (Deccan Heritage Academy Trust-DHAT), సాలార్‌జంగ్ మ్యూజియం (Salarjung Museum, Hyderabad) మరియు వోక్సెన్ స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ అండ్ ప్లానింగ్ (Woxsen School of Architecture and Planning)ల సహకారంతో, ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా, (ASI, India), తెలంగాణ టూరిజం (TSTDC), జేబీఆర్ ఆర్కిటెక్చర్ కాలేజ్ (JBR Architecture College), తెలంగాణ






శిల్పులు అండ్ కళాకారులు అసోసియేషన్ (TSAA)ల తోడ్పాటుతో ఏప్రిల్ 18న సాయంత్రం హైదరాబాద్ వారసత్వాన్ని ప్రతిబింబించే రాజా దీన్ దయాళ్ ఛాయాచిత్రాల ప్రత్యేక ప్రదర్శన, వారసత్వంపై ప్రముఖ నిపుణుల ప్రసంగాలు సాలార్ జంగ్ మ్యూజియం, హైదరాబాద్‌లో నిర్వహించింది. సాంస్కృతిక వారసత్వ పరిరక్షణలో వెనిస్ చార్టర్ యొక్క ఒక ముఖ్యమైన మైలురాయి అయిన 60 సంవత్సరాలు పూర్తయిన సంధర్భంగా ఈ వార్షికోత్సవాన్ని నిర్వహించింది. ఈ ఏడాది అంతర్జాతీయ స్మారక చిహ్నాలు, ప్రదేశాల దినోత్సవం యొక్క థీమ్ "విపత్తులు మరియు సంఘర్షణలు లెన్స్ ఆఫ్ ది వెనిస్ చార్టర్". ఐకామోస్ ఇండియా సౌత్ జోన్‌కు చెందిన వాలంటీర్లు, సహకార సంస్థలు తదితరులు పలు కార్యక్రమాలను నిర్వహించారు.

డీహెచ్ఏటీ (DHAT) ఆధ్వర్యంలో హైదరాబాద్ వారసత్వాన్ని ప్రతిబింబించే రాజా దీన్ దయాళ్ ఛాయాచిత్రాల ప్రత్యేక ప్రదర్శన (ఓల్డ్ ఫోటో ప్యానెల్స్) ప్రదర్శనతో పాటు తెలంగాణ శిల్పులు, కళాకారుల సంఘం (టీఎస్ఏఏ) ఆధ్వర్యంలో సుమారు 50 మంది కళాకారులు తమ శిల్పాలు, పెయింటింగ్స్, ప్రింట్ మేకింగ్, ఛాయాచిత్రాలను ప్రదర్శించారు.

దక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్ట్ చైర్మన్ ఎం.వేదకుమార్ కీలకోపన్యాసం చేస్తూ హెరిటేజ్‌ను పరిరక్షించడం యొక్క ప్రాముఖ్యత గురించి, ప్రభుత్వం మరియు వాలంటీర్ల సహాయంతో సంరక్షించడం, వారసత్వం, సంస్కృతి, కార్యకలాపాలను ఎలా సంరక్షించాలో వివరించారు, వీటిని కాపాడడానికి ముందుగా మనం మన సంస్కృతిని కాపాడుకోవాలి. భవిష్యత్ తరాల కోసం మన ఘనమైన వారసత్వాన్ని పరిరక్షించడంలో ప్రజల భాగస్వామ్యం కూడా ముఖ్య అవసరం అని ఉద్ఘాటించారు. ఐకామోస్ ఇండియా సౌత్ జోన్ ప్రతినిధి Ar.G.S.V. సూర్యనారాయణ మూర్తి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో హైదరాబాద్ చారిత్రక, సాంస్కృతిక వైభవం, సాంస్కృతిక వైవిధ్యం ప్రాముఖ్యత, వారసత్వ పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యం ఆవశ్యకతపై చర్చించారు.

డాక్టర్ ఇ.శివనాగిరెడ్డి, స్థపతి, సీఈఓ, ప్లీజ్ ఇండియా హైదరాబాద్ హెరిటేజ్‌కు బియాండ్ బోర్డర్స్ అనే అంశంపై మాట్లాడారు. మెటీరియల్స్ ఇన్ హెరిటేజ్ క్లైమేట్ ఛేంజ్ అనే అంశంపై ఐఐటీ హైదరాబాద్ డాక్టర్ శివాజీ మాట్లాడారు. ఆర్కియాలజిస్ట్, హెరిటేజ్ మేనేజర్, కన్జర్వేటర్ డాక్టర్ ఎన్ తాహెర్ వరల్డ్ హెరిటేజ్‌లో సైట్ మేనేజర్‌గా మల్టీటాస్కింగ్‌ను సమర్పించారు.

సాలార్జంగ్ మ్యూజియం జాయింట్ డైరెక్టర్ నాగేశ్వరరావు వారసత్వ పరిరక్షణ ప్రాముఖ్యతపై మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో పాల్గొనడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టీఎస్ఏఏ అధ్యక్షుడు పార్థసారథి కార్యక్రమంలో పాల్గొని వారసత్వ పరిరక్షణ పైమాట్లాడారు. చివరగా వాయిస్ ఆఫ్ హెరిటేజ్ బ్యాడ్జ్ కార్యక్రమం ముగింపు ప్రసంగాన్ని సమర్పించారు.

**బన్సీలాల్‌పేట్ స్టెప్ వెల్ వద్ద వాయిస్ ఆఫ్ హెరిటేజ్ బ్యాడ్జ్**

ప్రపంచ వారసత్వ దినోత్సవ వేడుకల్లో భాగంగా బన్సీలాల్ పేటలో స్థల సందర్శన నిర్వహించారు. వాయిస్ ఆఫ్ హెరిటేజ్ ప్రోగ్రామ్ కింద బన్సీలాల్‌పేట స్టెప్‌వెల్ పర్యటనలో ప్రఖ్యాత ఆర్కిటెక్ట్, జి.వి.యస్. సూర్యనారాయణ మూర్తి, మెట్లబావి వద్ద చేపట్టిన పునరుద్ధరణ పనిని విశదీకరించారు.

డెక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్ట్ ఛైర్మన్ వేదకుమార్ మణికొండ, సాంస్కృతిక వారసత్వాన్ని పరిరక్షించడంలో దాని ప్రాముఖ్యతను తెలుపుతూ ప్రాజెక్ట్ వివరాలపై అంతర్దృష్టులను అందించారు. డా. వసంత్ శోభ కూడా మెట్ల బావి యొక్క చారిత్రక ప్రాముఖ్యతపై వెలుగునిస్తూ సంక్షిప్త ప్రసంగం చేశారు. స్థానిక కమ్యూనిటీకి చెందిన సీమ తన అనుభవాలను పంచుకుంది, ప్రాజెక్ట్ విజయంలో సంఘం ప్రమేయం యొక్క కీలక పాత్రను నొక్కి చెప్పింది. ఆర్.ఇందిర కొల్లితో పాదయాత్ర ముగిసింది.

భారత పురావస్తు శాఖ రిటైర్డ్ డైరెక్టర్ తాహెర్ మరియు ఫోరమ్ ఫర్ బెటర్ హైదరాబాద్ నుండి శోభాసింగ్‌తో సహా వివిధ సంస్థల ప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంపై వారి అభిప్రాయలు, చర్చలు, ఆలోచనలు, పరస్పర అభిప్రాయ మార్పిడికి దోహదపడింది. భవిష్యత్ తరాలకు సాంస్కృతిక సంపదపై అవగాహన మరియు పరిరక్షణను ప్రోత్సహించడం లక్ష్యంగా పెట్టుకుని ICOMOS, డెక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్ట్ మరియు JBR కాలేజ్ ఆఫ్ ఆర్కిటెక్చర్ సహకారంతో నిర్వహించబడిన వాయిస్ ఆఫ్ హెరిటేజ్ కార్యక్రమం నిర్వహించబడింది. బావిని ఆదర్శప్రాయంగా పరిరక్షించి, సంరక్షిస్తున్నందుకు గండిపేట సంక్షేమ సంఘం రాజశ్రీకి నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

– ఎసికె. శ్రీహరి, m : 9849930145
e : ackvs08@gmail.com

# చరిత్ర గుట్టు బయటపెట్టే నాణేలు

## నాణేలతో శాతవాహనులపై మరింత స్పష్టత

శాతవాహనుల చరిత్రకు ప్రాచీన నాణేలు అందించిన తోడ్పాటు ఏంటి అనేది నా కీలకోపన్యాసానికి నేను ఎంచుకున్న అంశం. ప్రాచీన భారతదేశాన్ని పాలించిన ప్రముఖ రాజవంశాల్లో శాతవాహనులు ఒకరని మీ అందరికీ తెలిసిందే. ప్రఖ్యాత సాంచీ స్థూపం, అమరావతి స్థూపం లాంటివి, పశ్చిమ భారతదేశంలో రాతిని తొలచి నిర్మించిన ఆలయాలు లాంటి గొప్ప కళాత్మక కట్టడాలన్నీ శాతవాహనులు అందించినవే. ఇలస్ట్రేటివ్ ఆర్కియాలజీకి ప్రఖ్యాతి పొందిన గొప్ప శిల్పకళా రీతులు మూడు నాలుగు వందల ఏళ్ల పాటు వికసించి వర్ధిల్లింది వీరి కాలంలోనే. ఎన్నో బౌద్ధ స్థూపాలు ఇందుకు సజీవ తార్కాణాలుగా ఉన్నాయి.

శాతవాహనుల కాలంలో సాహిత్యం కూడా వికసించింది. హాలుడి గాథాసప్తశతి, సర్వవర్మ కాతంత్ర వ్యాకరణం, గుణాఢ్యుడి బృహత్కథ, సోమదేవుడి కథాసరిత్సాగర, క్షేమేంద్రుడి బృహత్కథా మంజరి వంటి రచనలు ఎన్నో వచ్చాయి.



శాతవాహన రాజవంశ స్థాపకుడైన చిముక శాతవాహనుడి నాణెం. నాణెం యొక్క భాష ప్రాకృతం, లిపి బ్రాహ్మి. ప్రాకృత పదాలు రన్నో, సిరి-సంస్కృతంలో రాజ్ఞో, శ్రీతో సమానం.

ఆక్స్ ఫర్డ్, ప్రిన్స్ టన్ యూనివర్సిటీకు చెందిన జాన్ హేవుడ్ తయారు చేసిన ప్రపంచ చరిత్ర పటాలను చూస్తే గనుక, సామాన్యశక పూర్వం ఒకటో శతాబ్దంలో భారత దేశంలో దాదాపుగా మూడింట ఒక వంతు ప్రాంతాన్ని, సామాన్య శకం 200 సంవత్సరంలో దాదాపు సగం భారతదేశాన్ని శాతవాహనులు పాలించారని తెలిస్తే ఆశ్చర్యపోక తప్పదు. శాతవాహనుల కాలంలో రోమ్, పాశ్చాత్యదేశాలతో వ్యాపారం కూడా జరిగింది. భారతదేశ చరిత్రలో ఆ కాలం ఎంతో శాంతి సౌభాగ్యాలతో ఉండింది.

శాతవాహనుల చరిత్రను అధ్యయనం చేసేందుకు మూడు రకాల వనరులు అందుబాటులో ఉన్నాయి. వాటిలో మొదటిది శాతవాహనుల కాలానికి చెందిన సాహిత్య రచనలు, రెండోది శాసనాలు, మూడోది నాణేలు. శాతవాహనుల కాలానికి చెందిన సాహిత్య రచనలు చాలా వరకు పురాణాలు. మత్స్య, వాయు, విష్ణు, బ్రహ్మాండ, భాగవత పురాణాలు వీటిలో ఉన్నాయి. ఈ పురాణాలు విషయపరంగా శాతవాహనులతో మిళితం అయినప్పటికీ, పాలకుల సంఖ్య, వారు పాలించిన సంవత్సరాలు, వారి వారసులు లాంటి విషయాలలో అవి పరస్పర విరుద్ధ సమాచారాన్ని అందించాయి. ఈ రచనలు అన్నీ కూడా ఆనాటి ప్రజల సామాజిక, మత, ఆర్థిక అంశాలకు సంబంధించిన సమాచారాన్ని తెలుసుకునేందుకు ఉపయోగపడినా, చరిత్ర రచనకు మాత్రం అంతగా ఉపయోగపడవు.

ఇక శాసనాల విషయానికి వస్తే, శాతవాహనుల కాలానికి సంబంధించినవి 33 శాసనాలున్నాయి. వీటిలో ఇటీవలే తెలంగాణలోని కరీంనగర్ జిల్లాలోని ముక్కత్ రావుపేట, గట్టు సింగారంలలో బయటపడిన హకుసిరి యువరాజుకు సంబంధించిన రెండు శాసనాలు కూడా ఉన్నాయి. వాటి వివరాలు నేను తరువాత తెలియజేస్తాను. అయితే శాతవాహనుల శాసనాల్లో మూడో వంతు అధికారికం. వాటిలో అత్యధిక భాగం ప్రైవేటు వ్యక్తులకు జారీ చేయబడినవి. అందువల్ల అవి వాటి ఉపయోగిత స్వభావపరంగా ఎక్కువగా మతపరమైన అంశాలకు చెందినవి. శాతవాహనుల చరిత్ర పునర్ నిర్మాణానికి వాటి ఉపయోగం తక్కువే. అందువల్ల శాతవాహనుల చరిత్ర సమాచార అధ్యయనానికి సంబంధించి నాణేలు ప్రధాన వనరుగా మారాయి.

శాతవాహనుల కాలం నాటి సాహిత్య రచనలు, శాసనాలతో పోలిస్తే, నాణేల అధ్యయనం మరెంతో ఉపయుక్త కరంగా ఉంటుంది. మద్రాస్ యూనివర్సిటీలో 1959 మార్చి 4న మద్రెమండ రామారావు ప్రసంగించారు. వివిధ మ్యూజియంల నుంచి, ప్రైవేటు వ్యక్తుల దగ్గరి నుంచి ఆయన 57271కి పైగా శాతవాహన నాణేలను అధ్యయనం చేశారు. శాతవాహనుల గురించి ఆయన చేసిన ప్రసంగానికి నాణేలే ఆధారంగా నిలిచాయి. ఈ నాణేలు సాధారణంగా మూడు రకాలు. హోర్డ్స్, స్ట్రేస్, సైట్ ఫైండ్స్.

హోర్డ్స్ అంటే మట్టిలో దొరికే నిక్షేపాల్లోని నాణేలు. స్ట్రే నాణేలు అంటే అనుకోకుండా లభించినవి. ఇక మూడో రకం తవ్వకాల సందర్భంగా బయటపడేవి. వీటన్నిటిలోకి తవ్వకాల్లో బయటపడిన నాణేలే అత్యుత్తమంగా ఉపయోగపడుతాయి. ఎందుకంటే ఇక్కడ లభించేవి ప్రత్యక్ష ఆధారాలు. అక్కడ దొరికే ఇతర వస్తువుల డేటింగ్, నాణేల డేటింగ్‌కు కూడా తోడ్పడుతుంది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్,



చిముక శాతవాహనుడు కోటలింగాలకు చెందిన స్థానిక పాలకుడు సామగోప నుంచి రాజ్యం స్వాధీనం చేసుకున్నాడు. సామగోప నాణేలపై చిముక తన పేరు, ఉజ్జయిని ముద్రించాడు.

మహారాష్ట్ర, కర్నాటక, మధ్యప్రదేశ్, ఛత్తీస్ గఢ్... ఇలా శాతవాహన ఆర్కియలాజికల్ విభిన్న ప్రాంతాల్లో ఉన్నాయి. ఈ ప్రాంతాల్లో శాతవాహనుల నాణేలు లభ్యమయ్యాయి. వాటి అధ్యయనం శాతవాహన చరిత్రను నమోదు చేయడంలో ఎంతగానో తోడ్పడు తుంది. దేశంలో శాతవాహనుల నాణేలు లభించిన తవ్వకాల ప్రాంతాలు మొత్తం 27 ఉన్నాయి. శాతవాహనులకు సంబంధించి వారు ఎవరు, వారి పాలన ఎప్పుడు ప్రారంభమైంది, అది ఎంత కాలం కొనసాగింది, వారి పాలన ఎక్కడి నుంచి ప్రారంభమైంది... ఇలా ఎన్నో ప్రశ్నలకు ఈ నాణేలు సమాధాన మిచ్చాయి. 1978లో కనుగొన్న కోటిలింగాల నాణేలు శాతవాహనులకు సంబంధించిన ఎన్నో ప్రశ్నలకు సమాధానం ఇచ్చాయి.

మొదటగా శాతవాహనులు ఎవరో చూద్దాం. శాతవాహనులు, ఆంధ్రులు ఒక్కరే. పురాణాల్లో ప్రస్తావించిన పేర్లు, రాజుల జాబితాలు శాసనాల్లో కనుగొన్న, నాణేల్లో పేర్కొన్న శాతవాహన రాజుల పేర్ల మాదిరిగానే ఉన్నాయి. అందువల్లే వారు ఒక్కరే అని పరిగణించడం జరిగింది. శాతవాహన సామ్రాజ్యం మొదటి పాలకుడి సరైన పేరు చిముక శాతవాహన. శతాబ్దాల తరువాత ఈ పురాణాలను రాసినందున మొదటి పాలకుడికి అవి విభిన్న పేర్లను ఇచ్చాయి. దాంతో వారి చుట్టూ మరెన్నో కథలు అల్లుకుపోయాయి. శాతవాహన నాణేలపై ఉన్నది ఎవరు? ఆయన మరెవరో కాదు, చిముక శాతవాహన. శాతవాహన నాణేలపై ఉన్నది ఏ భాష? అది ప్రకృతి. దాని లిపి బ్రాహ్మి.

చిముక శాతవాహనుడి తరువాత అధికారం చేపట్టింది ఎవరు? ఆయన సామగోప. ఆయన కోటిలింగాల నుంచి వచ్చిన ముందుకాలపు శాతవాహన రాజు. చిముక రాజు కాకముందు ఏం చేసే వాడు? ఆయన రాజు కాకముందు మహారథి అనే బిరుదుతో ఉన్న అధికారి అని సన్నతి తవ్వకాల్లో దొరికిన నాణేలు నిరూపించాయి. సన్నతిలో రాజుగా చిముకను పేర్కొనే నాణేలతో పాటుగా ఆయన మహారథి బిరుదుతో ఉన్న అధికారిగా పేర్కొనే నాణేలు కూడా లభించాయి.

శాతవాహనులకు పుట్టినిల్లు తెలంగాణ అని, వారి మొదటి రాజధాని కోటిలింగాల అని కూడా ఈ నాణేలు తిరుగులేని విధంగా నిరూపించాయి.

శాతవాహనులకు సంబంధించిన మరో అంశం నాణేల ద్వారా వెలుగులోకి వచ్చింది. శాతవాహన కుటుంబాలు స్వాభావికంగా మాతృస్వామ్యానికి చెందినవి. గౌతమిపుత్ర, వాశిష్ట పుత్ర వంటి శాతవాహన రాజుల పేర్లను ఇందుకు ఉదాహరణగా చెప్పవచ్చు.

శాతవాహన రాజులకు సంబంధించి పౌరాణిక జాబితా కూడా అసంపూర్ణంగానే ఉంది. ఉదాహరణకు స్కంద, రుద్ర వంటి నాణేలు లభించాయి కానీ వాటి ప్రస్తావన పురాణాల్లో లేదు. అందుకే శాతవాహన రాజుల పౌరాణిక జాబితాను సవరించాల్సి ఉంది.



శాతవాహన రాజవంశ స్థాపకుడి సరైన పేరు చిముక శాతవాహన.

పశ్చిమ క్షాత్రపులకు చెందిన నహపాణను ఓడించేంత వరకు కూడా శాతవాహనులు వెండినాణేలను జారీ చేయలేదని, ఓడించిన తరువాత వాళ్ళ వెండిని ఉపయోగించుకున్నారని చెబుతారు. క్షాత్రపుల వెండి, శాతవాహనుల నాణేలు వేర్వేరు లోహాలకు చెందినవని నేను చేసిన ఎక్స్ రే అధ్యయనాలు నిరూపించాయి. పంచ్ మార్క్ చేసిన వెండి నాణేలు అనేకం అప్పట్లో చలామణిలో ఉండేవి, అందుకే శాతవాహనులకు వెండి నాణేలు జారీ చేయాల్సిన అవసరం రాలేదు.

పురాణాలు గౌతమీపుత్ర యజ్ఞ శాతకర్ణి తన సోదరుడు గౌతమీపుత్ర శాతకర్ణి తరువాత చాలా కాలం పాటు రాజ్యపాలన చేశాడని పురాణాలు చెబుతున్నాయి. అది నిజం కాదు. వారు ఏకకాలంలో వేర్వేరు ప్రాంతాలను పరిపాలించారు. ఉదాహరణకు గుంటూరులో లభించిన నిక్షేపాల్లో ఎక్కువ నాణేలు యజ్ఞకు సంబంధించినవి. ఈ సోదరులు తమ సామ్రాజ్యంలోని భాగాలను ఏకకాలంలో పాలించినట్లుగా కనిపిస్తోంది.



శాతవాహన రాజుల పౌరాణిక జాబితాలు సమగ్రం కావు మరియు సవరించాల్సిన అవసరం ఉంది. ఉదాహరణకు, శాతవాహన రాజుల నాణేలపై స్కంద శాతకర్ణి పేరు ఉంది. మత్స్య, వాయు, విష్ణు, బ్రహ్మాండ, భాగవత పురాణాలలో అతని పేరు లేదు. స్కంద శాతకర్ణి నాణెం ఇది.

శాతవాహన చివరి పాలకుడిని పులుమావిగా పిలిచేవారని నాణేలు నిరూపిస్తున్నాయి. పులుమావి అనేది తెలుగుపదం. అది అంతకు ముందు పాలకులైన పుడుమావిలకు సంబంధించింది కాదు. పెద్దబొంకూరులో లభించిన నాణేలు కొన్ని ప్రాంతాల్లో శాతవాహనుల తరువాత పల్లవులు రాజ్యాధికారంలోకి వచ్చినట్లుగా నిరూపిస్తున్నాయి. పల్లవులు శాతవాహనుల నాణేలపైనే తిరిగి తమ ముద్రలు వేశారు. ఇది కొన్ని కొన్ని ప్రాంతాల్లో శాతవాహనుల తరువాత పల్లవులు రాజ్యాధికారంలోకి వచ్చినట్లుగా నిరూపిస్తోంది.

మొత్తం మీద శాతవాహనుల చరిత్రకు నాణేలు గొప్పగా తోడ్పడ్డాయి.

– దెమె రాజారెడ్డి,
m : 9848018660
e : palvashareddy@gmail.com

## చందాదారులుగా చేరండి... చేర్పించండి...

***పాఠకులకు, రచయితలకు, పరిశోధకులకు... నమస్సులు.***

తెలంగాణ ఉద్యమ సందర్భంలో పుట్టిన తెలుగు మాసపత్రిక దక్కన్‌లాండ్. తెలంగాణ సాధన ఉద్యమ సమయంలో ఉద్యమానికి దిశా నిర్దేశం చేసేలా ఎందరో ప్రముఖుల వ్యాసాలను అందించింది. టిఆర్‌సి 'చర్చ' సారాంశాలను ప్రజల్లోకి తీసుకెళ్ళింది. తెలంగాణ భావజాలాన్ని బలోపేతం చేసింది. స్వరాష్ట్ర ఆవిర్భావం తర్వాత దక్కన్‌లాండ్ తెలంగాణ పునర్ నిర్మాణంతో తనదైన పాత్రను పోషిస్తున్నది. తెలంగాణ తనదైన అస్తిత్వాన్ని కాపాడుకోవడానికి, మరింత పరిపుష్టం చేసుకునేదానికి దోహదం చేస్తున్నది.

ఈ నేపథ్యంలో సామాజిక అంశాలతోపాటు, పర్యావరణం, చరిత్ర, వివిధ చేతివృత్తుల కళారూపాలు, నైపుణ్యాలు, వారసత్వం, పర్యాటకం లాంటి అంశాలపై కథనాలను వెలువరిస్తున్నది. ప్రజా సంక్షేమం కోసం జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల దృష్టికి తీసుకెళ్లుతుంది. 2012 సెప్టెంబర్‌లో ప్రారంభమైన పత్రిక ఇప్పటి వరకూ మీ అందరి సహకారాలతో కొనసాగుతూ వస్తుంది. ఇప్పటికే ఎంతో మంది మిత్రులు, శ్రేయోభిలాషులు, తమ చందాలతో పాటు, చందాదారులను చేర్పించడంలో తమ సహకారాన్ని అందిస్తున్నారు. వారికి ధన్యవాదాలు.

అయినప్పటికీ పత్రిక నిర్వహణ కష్టసాధ్యంగా ఉంది. దక్కన్‌లాండ్ మనందరిది. పదికాలాల పాటు పత్రిక సజావుగా వెలువడే బాధ్యత మన అందరిదీ.

చందా పూర్తయిన వారు తమ చందాలను రెన్యూవల్ చేసుకుని కాంప్లిమెంటరీ కాపీలు అందుతున్న వారు కూడా చందాదారులుగా చేరి, మిత్రులను చేర్పించి సహకరిస్తారని ఆశిస్తూ...

ధన్యవాదాలతో... మీ
***– మణికొండ వేదకుమార్***
సంపాదకులు

**చందా వివరాలు:**

వార్షిక చందా : రూ. 300 2 సం॥లకు : రూ. 600

*'దక్కన్ ల్యాండ్' పేరిట ఎంఓ, మనీయార్డర్, చెక్ లేదా నగదు రూపంలో చందామొత్తం చెల్లించవచ్చు.*

**చిరునామా :**

**DECCAN LAND :**
**"CHANDRAM"** 3-6-712/2, St.No. 12, Himayatnagar,
Hyderabad - 500 029. Telangana
**Fax: 040-27635644 Mobile: 9030626288**
E-mail:desk.deccan@gmail.com ww.deccanland.com

**దక్కన్‌ల్యాండ్ బ్యాంకు ఖాతా వివరములు:**

| | |
|---|---|
| Name | : DECCAN LAND |
| Bank | : KOTAK MAHINDRA BANK |
| A/c No | : 7111218829 |
| IFSC Code | : KKBK0007463 |
| Branch Code | : 007463 |




# దక్షిణ భారత నాణ్యాల సంస్థ వార్షిక సమావేశం

## రెండు రోజుల జాతీయ సదస్సును చరిత్రశాఖ, డాక్టర్ బి.ఆర్.అంబెడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం వారు నిర్వహించారు

డాక్టర్ బి.ఆర్. అంబెడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం, చరిత్రశాఖ ఆధ్వర్యంలో 10.04.2024, 11.04.2024 రోజుల్లో దక్షిణ భారత నాణ్యాల సంస్థ వార్షిక సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో 150 మంది వివిధ రాష్ట్రాల నుండి పరిశోధకులు, మేధావులు, విద్యార్థులు పాల్గొన్నారు. వారు శాతవాహన, ఇక్ష్వాకులు, విష్ణుకుండిలు, చాళుక్యులు, వాకాటకులు, ముసునూరి నాయకులు, దేవరకొండ పాలకులు, వెలమ పాలకులకు సంబంధించిన నాణ్యాలు, కాకతీయుల నాణ్యాలు, బహమనీల, కుతుబ్ షాహీల నాణ్యాల మీద సమగ్రమైన చర్చ జరిగింది.

ఈసమావేశాన్ని రిజిస్ట్రార్ ఆచార్య ఏ.వీ. ఆర్.ఎన్ రెడ్డి అంబెడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం వారు ప్రారంభించారు. ఈ సమావేశంలో జనరల్ ప్రెసిడెంట్ ఆచార్య కె.పి.రావు, కేంద్రీయ విశ్వవిద్యాలయం వారు కీలక విషయాలను, నాణ్యాల సేకరణ, వాటి ప్రాశస్త్యం, చరిత్ర పునర్నిర్మాణంలో వాటి పాత్ర గురించి చక్కగా విశ్లేషించారు.

ముఖ్య అతిధిగా పాల్గొన్న ఆచార్య కిషన్‌రావు, మాజీ రిజిస్ట్రార్, ఉస్మానియా విశ్వవిద్యాలయం వారు చరిత్ర నిర్మాణంలో నాణ్యాల పాత్ర చాలా వున్నది అని, రోమన్, అరబ్ నాణ్యాలు దక్షిణ భారతదేశానికి, అరబ్, రోమ్తోవున్న ఆర్థిక, సాంస్కృతిక సంబంధాలను తెలియజేస్తున్నాయి అని వివరించారు. చరిత్రకారులు నాణ్యాలను పరిశీలించి, తెలంగాణ చరితకు వాటి ఉపయోగాలను గ్రంథాల రూపంలో తెలపాలని కోరారు. ఈ సమావేశంలో కీలక ఉపన్యాసాన్ని డాక్టర్ డి. రాజారెడ్డి దక్షిణ భారత నాణ్యాల సంస్థ అధ్యక్షులు చేసారు. వీరు శాతవాహన, కాకతీయ, అసఫ్జహి నాణ్యాల మీద అనేక రచనలు చేసారు. ఈ నాణ్యాల ఆధారంగా నాటి సామజిక, మాత, ఆర్థిక, సాంస్కృతిక అంశాలను ఈ సమావేశంలో పేర్కొన్నారు. ఆచార్య వడ్డాణం శ్రీనివాస్ డీన్ సామాజిక శాస్త్రాల విభాగం వారు చారిత్రశాఖ నిర్వహిస్తున్న వివిధ కోర్సులను, ప్రాచీన చరిత్ర పునర్నిర్మాణం కోసం తీసుకుంటున్న చర్యలను, శాసన, నాణ్యాల ప్రాధాన్యతను వివరించారు. ఈసమావేశంలో ఆచార్య ఇ. సుధారాణి, చరిత్రశాఖలో సీనియర్ ఆచార్యుల వారు నాణ్యాలను, వాటిపై వున్న పలువురి రాణుల జీవన విశేషాలను, నాటి రాణులు చేసిన దాన, ధర్మాలను, వారి ప్రశస్తాన్ని చక్కగా పేర్కొన్నారు. ఈ సమావేశంలో రాధాకృష్ణ, ఆర్.బి.ఐ. క్యురేటర్ పాల్గొన్ని నాణ్యాల తయారీ, వాటి చలామణి, నాణ్యాల ప్రాధాన్యతను, ఆర్.బి.ఐ తీసుకుంటున్న చర్యలను వివరించారు. సమావేశంలో సీనియర్ కార్యనిర్వాహక సభ్యులు శ్రీ. సత్యమూర్తిగారు దక్షిణ భారత నాణ్యాల సంస్థ ఏర్పాటు, సంస్థ చేపట్టే వివిధ కార్యక్రమాలు, నాణ్యాల మీద సభ్యులు రాసిన వివిధ రచనలు, కేరళ, కర్ణాటక తమిళనాడులో జరిగిన అనేక పరిశోధనల గురించి వివరించారు. సమావేశంలో చరిత్రశాఖ అధ్యక్షులు డాక్టర్




గాజుల దయాకర్ విశ్వవిద్యాలయం తీసుకుంటున్న చర్యలను, చరిత్ర శాఖ ప్రాచీన చరిత్ర నిర్మాణంలో చేపడుతున్న వివిధ కార్యక్రమాలను, రచనలను, నాణ్యాల ప్రదర్శన, నాణ్యాల తయారీకి వాడుతున్న లోహాలను, కుతుబ్‌షాహీ, అసఫ్ జాహి నాణ్యాలపై విన్న గుర్తులు, చిహ్నాలను, వాటి ద్వారా ఆయా కాలాలలో జరిగిన ఆర్థిక వ్యవహారాలను వివరించారు.

ఈ సమావేశంలో పరిశోధకులు ప్రాచీన పాలకులు విడుదల చేసిన రాగి, వెండి, బంగారు నాణ్యాల వివరాలను, గద్య, మాడ, కార్షాపణ, సువర్ణ, జిటల్, హాలిసికా, ఫణం, హోన్వంటి పలు నాణ్యాల గురించి వాటి ప్రాధాన్యత గురించి, స్థానిక రాజులు విడుదల చేసిన నాణ్యాలకు, బ్రిటిష్ పాలనలో చలామణి అవుతున్న నాణ్యాలకు మధ్య గల తేడాను, నాణ్యాల లోహ ప్రాధాన్యతను, నాణ్యాల విలువను, నాణ్యాల మీద వున్నా శ్రీ. పరమేశ్వర, బుద్ధ, జైన, శైవ, వైష్ణవ దేవత గుర్తులను, లిపిని, మహమ్మదీయ పాలకుల నాణ్యాల మీద వున్న పలు కట్టడాల గుర్తులను, వాటిపై వున్నా పర్షియా, ఉర్దూ, అరబిక్‌ల పులను, రోమన్ పాలకుల నాణ్యాల మీద వున్నా గుర్తులను, రోమన్ నాణ్యాల ప్రామాణికతపై పత్రాలను సమర్పించారు. సమావేశంలో 100 పైగా పత్రాలు సమర్పించి, చర్చించారు.

తెలంగాణలోని కోటిలింగాల, దూళికట్ట, పెద్దబంకుర్, నాగార్జున కొండ, దొనకొండ, శ్రీపర్వతం, కొండాపూర్, బోధన్, నిర్మల్, హనుమకొండ, వేములవాడ, సైఫాబాద్, గోల్కొండ, పానగల్లు, వనపర్తి, సూగూరు, జటప్రోలు, అమరచింత, వంటి పలు ప్రాంతాల్లో జరిగిన పురావస్తు అధ్యయనాలు, మందుముల్, ముకట్రావుపేట, చందుబాట్ల, కొలనుపాక, అలంపూర్, నేలకొండపల్లి, వాడపల్లి, ఘనపూర్, రామప్ప, నుస్తులాపూర్, నగునూరు, వంటి ప్రాంతాల్లో ప్రాచీన చరిత్ర నిర్మాణానికి సంబంధించిన పలు అంశాలపై చర్చ జరిగింది.

ఫణిగిరి, గాజులబండ, వర్ధమానుకోట, తిరుమలగిరి వంటి ప్రాంతాల్లో జరిగిన త్రవ్వకాల గురించి అక్కడ లభించిన పలు పురాతన వస్తువుల గురించి చర్చించారు. ఇటీవల ఫణిగిరిలో జరిపిన త్రవ్వకాల్లో దొరికిన 3730 సీసపు నాణ్యాలు, వాటిపై వున్నా ఏనుగు గుర్తులను, ఉజ్జయిని గుర్తులను, ఇక్ష్వాకులకు చెందిన ఈ నాణ్యాలపై కూడా చర్చ జరిగింది. ఇంక పూర్తి స్థాయిలో ఈ నాణ్యాల మీద చర్చ జరగాల్సిన ఆవశ్యకతను పరిశోధకులు వెలిబుచ్చారు.

దక్షిణ భారత నాణ్యాల వార్షిక సమావేశ ముగింపు సదస్సుకు ముఖ్య అతిథిగా ఆచార్య కె. సీతారామారావు, ఉపకులపతి, అంబెద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం వారు పాల్గొని నాణ్యాల చరిత్ర, నాణ్యాల వాడకం, నిజాంల కాలంలో దొరికిన వివిధ నాణ్యాలను, వాటి ప్రాధాన్యతను, చరిత్ర శాఖ చేపట్టాల్సిన కార్యక్రమాలను పేర్కొన్నారు.

ఈ సమావేశానికి అతిథిగా పాల్గొన్న డాక్టర్ మణికొండ వేదకుమార్ గారు తెలంగాణాలో జరుగుతున్న చరిత్ర పరిరక్షణ కార్యక్రమాలను, పురావస్తు శాఖ జరుపుతున్న త్రవ్వకాలను, వివిధ ప్రాంతాల్లో దొరికిన ప్రాచీన వస్తువులను, నాణ్యాలను, బౌద్ధ గుర్తులను, వాటి ప్రాధాన్యతను, సమాజానికి చరిత్ర ద్వారా విలువైన సమాచారం అందిచాలని తెలిపారు. ఈ సమావేశంలో మరొక అతిథి శ్రీమతి అనురాధ రెడ్డి పాల్గొని, దోమకొండ, అమరచింత, వనపర్తి సంస్థానాల సేవలను, వారు సమాజానికి అందించిన సంస్కృతి విశేషాలను తెలిపారు. డాక్టర్ రాజారెడ్డిగారు సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొని నాణ్యాలపై చరిత్రకారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని. నాణ్యాలను, వాటిపై వున్న అంశాలను పరిశోధించాలి, నూతన చరిత్ర నిర్మాణానికి నడుం బిగించాలని తెలిపారు.

సీనియర్ ఆచార్యులు డాక్టర్ సుధారాణి చరిత్ర నిర్మాణంలో నాణ్యాల పాత్ర, వాటి వాడకం, నాణ్యాల సేకరణ వంటి విషయాలను పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఆచార్య వడ్డాణం శ్రీనివాస్ డీన్ సామాజిక శాస్త్రాల విభాగం వారు చరిత్రలో నాణ్యాలు పాత్ర, విశిష్టతపై మాట్లాడారు. చివరగా చరిత్ర శాఖ అధ్యక్షులు డాక్టర్ గాజుల దయాకర్ వివిధ రకాల నాణ్యాలు, లోహాలు, నాణ్యాల పరిమాణం, నాణ్యాల ప్రామాణికత వంటి విషయాలను తెలిపారు.

ఈ సమావేశంలో ఆచార్య చెన్నారెడ్డి ప్రచురించిన నుమిస్మాటిక్ ఇండికా గ్రంథాన్ని ఆవిష్కరించారు. శివమాధురి పండిత వ్రాసిన రీచెస్ సాఫ్కల్చరల్ హెరిటేజ్ ఇస్టారికల్ పార్స్పెక్టివ్స్ అనే గ్రంథాన్ని ఆవిష్కరించారు. డెక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్ట్ వారు దీన్ని ప్రచురించారు. చరిత్ర శాఖ వారు ముద్రించిన సావనీర్‌ను కూడా ఆవిష్కరించారు.

– దక్కన్‌న్యూస్, m : 9030 6262 88
e: desk.deccan@gmail.com

# ఉమ్మడి వరంగల్ జిల్లా - గ్రామ నామాలు

తెలంగాణ రాష్ట్రంలో హైదరాబాద్, సికింద్రాబాద్ రెండు నగరాలు జంట నగరాలుగా పిలుచుకోవడం ఒక విశేషమైతే వరంగల్, హనుమకొండ, ఖాజీపేట ఈ మూడు పట్టణాలను కలిపి ట్రై సిటీస్'గా పిలుచుకోవడం మరో విశేషం. ఉమ్మడి వరంగల్ జిల్లా చారిత్రకంగా ప్రసిద్ధిగాంచిన ప్రాంతం. "వరంగల్లును పరిపాలించిన గొప్ప రాజవంశం కాకతీయ వంశం. వరంగల్ నగరానికి ఓరుంగల్లు, ఓరుగల్లు, కాకతీపురము అనే పేర్లు వ్యవహారంలో ఉన్నాయి. ఓరుంగల్లు శబ్దం నుండే వరంగల్లు, ఏకశిలానగరం, ఏకశిలాపురి, ఏకోవల అని సంస్కృతీకరించిన రూపాలు శాసనములందు, కావ్యములందు కలవని ఆదిరాజు వీరభద్ర రావు గారు తమ పరిశోధనలో తెలిపినారు. తెలుగు ప్రాంతమునంతటినీ పాలించిన కాకతీయులకు రాజధానిగా ఉన్న కారణంగా ఆంధ్రనగరి అని పేరు వచ్చింది.'' (ఆలోకనం. పుట-251) "క్రీ.శ.1504 కాలం నాటి షితాబ్ ఖాన్ వరంగల్ కోటలో వేయించిన శాసనంలో ఏకోపాలపురి, ఏకశిలాపురి అని ఉన్నది." (కాకతీయుల నుండి అసఫ్జాహీల వరకు తెలంగాణ: తె.సా. అకాడమీ, పుట-262,263) 2011 జనాభా లెక్కల ప్రకారం ఐదు రెవెన్యూ డివిజన్లు,51మండలాలు,1049 గ్రామాల సమాచారమున్నది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కొత్త జిల్లాల ఏర్పాటులో జనగామ, జయశంకర్ భూపాలపల్లి, మహబూబాబాద్, ములుగు, వరంగల్, హన్మకొండ అను ఆరు జిల్లాలుగా ఏర్పడింది. చారిత్రక ఆధార గ్రంథాల సమాచారంతో ఈ ఉమ్మడి జిల్లాలోని కొన్ని గ్రామ నామాలను చర్చిస్తున్నాను.



**కొరవి/కురవి:** కురవి పేరుతో పిలువబడుతున్న మండల కేంద్రమిది. "క్రీ.శ.935కాలం నాటి ముదిగొండ చాళుక్య నిరవద్యుని కొరవి శాసనంలో రెండవ వైపు ఐదవ పంక్తిలో కొరవి' అని ప్రస్తావించబడినది." (మీరూ శాసనాలు చదవొచ్చు: ఈమని శివనాగిరెడ్డి స్థపతి. పుట-279) కాల క్రమంలో కొరవి'యే కురవి'గా మారింది.

**జనగామ:** జైనం విలసిల్లిన ప్రాంతం కావునా పూర్వపు జైన్ గావ్ నుండే జనగామ'గా రూపాంతరం చెందింది. జైనులను సిద్ధులు, వేములు అంటారు. జైన తీర్థంకరులను వేల్పులుగా కొలుస్తారు. సిద్దెంకి గ్రామం, సిద్ధుల గుట్ట, వేల్పు కొండ, వేములతోట, వెల్ల వేముల, ఎల్లంల ఇట్లా జైన సంబంధ గ్రామ నామాలు, గుట్టలు ఉన్నాయి. జైన మతాన్ని అవలంబించిన రాష్ట్ర కూటులకు, కళ్యాణి చాళుక్యులకు కొలనుపాక రాజధాని. వీరి కాలంలో వేసిన శాసనాలు జైన బసదులకు దానమిచ్చిన వివరాలను తెలుపుతున్నాయి. (ఆలోకనం. పుట-65)

**పాలకుర్తి:** జనగామ జిల్లాలోని మండల కేంద్రమిది. "తెలంగాణ ప్రాచీన కవి పాల్కురికి సోమనాథుడి జన్మస్థలమిది. సోమనాథుడి కాలంలో పాలకురికి అని వ్యవహారంలో ఉండేది. సి.పి బ్రౌన్ కాలం నాటి నుండి పాలకురికి'ని సోమనాథుడి నివాస స్థలముగా విశ్వసిస్తున్నారు. పాలకుర్తి సమీపంలో ఎలకురికి, ఉరికురికి అనే గ్రామ నామాలు ఎలకుర్తి, ఉరికుర్తి'గా వ్యవహరిస్తున్నారు.'' (శ్రీవండితారాధ్య చరిత్ర : పరిష్కర్త డా.చిలుకూరి నారాయణ రావు, 1939.పుట-09) అట్లాగే పాలకురికి నుండి పాల్కురికి పాలకుర్తి'గా పరిణామం చెందినదది.

**బమ్మెర:** పాలకుర్తి మండలం లోని గ్రామమిది. సుప్రసిద్ధ తెలుగు కవి బమ్మెర పోతన జన్మ స్థలమిది. "క్రీ.శ.1124 కాలం నాటి విరియాల కామవసాని గూడూరు శాసనంలో విరియాల వంశానికి చెందిన మల్లుడు నిర్మించిన మల్లేశ్వరాలయానికి ఈ గ్రామాన్ని దానం చేసిన సందర్భంగా శాసనంలో ఈ గ్రామ నామం బమ్మరిగె (బమ్మెర) అని ప్రస్తావించ బడినది."(అలనాటి మేటి తెలంగాణ శాసనాలు: ఈమని శివనాగిరెడ్డి స్థపతి. పుట-115) కాల క్రమంలో బమ్మరిగె నామం బొమ్మెర'గా, బమ్మెర"గా పరిణామం చెందినది.

**మహబూబాబాద్:** "ఈ నగరాన్ని మానుకోటగా కూడా పిలుస్తారు. చుట్టూ మ్రానులతో నిండి ఉన్న మట్టికోట ఇక్కడ ఉండేది. అందువల్లనే దీనికి మ్రానుకోట పేరు వచ్చిందని చారిత్రక కథనం. తద్వారా మ్రానుకోట'యే మానుకోట'గా స్థిరపడింది. ఆరవ నిజాం మహబూబ్ అలీఖాన్ నివాసముండిన ప్రాంతం కనుక అతని జ్ఞాపకంగా ఈ పట్టణానికి మహబూబాబాద్ అనే పేరుతో పిలువ బడుతున్నది."

(ఆలోకనం. పుట-157)


**ములుగు:** "ఈ ప్రాంతంలో దొరికిన ప్రాచీన మానవుల పనిముట్ల ప్రాచీనత ఆధారంగా, 'ములుగు' పద ప్రాచీనత ఆధారంగా కొందరు చరిత్రకారులు శాసనాలలో అశ్మక రాజ్యంతో కలిపి పేర్కొనబడిన 'ములకరాజ్యం' ఈ ప్రాంతమేనని వాదించారు." (తెలంగాణలో కొత్త విహార స్థలాలు: డా.ద్యావనపల్లి సత్యనారాయణ, పుట-55) ములుగు ప్రాంతంలో అడవులు





ఎక్కువగా ఉండడం వలన సంవత్సరమంతా మేఘాలతో ఆవరించి ఉండేదని, ఆ మేఘాలను స్థానిక భాషలో "మొగులు" అని పిలిచేవారు. మొగులు నుంచి ములుగు'గా మారిందన్న ఐతిహ్యమున్నది.

రామప్ప శాసనం వెంకటాపూర్ మండలం పాలంపేట గ్రామ పరిధిలోనిది. "క్రీ.శ.1213 కాలం నాటి రేచర్ల రుద్రుడు వేయించిన రామప్ప దేవాలయ శాసనంలో ఆతుకూరు, నెక్కొండ, విప్పర్లపల్లి, బొర్లపల్లి, నడికుడి అనే గ్రామ నామాల ప్రస్తావనలున్నవి." (మీరూ శాసనాలు చదవొచ్చు: ఈమని శివనాగిరెడ్డి స్థపతి. పుట-401) నాటి శాసన రూపాలు ప్రస్తుతం ఆత్మకూరు, నెక్కొండ, ఉప్పర పల్లి, బోర్లపల్లి, నడికుడి'గానూ వ్యవహరిస్తున్నారు.



**వల్మిడి:** పాలకుర్తి మండలం లోని గ్రామమిది. "క్రీ.శ.1567 ఇబ్రహీం కుతుబ్ షా కాలం నాటి వల్మిడి శాసనంలో మూడోవైపు ఆరవ పంక్తిలో వలిమిడి' అని ప్రస్తావించ బడినది." (కొత్త తెలంగాణ శాసనాలు: శ్రీరామోజు హరగోపాల్. పుట-198) వలిమిడి క్రమంగా వల్మిడి' గా మారింది. వాల్మీకిపురమనే ఐతిహ్యమున్నది.

**హనుమకొండ:** "కాకతీయుల కంటే ముందు ప్రస్తుత పద్మాక్షి, సిద్ధేశ్వరాలయాలు ఉన్న ప్రాంతాన్ని అనుమడు, కొండడు పరిపాలించారు. ఈ నాయకుల పేర్ల మీదుగానే ఈ ప్రాంతానికి అనుమకొండ, హనుమకొండ అనే పేరు వచ్చింది."(కాకతీయులు : పి.వి.పరబ్రహ్మ శాస్త్రి, పుట-49)

సిద్దేశ్వర చరిత్రలో అనుమడు, కొండడు ప్రస్తావన ఉన్నది. "అంబాల అనుమగిరి, అనుమకొండ, ఎలుగూరు, ఏకశిలానగరం, ఐయినవోలు, ఒడ్డపల్లి, ఒడ్డెపల్లి, ఓరుగల్లు, ఓషధిపురం, కందారం, కల్లూరు, కాళేశ్వరం, గంగాపురము, గణపవరము, గణపురము, గొట్టిపరు, చెర్వుపల్లి, పాలకుర్తి, పెద్ద శివనగరము, ప్రతాపగిరి, మొగిలిచర్ల, రాచర్ల రుద్రవరము, సిరిపురం, హనుమాద్రి మొదలగు వరంగల్ మరియు ఇతర ప్రాంతాల గ్రామనామాలు కనపడతాయి." (కాసె సర్వప్ప ప్రణీతము, శ్రీ సిద్దేశ్వర చరిత్రము : సంపాదకుడు ఖండవల్లి లక్ష్మీరంజనం. 1960)

ఉమ్మడి జిల్లా పరిధిలో ఇనుగుర్తి-ఇనుగుర్కి, ఎను మాష్ల-ఏనుబాముల, కట్యూరు-కట్టకూరు, కళ్లెం-కళ్యాణపురం, కుందవరం-కుందసముద్రం, ఖిలాషాపూర్-కిలాస్ పూర్, కొమురవెల్లి-కొమురెల్లి, గణపురం-గణపతిపురం, గుండెవుడి-గుండియాపూండి, గుమ్మడవెల్లి-గుమిడెల్లి, గురిజాల-గురిందాల, గూడూరు-గుముడూరు, చౌండవరం-చౌండసముద్రం, జాఫర్ ఘడ్-వేల్పుకొండ, టేకుమట్ల-తేకుంబెడ్డ, నేరెడు-నేరడ, బెక్కల్లు-బెక్కంటి, మట్టియలస్థలం-మట్టెవాడ, మడికొండ-మెట్టుగుట్ట, మాంగల్లు-మాగల్లు, మొగిలిచర్ల-మొగిలిచెరువు/కేతకీ తటాక పురము, వంతడుపుల-అంతడుపుల, శనిగరం-శృంగవరం, స్తంభాలపల్లి-కంబాలపల్లి' వంటి అనేక గ్రామ నామాల రూపాలు కనబడుతవి.

-డా. మండల స్వామి
m : 9177607603
e : mandala.smy@gmail.com



# కాలంతో పయనించేవాడే కవి

## దక్కన్‌ల్యాండ్ సంపాదకులు మణికొండ వేదకుమార్

కాలంతో పయనించేవాడే కవి అని, కాలానుగుణంగా వర్తమాన అంశాల్ని ఒడిసి పట్టుకుని కవిత్వం రాయడమే కవి యొక్క పని అని ప్రముఖ సామాజికవేత్త, దక్కన్ ల్యాండ్ మాసపత్రిక సంపాదకులు మణికొండ వేదకుమార్ పేర్కొన్నారు. లుంబిని పాఠశాల, పాలమూరు సాహితి సంయుక్త ఆధ్వర్యంలో ఏప్రిల్ 7న మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని లుంబిని పాఠశాలలో నిర్వహించిన శ్రీ క్రోధినామ ఉగాది సంవత్సర ఉగాది కవిసమ్మేళన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్తమాన సమస్యలను ప్రపంచానికి చాటే విధంగా కవి ప్రయత్నిస్తాడని, ఆ ప్రయత్నంలోనే భాగంగానే సమాజ మార్పును కవి ఆహ్వానిస్తాడని ఆయన అన్నారు. అలాగే పర్యావరణానికి అనుకూలంగా కవులు కవిత్వం రాయాలన్నారు. అప్పుడే సమాజం సుభిక్షంగా ఉంటుందన్నారు. ఉగాది కవిసమ్మేళనాన్ని ప్రతి సంవత్సరం నిర్వహించడం గొప్ప విషయమన్నారు. సభకు అధ్యక్షత వహించిన కె. లక్ష్మణ్ గౌడ్ మాట్లాడుతూ గత ఇరవై సంవత్సరాలుగా లుంబిని పాఠశాలలో ఉగాది కవి సమ్మేళనాన్ని క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నామని, ఈ సందర్భంగా ఎంతోమంది యువకవులను ప్రోత్సహిస్తున్నామని పేర్కొన్నారు. ప్రధాన వక్త, ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు శాఖ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.రఘు మాట్లాడుతూ కవులు పఠనాసక్తిని పెంపొందించుకోవాలని, పఠనం ద్వారానే కవిత్వం రాణిస్తుందన్నారు. సమకాలీన సామాజిక, రాజకీయ అంశాలను గ్రహించి కవి తనదైన లోచూపుతో కవిత్వం ఆవిష్కరించాలన్నారు. నిరంతరం గ్రంథపఠనం చేయడం వల్ల అనేక కొత్త అంశాలని కవులు తెలుసుకుంటారన్నారు. కావున కవులు ప్రసిద్ధమైన కవులు రాసినటువంటి కవిత్వాన్ని చదవాలన్నారు. కేవలం ఉగాది సందర్భంగా కాకుండానే నిరంతరం కవితారచన చేయాలన్నారు. విశిష్ట అతిథి, ప్రముఖ న్యాయవాది వి. మనోహర్ రెడ్డి మాట్లాడుతూ పాలమూరు జిల్లాలో ఎంతోమంది నూతన కవులు ఆవిర్భవిస్తున్నారని, వారి కోసం ఎన్నో సాహిత్య సంస్థలు ప్రోత్సహిస్తుండడం అభినందనీయమన్నారు. అలాగే శ్రీ క్రోధినామ సంవత్సర ఉగాది పురస్కారాలను ప్రసిద్ధ నటులు బెల్లం సాయిలు, కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కార గ్రహీత తగుళ్ల గోపాల్ లకు అందజేశారు.



ఈ కార్యక్రమంలో ఆత్మీయ అతిథులు కోట్ల వెంకటేశ్వర రెడ్డి, ఒద్దిరాజు ప్రవీణ్ కుమార్, కార్యక్రమ సంయోజకులు డాక్టర్ భీంపల్లి శ్రీకాంత్, వనపట్ల సుబ్బయ్య తదితరులు మాట్లాడారు. ఈ సందర్భంగా మణికొండ వేదకుమార్ సంపాదకత్వంలో వెలువడుతున్న "బాలచెలిమి" పిల్లల మాసపత్రికను పిల్లలు ఆవిష్కరించారు. ఈ కవిసమ్మేళనంలో ఉమ్మడి జిల్లా నుంచి ఎనభైమందికి పైగా కవులు కవితాగానం చేశారు. పాల్గొన్న అందరికీ మెమెంటోలతో సన్మానం చేశారు.

– భీంపల్లి శ్రీకాంత్
m : 9032844017
e: srikanth.bheempally@gmail.com



# ముత్తాతల కాలం నాటి జీవామృతాలు

# తృణధాన్యాలు

తృణధాన్యాలు పదివేల సంవత్సరాలుగా మానవ ఆహారంలో ఒక భాగం. అయితే ఆధునిక ఆహారం మనజీవితాల్లోకి చేరడంతో ప్రకృతి ప్రసాదితాలను పక్కకు పెట్టాం. అయితే మనం తీసుకుంటున్న  పాలియో డైట్ వంటి అనేక ఆధునిక ఆహారం ఆరోగ్యానికి హానికరమని.. పోషకాహార నిపుణులుహెచ్చరిస్తూనే ఉన్నారు. శుద్ధి చేసిన ధాన్యాలు అధికంగా తీసుకోవడంవలన ఊబకాయం వంటి అనేక ఆరోగ్య సమస్యలు ఏర్పడుతున్నాయి. అయితే తృణధాన్యాలు మంచి ఆరోగ్యకరమైన శరీరానికి హాని కలిగించని ఫుడ్. తృణధాన్యాలు తినడం మధుమేహం, గుండె జబ్బులు, అధిక రక్తపోటుతో అనేక వ్యాధులను నివారిస్తుంది. తృణధాన్యాలు తినడం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలు గురించి తెలుసుకుందాం.

భారతదేశములో అధికంగా వినియోగించే తృణధాన్యాలు వరి, గోధుమ. అధికంగా వినియోగించే చిరుధాన్యాలు జొన్నలు, సజ్జలు, రాగులు, కొర్రలు, సామలు, అరికెలు, ఊదలు, అవిసెలు.. వీటినే తృణ ధాన్యాలు అంటారు. వీటిలోని పిండి పదార్ధాల వల్ల దైనందిన అవసరాలకు సరిపడా శక్తిని 70-80 శాతం ఇస్తాయి. అంతేకాదు ఇతర పోషకపదార్ధాలైన మాంసకృత్తులు, కాల్షియం, ఐరన్, ప్రొటీన్లు, పీచు పదార్ధాలు, బికాంప్లెక్స్ విటమిన్లను కూడా అందజేస్తాయి. ఇవి మనిషికి వచ్చే రకరకాల వ్యాధులను దరిచేరనివ్వవు.

**తృణధాన్యాలు తీసుకోవాల్సిన విధానం:**

- తృణధాన్యాలను కాయధాన్యాలతో కలిపి తీసుకుంటే బియ్యం పప్పు లాగా మాంసకృత్తులను అధిక మొత్తంలో శరీరానికి అందిస్తాయి.
- ఉప్పుడు బియ్యం: ధాన్యాన్ని నీటిలో నానబెట్టి, ఆవిరిపట్టే ఉప్పుడు బియ్యం వస్తాయి. వీటిని ఆహారంగా తీసుకోవడం వలన శరీరానికి మంచి పోషకాలు విటమిన్లు అందుతాయి.
- రాగులు, జొన్నలు, సజ్జల్లో ఖనిజాలను, పీచును బాగా కలిగి ఉంటాయి. రాగుల్లో ఖనిజాలు ముఖ్యంగా కాల్షియం

అధికంగా ఉంటుంది. అలాగే బియ్యంలో కాల్షియం, ఐరన్ తక్కువగా ఉంటాయి. ఆహారంగా తీసుకుంటే శరీరానికి ఫైబర్ అంది.. తిన్న ఆహారాం త్వరగా జీర్ణమవుతుంది.

- తృణధాన్యాలు 6-12శాతం మాంసకృత్తులను కలిగి ఉంటాయి. అంతేకాదు వీటిల్లో అమినో ఆసిడ్ లైసిన్‌ను తక్కువగా ఉంటాయి. శరీరానికి నిత్యం అవసరమయ్యే మాంసకృత్తుల్లో 50శాతం అవసరాన్ని తీరుస్తాయి.
- తృణధాన్యాలు బి-విటమిన్లకు మంచివనరులు.
- మనం ఎలా, ఎంతమేరకు బియ్యాన్ని శుభ్రం చేస్తున్నామో, పాలిష్ పట్టిస్తున్నామో దానిమీద ఆధారపడి బియ్యములోని బి-విటమిన్ కోల్పోతున్నామో తెలుస్తుంది. ఎదుకంటే బియ్యపు గింజ యొక్క వెలుపలి భాగములోనే అధికశాతం విటమిన్లు ఉంటాయి. ఎక్కువ పాలిష్ పట్టించిన బియ్యంలో అతితక్కువ బి కాంప్లెక్స్ విటమిన్ ఉంటుంది.



- తృణధాన్యాలలో ఉండే క్రొవ్వుశాతం ప్రతి వందగ్రాములకు 2-5 గ్రాములుగా ఉంటుంది. తృణధాన్యాలు మనకు కావాల్సిన ఫాటీ ఆసిడ్ అవసరాల్లో 50శాతానికి పైగా తీరుస్తాయి. ఇది మనం ఎంతమేరకు ఎంత పరిమాణమములో తృణధాన్యాలను తీసుకుంటున్నామన్న దానిమీద ఆధారపడి ఉంటుంది. ఇక డాక్టర్లు కూడా ఆరోగ్యంగా పది కాలాల పాటు బతకాలంటే చిరు ధాన్యాలు లేదా తృణ ధాన్యాలను తినాలంటూ సూచిస్తున్నారు.

### కొన్ని జాగ్రత్తలు

చిరుధాన్యాల అన్నం, సంగటి కాస్త బిరకగా ఉంటాయి. త్వరగా ముద్ద దిగదు. కాబట్టి వేపుళ్లు కాకుండా కాస్త జారుగా ఉండే కూరలతో తినాలి.

చిరుధాన్యాలతో ఏది తయారుచేసినా ఏదో ఒక పప్పు (ప్రొటీన్) తోడుగా ఉండేలా చూసుకోవాలి. దీంతో పోషక స్థాయి పెరుగుతుంది. అన్నం వండుకున్నట్టయితే ఆకుకూర, కూరగాయల పప్పుతో కలిపి తినాలి. లేదా గుడ్డు, మాంసం కూరతోనైనా తినొచ్చు. పాలు, పెరుగు కూడా తీసుకోవచ్చు. బియ్యం, గోధుమల మాదిరిగానే చిరుధాన్యాల్లోనూ లైసిన్ అనే అమైనో ఆమ్లం తక్కువగా ఉంటుంది. దీన్ని భర్తీ చేయటానికి పప్పు తోడ్పడుతుంది. దీంతో అమైనో ఆమ్లం పూర్తిగా తయారై శరీర ఎదుగుదలకు ఉపయోగపడుతుంది.

### ఆరోగ్య సారథులు

చిరుధాన్యాల్లో పోషకాలు పెద్దమొత్తంలో ఉండటమే కాదు. వీటిల్లోని కొన్ని సంయోజ పదార్థాలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. నిజానికి వరి, గోధుమ వంటి పెద్ద ధాన్యాలు.. రాగులు, కొర్రలు, సామల వంటి చిన్న ధాన్యాలు రెండింటిలోనూ పిండి పదార్థాలు, మాంస కృత్తులు, కొవ్వు, కేలరీలన్నీ కొద్ది గొప్ప తేడాలతో దాదాపు సమానంగానే ఉంటాయి. అయితే ఇవి మెరుగైనవి కావటమే విశేషం. వరి, రాగులు, సామల్లో 7% మాంసకృత్తులుంటే.. గోధుమ, జొన్న, సజ్జలు, కొర్రలు, వరిగెలు, అరికెల్లో 10-12% వరకు ఉంటాయి. పిండి పదార్థమైతే- వరిలో 77%, గోధుమల్లో 64% వరకు.. చిరుధాన్యాల్లో 60-70% వరకు ఉంటుంది. కొన్ని చిరుధాన్యాల్లో 50-55 శాతమే ఉంటుంది. వీటి నుంచి 330-345 కిలో కేలరీల శక్తి లభిస్తుంది. బియ్యం, గోధుమల్లో 2% కొవ్వు ఉంటుంది. చిరుధాన్యాల్లో ఇది ఎక్కువ. అత్యధికంగా సజ్జలతో 5% వరకు కొవ్వు లభిస్తుంది. జొన్న, కొర్రలు, వరిగెల్లో 3 నుంచి 3.5% ఉంటుంది. ఈ కొవ్వు హాని చేసేది కాదు. మంచి శక్తిని ప్రసాదిస్తుంది. వీటిల్లో విటమిన్ ఇ కూడా ఎక్కువే. ఖనిజ లవణాల విషయంలో చిరుధాన్యాలదే పైచేయి. రాగుల్లో పాలతో సమానంగా 344 మి.గ్రా. క్యాల్షియం లభిస్తుంది. గర్భిణులకు, బాలింతలకు, చిన్న పిల్లలకు, వృద్ధులకు, జబ్బులతో బాధపడేవారికి ఇదెంతో మేలు చేస్తుంది. బియ్యం, గోధుమల్లో ఐరన్ అంతగా ఉండదు. చిరుధాన్యాల్లో ఇది మంచి పాళ్లలో లభిస్తుంది. ముఖ్యంగా సజ్జల్లో 8 మి.గ్రా., సామల్లో 9.3 మి.గ్రా ఐరన్ ఉంటుంది. రాగులు, జొన్నల్లో సుమారు 4 మి.గ్రా. ఉంటుంది. రక్తహీనత తగ్గటానికిది ఎంతో అవసరం. జీవక్రియల్లో పాలు పంచుకునే మెగ్నీషియం, మాంగనీస్, ఫాస్పరస్, జింక్ వంటివీ వీటిల్లో ఎక్కువే. ఇన్సులిన్ సరిగా ఉత్పత్తి కావటానికి మెగ్నీషియం.. ఎదుగుదలకు జింక్ తోడ్పడుతుంది. అయితే బియ్యం, గోధుమల్లో కన్నా చిరుధాన్యాల్లో థయమిన్ తక్కువగా ఉంటుంది. నైసిన్, పెరిడాక్సిన్, ఫోలిక్ యాసిడ్ వంటివి మాత్రం బాగానే ఉంటాయి. కొన్నింటిలో విటమిన్ ఎ, బీటా కెరటిన్లు కూడా ఉంటాయి.

- సముద్రాల ధనంజయ
(దేవర కొండ)



# జల్లేపల్లి పాఠశాల గ్రంథాలయం

**పాఠశాల స్థాపన**

జల్లేపల్లి పాఠశాల 1964లో స్థాపించబడింది. ఎందరో విద్యార్థులు ఈ పాఠశాలలో విద్యను అభ్యసించారు ముందుగా ఈ పాఠశాల యుపిఎస్‌గా ఉండేది. ఆ తర్వాత ఉన్నత పాఠశాలగా 1984లో అప్ గ్రేడేషన్ అయింది. మా పాఠశాల స్థాపించినప్పటి నుంచి గ్రంథాలయం విద్యార్థులకు చదువుకోటానికి అందుబాటులో ఉండేది. మా పాఠశాల గ్రంథాలయంలో పుస్తకాలను చదివి ఎందరో విద్యార్థులు విజ్ఞానాన్ని మరియు మంచి పాఠకులుగా వృద్ధి చెందారు.

**గ్రంథాలయ ప్రాముఖ్యత**

ముందుగా 500 పుస్తకాలతో స్థాపించిన గ్రంథాలయం ఆ తర్వాత దినదినాభివృద్ధి చెందుతూ, ఇప్పుడు పాఠశాలలో సుమారు 3000 పుస్తకాల వరకు ఉన్నాయి. కరోనా సమయంలో మా పాఠశాలకు ఆ ఊరి విద్యార్థులు మరియు గ్రామస్తులు చదువును మరచిపోకుండా గ్రంథాలయమును వినియోగించుకున్నారు. మా పాఠశాలలో విద్యార్థులు కొంతమంది శ్రీలేఖ, శివాని, ప్రణీత, ప్రేమ్ కుమార్, సంతోష్, గణేష్ వీరంతా బాలచెలిమి పుస్తకాలను చదివి కథలను రాసి, జిల్లా స్థాయిలో, రాష్ట్రస్థాయిలో ఎన్నో బహుమతులు గెలుచుకున్నారు.

**గ్రంథాలయ వారోత్సవాలు**

అంతేకాకుండా మేము ప్రతి సంవత్సరం గ్రంథాలయ వారోత్సవాలు జరుపుతున్నాం.

నేను ఏ. ఝాన్సీ లక్ష్మి 2018 నుంచి ఈ పాఠశాలలో పని చేస్తున్నాను. 2018 నుంచి మొన్నటి సెప్టెంబర్ 10-07-2023 నుంచి 15-07-2023 వరకు ఇలానే ఆరు సంవత్సరాల నుంచి కరోనా సమయంలో మినహా ఘనంగా గ్రంథాలయ వారోత్సవాలు జరుపుతున్నాం. పుస్తకాలు, కథలు చదవడం కాకుండా కొత్త విషయాలను తెలుసుకుంటూ, రచన శైలిని గమనిస్తూ, విద్యార్థులు కూడా బాలకవులుగా, రచయితలుగా ఎదుగుతున్నారు. దీనికి బాలచెలిమి పుస్తకాలు ఎంతో ఉపయోగకరంగా ఉన్నవి అనడంలో ఎటువంటి సందేహం లేదు.

**బాల చెలిమి సహకారం**

మా గ్రంథాలయానికి సుమారు వెయ్యి బాలచెలిమి పుస్తకాలను వేదకుమార్ సార్ మా గ్రంథాలయానికి ఇచ్చి వారి గొప్ప మనసును చాటుకున్నారు. గరిపల్లి అశోక్ సారు సమన్వయం మరిచిపోలేనిది. ఆ పుస్తకాలను చదవడం వలన ప్రేరణ పొంది మా విద్యార్థులతో కృష్ణయ్య సార్ మేము కలిసి పుస్తకాలను విద్యార్థుల చేత కథలు, కవితలను రచింపచేసాము.

**విద్యార్థుల రచనలు**


కడివేడు పూలు, జల్లేపల్లి బాలల కలాలు, కథల తోట, జల్లేపల్లి పిల్లల కథలు పుస్తకావిష్కరణ చేసుకున్నాం. ఈ కార్యక్రమానికి డి.ఇ.ఓ గారు సోమశేఖర్ శర్మ గారు రావడం జరిగింది. ప్రముఖ రచయిత్రి సునంద మేడం వారు రచించిన పుస్తకాలలో మా విద్యార్థులు కథలను కూడా చేర్చడం జరిగింది. ఇది మా విద్యార్థుల మరియు బాలచెలిమి పుస్తకాల కృషి అని చెప్పవచ్చు. మేము ప్రతిరోజు లైబ్రరీ పీరియడ్ విద్యార్థుల చేత చదివించడం జరుగుతుంది. అలాగే వారిలో పఠనా శక్తిని పెంపొందించడం, బాలచెలిమి పుస్తకాల వలనే జరిగింది అనటంలో ఎటువంటి అతిశయోక్తి లేదు. అంతేకాకుండా మా విద్యార్థుల చేత పుస్తక సమీక్షలు గ్రంథాలయ పుస్తకంలో రాయించడం జరిగింది.

**ముగింపు**

మా పాఠశాలకు ఇంకా ఎన్నో పుస్తకాలను బాల చెలిమి నుండి వేదకుమార్ సార్, అశోక్ సార్ మాకు ఎన్నో పుస్తకాలను ఇచ్చి మా గ్రంథాలయ అభివృద్ధికి తోడ్పడతారని, వారి గొప్ప మనసును చాటుకుంటారని తెలియజేస్తూ, వారికి ఇవే మా పాఠశాల తరపున, నా తరపున వేల వేల కృతజ్ఞతాభివందనాలు.

**- ఏ ఝాన్సీ లక్ష్మి,**
L.P.T జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,
జల్లేపల్లి, తిరుమలపాలెం మండలం,
ఖమ్మం జిల్లా.

# అందరి కోసం




పిల్లలకు అత్యంత ఆనందానిచ్చేది ఆట బొమ్మలు.,కథల పుస్తకాలే. పాఠ్య పుస్తకాలు అందించే జ్ఞానానికి సమాంతరంగా మరెంతో లోకజ్ఞానాన్ని అందించేది బాల సాహిత్యమే. భాషకు సంబంధించిన ప్రాథమిక పరిజ్ఞానాన్ని అందించేవి కథలే. కొత్త కొత్త పదాలను పరిచయం చేసేది కథల పుస్తకాలే. పుస్తకాలు పిల్లల ఆలోచనా నైపుణ్యాలను పెంచుతాయి. వారి ఊహలకు ప్రాణం పోస్తాయి. వారిలో సృజనాత్మకతను పెంచుతాయి.

పిల్లలలో నైతికతను, సక్రమమైన ప్రవర్తనను, మంచి చెడుల అవగాహనను పెంచే బాధ్యతను ఉమ్మడి కుటుంబాల్లో నాయనమ్మలు, అమ్మమ్మలు చెప్పే కథలు నెరవేర్చేవి. మారిన పరిస్థితులలో ఆ బాధ్యతను బాల సాహిత్యమే నెరవేర్చగలదు.

ఈ మే నెలలో బాలచెలిమి పర్యావరణ కథల పోటీలు – 2023 నిర్వహించింది. తక్కువ సమయంలోనే, వేసవి సెలవులు అయినప్పటికీ విద్యార్థుల నుంచి మంచి స్పందన లభించింది. మొత్తం 51 కథలు వచ్చాయి. కథలన్నీ చాలా బావున్నాయి. బాల సాహిత్య నిపుణులు ఈ కథలను చదివి, చర్చించి ప్రచురణకు 24 కథలు ఎంపిక చేశారు. ఈ కథల పోటీలు నిర్వహించి మరియు పుస్తక రూపాన్నిచ్చింది బాలచెలిమి. – వేదకుమార్ మణికొండ

రామాపురం అనే ఒక గ్రామం ఉండేది. ఆ ఊరికి సెల్‌ఫోన్ సిగ్నల్ సరిగ్గా వచ్చేది కాదు. ఏదైనా ఫోన్ మాట్లాడాలి అంటే ఊరి చివరకు వెళ్లి మాట్లాడాలి. ఇలా కొన్ని రోజులు గడిచాయి. ఒక రోజు బాగా చదువుకున్న రాజు రామాపురానికి వచ్చాడు. అతను సెల్‌టవర్ స్థాపించే వ్యాపారవేత్త. రాజుకు హఠాత్తుగా ఒక ఫోన్ కాల్ వచ్చింది. కానీ అక్కడ సిగ్నల్ లేకపోవడంతో అతను వచ్చిన ఫోన్ కాల్ మాట్లాడ లేకపోయాడు. అయితే రాజు గ్రామంలో ఒక వ్యక్తిని ఇలా అడిగాడు.



"ఏమైంది ఈ ఊరిలో ఫోన్ మాట్లాడడానికి సిగ్నల్ ఉండదా" అని అడిగాడు. అప్పుడు ఆ వ్యక్తి "అవును సార్ ఈ ఊరిలో సిగ్నల్ ఉండదు. ఫోన్ మట్లాడాలి అంటే ఊరి చివరకు వెళ్లాలి" అని చెప్పాడు.

ఆ మాట వినగానే రాజుకి ఒక దుర్బుద్ధి కలిగింది. నేను ఇక్కడ సెల్ టవర్ స్థాపిస్తే నాకు చాలా ఆదాయం వస్తుంది. నేను ఇక్కడ సెల్ టవర్‌ను స్థాపిస్తాను అని అనుకున్నాడు. అదే విధంగా ఊరివారితో మాట్లాడాడు. రామాపురం ఊరు ప్రజలు ఎక్కువగా చదువుకోకపోవడంతో వారికి టవర్ వేయడం వలన కలిగే నస్టాలు తెలియదు. కానీ చింటూ అనే ఒక చదువుకున్న యువకుడు టవర్ వలన కలిగే నష్టాలు చెప్పాడు. కానీ వారు ఎవరు పట్టించుకోలేదు వారు ఒకటే ఆలోచించారు. సిగ్నల్ వస్తే ఇంట్లోనే మాట్లాడుకోవచ్చు అని అనుకున్నారు.

అనుకున్న విధంగానే టవర్‌ను స్థాపించారు. ఇలా కొన్ని రోజులు గడిచాయి మెల్లి మెల్లిగా సమస్యలు మొదలయ్యాయి. చుట్టుపక్కల ఉన్న పక్షులు ఆ టవర్ నుండి వచ్చే రేడియేషన్ వల్ల చనిపోయాయి. అలాగే కడుపుతో ఉన్న గర్భిణీ స్త్రీలలో ఉన్న శిశువుకి ఊపిరి ఆడక పోవడం, పుట్టిన పిల్లలు అవిటిగా పుట్టడం వంటి సమస్యలు మొదలయ్యాయి. ఈ సమస్యలు గ్రామ ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేశాయి. ఇది అంతా చూసిన తర్వాత ఆ గ్రామ ప్రజలు ఒక నిర్ణయానికి వచ్చారు.

ఎలా అయినా మన ఊరిలో ఈ టవర్‌ని తొలగించాలి అని అనుకున్నారు. అనుకున్న విధంగానే రాజుని పిలిపించి టవర్ తీసివేయమని అన్నారు. రాజు కుదరదు అన్నాడు. గ్రామ ప్రజలు ఇలా అన్నారు. నువ్వు తీసివేయకపోతే నిన్ను పోలీసులకు అప్పగిస్తాము. మాకు దానివల్ల కలిగే లాభం మాత్రమే చెప్పావు. టవర్ వలన కలిగేనష్టాలు చెప్పలేదు. అమాయకులను చేసి ఆడుకున్నావు. అని చెప్పి నీ పైన పోలీసు కంప్లైంట్ చేస్తా అని అన్నారు. అయినా రాజు భయపడక మీకు నచ్చింది చేసుకోమని చెప్పాడు. అందరికీ ఫోన్ సిగ్నల్స్ అవసరం కాని వాటిని అందించే సెల్‌ఫోన్ టవర్లు కూడా కావాలి. అవి ప్రజలకు ఎలాంటి ప్రమాదాలు, అపాయాలు జరుగకుండా పశుపక్ష్యాదుల ఉనికి ప్రశ్నార్థకం గాకుండా ఉండాలి అని విన్నవించగా సరేనన్నారు. సెల్‌ఫోన్ కంపెనీ వారు రాజు ప్రయత్నం ఫలించినందుకు అభినందించారు.

– కె. రేవతి, ఫోన్ : 9441762105

Oxford
Grammar High School

KNOWLEDGE IS POWER

OGS JUNIORS
grow naturally

43 YEARS OF MERITORIOUS PERFORMANCE




# We make school time the best time for your kids

At OGS Juniors, all the children are given a warm, safe, and stimulating environment so that they can grow to become individuals while exploring, imagining, creating, and playing.

- **Loving atmosphere & play ground**
- **CCTV surveillance**
- **Certified teachers & caring staff**
- **Kids zone & play area**
- **Interactive & Value based Learning**

**CARING TEACHERS & STAFF**
Your child will get the best care and attention

**ECO-FRIENDLY PRACTICES**
We let the children play with nature friendly material

**HUGE PLAYGROUND**
Your child will get lots of fresh air and playtime

**INTERACTIVE LEARNING**
Our trusted method helps your child communicate and learn with ease.

**Street No. 13, Himayathnagar, Hyderabad | Ph : 040 2763 6214, 99590 20512**

DECCAN LAND, Telugu Monthly Magazine Date of Publication 26th - April 2024
ISSN 2581-3188 Postal Dates: 28th & 29th Every Month

PRGI Regn.No. TELTEL/2012/46784
Postal Regn.No.HCD/1167/2024-2026




Edited, printed, published and owned by Manikonda Vedakumar,
Printed at Deccan Press, 1-9-1126/B, Azamabad, Hyderabad-500020, Telangana,
Published at CHANDRAM, 3-6-712/2, 12th Street, Himayatnagar, Hyderabad-500029, Telangana, Editor Manikonda Vedakumar